# సద్గురు శ్రీ సుబ్బరామయ్య సార్ లేఖలు




**జననం : జూలై 15, 1939** **మహా సమాధి జూన్ 9, 2017**

ఈ గ్రంధ రచనకు సహకరించిన వారందరికీ హృదయపూర్వక నమస్కారములు! అందరికీ సద్గురు శ్రీ సుబ్బరామయ్య మహారాజ్ గారి ఆశీస్సులు సదా ఉండాలని, అనుభవించాలని ప్రార్థిస్తున్నాము.

శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా



**అంకితము: శ్రీ గురు మూర్తుల పాదపద్మములకు**

**మనవి:** శ్రీ సద్గురు పెసల సుబ్బరామయ్య గారు 2017 జూన్ 9 వ తేదీన (జ్యేష్ట శుద్ధ పౌర్ణమి) మహాసమాధి చెందారు. వారి రెండవ ఆరాధన సందర్భంగా వారు వివిధ సందర్భాలలో వేరువేరు భక్తులకు వ్రాసిన లేఖలను (ఉత్తరాలను) నలుగురితో పంచుకోవాలన్న సత్సంకల్పమే ఈ చిన్ని సంచిక. ఈ గ్రంధాన్ని అందరూ శ్రద్ధగా చదివి సార్ సూచనలను అందుకొని, యొక్క అనుగ్రహ ఆశీస్సులు పొందగలరని ప్రార్ధిస్తున్నాము.

**సేకరణ:** సాయి శివ, సాయి సుబ్రహ్మణ్యం, నగేష్, ప్రసాద్

**పర్యవేక్షణ:** శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ సభ్యులు

**ప్రాప్తిస్థానము:** శ్రీ సాయిమాస్టర్ సేవా ట్రస్ట్, గొలగమూడి, నెల్లూరు జిల్లా – 524321

# సార్ లెటర్లు

శ్రీ సార్ తనను, స్వామిని ఆశ్రయించిన వారిని ఆదుకుని నడిపించే రీతులలో ఒకముఖ్యమైన పంథా లెటర్స్. లెటర్స్ ద్వారా సార్ ఎందరికో మార్గ దర్శక సూచనలు ఇవ్వటమే కాక వారి దివ్య శక్తితో మిళితమైన వారి లిఖిత వాక్యాలు సూటిగా చదివిన వారి హృదయాల లోనికి చొచ్చుకొనిపోయి అవసరమైన అద్భుత మార్పు తేవటం ఎందరికో అనుభవం. సార్ letter లలో విద్యార్థులకు, గృహస్థులకు, సాధకులకు, ఉత్తమ ధర్మాచరణకు, సాధనకు, శరణాగతికి, సద్గురుసేవకు మొ|| అన్ని తరగతుల వారికీ, అన్ని వయస్సుల వారికీ తగ్గ సూచనలు ఉన్నాయంటే అతిశయోక్తి కాదు. మచ్చుకు కొన్ని ఇచ్చట పొందుపరచటమైనది.

ఈ ఉత్తరాలలో సార్ ప్రేమ పూర్వక సలహాలను, సందేశలను మనం పొంద గలగటమే కాక, తీవ్ర విచారణచే కాని అవగాహనకు వీలుకాని, సార్ కు సహజ సిద్ధమైన ఎంతో ఉన్నతమైన ధార్మిక భావాలను, సార్ అనుభవంతో సూచించిన ఆచరణ సౌలభ్య మార్గాలను, మనకు ఆప్తులు, గురుదేవులు అయిన సార్ ఆదేశాలను, తపశ్శక్తితో మిళితమైన సార్ ఆశీస్సులను మనం అందుకోవచ్చు.

ఈ పుస్తక రూపంలో శ్రీ సార్ letter లను కుర్చుకోవటం లో భావం, శ్రీ సార్ సాంగత్యం భౌతికంగా పొందిన మనకు, సార్ని చూడని వారికి కూడా భగవత్ స్వరుపులు, నిత్య సత్యు లైన శ్రీ సార్ మననుండి ఏమి కోరుచున్నారో మరల మరల హృదయగతం చేసుకొని ఆచరణ సాధ్యం చేయుటకు విశేష ప్రయత్నం చేయగల రితి నడుపమని మరింతగా ప్రార్థించ గాలుగుతామని, సార్ ను నిజంగా ఆశ్రయించిన వారము కావాలనే.

**ధ్యాన మూలం గురుర్ మూర్తి: - పూజ మూలం గురుర్ పాదం**

**మంత్ర మూలం గురుర్ వాఖ్యం - మోక్ష మూలం గురుర్ కృపా !**

# విషయ సూచిక


| క్రమ సంఖ్య | విషయం | పేజీ నెంబరు |
|---|---|---|
| 1 | ప్రార్థన చేసే విధానం | 4 |
| 2 | విద్యార్థులకు సార్ సందేశం | 6 |
| 3 | ధర్మాచరణ ఎలా సుగమం అవుతుంది ? | 22 |
| 4 | నిష్కామ కర్మ- కర్మ సుకౌశలం | 48 |
| 5 | సార్ సూచించిన ఉత్తమ జీవన విధానము | 55 |
| 6 | సాధన –నియమ పాలన | 71 |
| 7 | సంపన్నత్వం – సద్గురుసేవ | 99 |
| 8 | శరణాగతిలోనే జీవించటం ఎలా ? | 112 |


# ప్రార్థన చేసే విధానం

**సద్గురువుకు  పగ్గాలు అప్పచెప్పడం అంటే ఏమిటి ?**

భగవంతుడు ఎంతో సన్నిహితంగా నిరంతరం మన వైపు చూస్తూ, మన మంచిచెడ్డలు చూస్తూ మనకు మంచినే చేస్తారనే నమ్మకం ఉంచుకోవాలి. ఆయన మన పిలుపుకు  పలుకుతారా? అనే సంశయం ఉన్నప్పుడు కోరికలు కోరవచ్చు. ఒక స్థితికి పోయాక అందరిలాగా కోరికలు కోరడం ఆయనకు సంతోషం కలిగించదు. ఇలాంటి జన్మలు ఎన్ని రావాలో? వాటన్నింటిలో ఆయన అండ దండలు మనకు ఉండాలి కదా! అలాంటప్పుడు ఆయనకు బాధ కలిగించి మనం ఆయనకు దూరం కాకూడదు. నాకేమీ తెలియదు. నీ ఇష్టం వచ్చినట్లు చెయ్యి. నేను నీ అండన ఉండేటట్లు చేయి ప్రభు. ఏ ఋణానుభంధాలు ఎలా తీరుస్తావో అంతా నీ దయ.

**నేను నిశ్చలంగా నా సర్వకర్మలు నీ సేవగా భావించి చేసే బుద్ధికుశలత ప్రసాదించు. కర్మసుకౌశలం అంటే ఏమిటో ఎలా ఆచరించాలో నాచేత చేయించు. నన్ను నీ వాడిగా చేసుకొని నిరంతరం నన్ను నీ ప్రక్కన ఉంచుకో. నీవు నా వాడివైతే నాకేమి కావాలి. నాకేమీ అక్కరలేదని హృదయపూర్వకంగా నిరంతరం ప్రార్థించు. కోరికలే మనల్ని ఆయనకు దూరం చేస్తాయి. నిరంతరం గుర్తుంచుకొని జీవిత యాత్ర సాగించు. నీవు నాతో ఏమి చేసుకుంటావో చేసుకో. నేను ఇంద్రియలోలుడను అని మీకు తెలుసు. ఇలాంటి నన్ను నీ పరికరంగా మార్చుకో. కష్టాలే ముందు రావాలో సుఖాలే అనుభవించాలో ఎప్పుడు ఏది ఎలా జరగాలో నాకేమి తెలుసు? ఓ సర్వజ్ఞమూర్తి నిరంతరం ఈ లౌకిక చింతల నుండి నన్ను దూరం చేసి పగ్గాలు హృదయ పూర్వకంగా నీకప్పగించి, నిశ్చింతగా ఏ కోరికలు కోరకుండా జరిగేదంతా చూస్తూ ఉండగలిగే బుద్ధికుశలత ప్రసాదించు ప్రభూ అని మరల మరల ప్రార్థించు. అంతే తప్ప నాకు ఇది కావాలి అన్నామంటే మనం ఆయనకు దూరం అవుతున్నానని గుర్తుంచుకో.**

Guide గా బాబా ఉండగా ఇక దిగులే లేదు. మనం తెలియక తప్పు చేయాలన్నా చేయనివ్వరు. **"మీ ఇష్టం వచ్చినట్లు ఈ దేహాన్ని నడిపించు తండ్రి" అని హృదయ పూర్వకంగా ప్రార్థిస్తూ ఉండు.** మిగతా విషయాలన్నీ వారే చూసుకుంటారు.

గట్టిపట్టుతో సాగే వారికి ఒక్కే ఒక్క మాట చాలు. **"నిస్సహాయుడనై నీ పాదముల నాశ్రయించాను. నా సర్వ బాధ్యతలు నీవే ప్రభూ. మాయ నా దరి చేరకుండా మీరే చేయాలి. మా బహిరంతరముల యందున్న మిమ్ములను అనుక్షణం గుర్తించుచూ మీ ఆజ్ఞలను తు||చ|| తప్పకుండా పాటించేటట్లు నాకు**

**శక్తి ప్రసాదించు ప్రభూ" అని** క్లుప్తంగా చెప్పుకో. **హృదయ పూర్వకంగా చెప్పు.** ఆ ప్రార్ధనలో నీ సాధనలో వచ్చే ఇబ్బందులు, doubtలు అన్ని వారికి విన్నవించుకో. అది living ప్రార్థన.

-శ్రీ సుబ్బరామయ్య సార్

**"నన్ను మనిషిగా పుట్టించావు. ఏమి చేయాలో తెలియదు. నా ద్వారా నీ సంకల్పమేమిటో నెరవేర్చుకో. నేను నీ సంకల్పం నేరవేర్చేటట్లు నన్ను అనుక్షణం నడిపించు"** అని మాత్రం ప్రార్ధిస్తుంటాను. -శ్రీ సుబ్బరామయ్య సార్

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

# విద్యార్థులకు సార్ సందేశం

శ్రీ సాయినాధాయ నమః

ఓం శ్రీ సాయిరాం

గొలగమూడి

17-12-1998

శ్రీమతి భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయటం.

మీ లెటర్ చేరినది. **ముందు మనం కృషి చేయాలి. తర్వాత శ్రీ స్వామివారి ఆశీస్సులు లభిస్తుంటాయి.** వారెంతో కరుణా మయులు. **మనం వారిని స్మరించని కాలంలో కూడా వారు మనతో ఉండి మనలను కనిపెడుతుంటారు. కానీ నిరంతరం మనతోనే ఉంటూ మనలను కష్టసుఖాలలో వెంట నుండే దైవాన్ని వదిలి మనం అన్ని విధాలా బాగున్నప్పుడు వాళ్ళ స్వార్థానికి ఉపయోగపడుతున్నప్పుడు మాత్రమే మనతో ఉండే స్నేహితులు, బంధువులను మాత్రమే చేరుతుంటాము.** వారితో స్నేహం చేస్తుంటాము. **ఆ మాత్రం దైవంతో స్నేహం చేయలేము. ఇదే మాయ.**

**మొదట మనం మన కొరకు బ్రతకటం నేర్చుకోవాలి.** 100 కి 100 మంది ఇతరులు మనలను గూర్చి ఏమనుకుంటున్నారో (అని ఆలోచిస్తూ), వారు మనలను గురించి మంచి మంచి అభిప్రాయం కలిగి ఉండేటట్లు జీవించ ప్రయత్నిస్తుంటారు. అది చాలా తప్పు. మనం ఇతరులను గూర్చి ఎంత విమర్శించినా పరోక్షంగా దూషించి తప్పులు వెతికి వారిని దూషించినా మన నోరు, బుర్రలు చెడిపోవటం, మనం బాబా గారి ఆజ్ఞలు తప్పటం తప్ప ఆ వ్యక్తులు ఏమైనా బాగుపడతారా? వాళ్ళు బాగు పడతారో చెడిపోతారో మనకు అక్కర లేదు. వాళ్ళను **విమర్శించి పాపం మూట కట్టుకొంటున్నాము.** మానవుడు ఈ దుర్గుణం ఉన్నంత వరకు అతని పాపం పెరుగుతూనే ఉంటుంది. **దాని ప్రభావం వలన మానవులు తెలియకుండానే తన కష్టాలను తానే తెచ్చుకుంటాడు.** నేను కూడా మా హెడ్ మాస్టర్, టీచర్స్ ను గూర్చి వారు లేని సమయాలలో విమర్శిస్తుండేది. ఇతరులను నిందిస్తుంటే ఆసక్తిగా వినేవాణ్ణి. నాకు ధ్యానం కుదరలేదని పూజ్యపాదులు ఆచార్య భరద్వాజ మాస్టార్ గారికి చెబితే వారు ఒక్కటే మాటన్నారు. “వాళ్ళు లేకుంటే నీవు బ్రతకలేవా ?” అని.

నిజంగా నేను బడిలో చెప్పినందుకు జీతమిస్తున్నారు. కాని అందరిని గూర్చి విమర్శించి, విమర్శలు వినినందుకు కాదు కదా ? వీళ్ళ కోసం బాబా మాట అతిక్రమించి పంది మల భక్షణం చేయటం వంటి విమర్శలు మాని వేయ తల పెట్టాను. అంతే ఇక నా డ్యూటీ నిర్వహణలో నిమగ్నమై వారికి దూరంగా ఒంటరిగా చెట్ల క్రింద కూర్చొని బాబాతో స్నేహం చేయసాగాను. వివరంగా వ్రాస్తే ఇంకా రెండు పేజీలు వ్రాయాల్సి వస్తుంది. అది మొదలు నా పాపం తగ్గనారంభించి బాబా కృప అనుభవం కాసాగింది.

నీవు కూడా నీకు తోడూ బాబా వుండాలంటే మొదట ఈ మానవుల స్నేహాలు, విమర్శలు, మాటలను మానేస్తే మనకు బాబాను గూర్చి చింతన చేయటం, పారాయణ చేయటం, పూజ చేయటం, వారి దివ్య లీలలు మననం చేయటం వంటి ఉపయోగకరమైన పనులు చేయటానికి వీలు కలుగుతుంది.

"వాళ్ళు మనం వినకుంటే కోపపడతారేమో" అని సంశయం విడనాడందే, మనకు మంచి జరిగే ప్రసక్తే లేదు. కష్టాలలో మనలను ఆదుకునే స్నేహితులైతే మనం చేసే పని (ఇతరులను విమర్శించటం) తప్పు అని మంచి మాటలతో చెప్పి వదల కొట్టుకోవటం. కొందరితోనైతే అసలు స్నేహాలు మానటం. మనకు పిచ్చి పట్టిందని వాళ్ళు అనుకున్నా ఫరవాలేదు.

రెండవవది అన్నం తిని చదువుకోవటం కొందరికి వీలు కాదు. నేను, నా కుమార్తె అలాంటి వాళ్ళమే. అన్నం తింటే ఇక నిద్రే. కనుక అన్నం తినటం అనేది చదువు అయ్యాక పడుకునే ముందు తినటమే. హాస్టలులో ఆ సమయంలో అన్నం పెట్టరనుకుంటే పూరీ బాక్స్ లో అన్నం పెట్టించుకుని చిన్న ప్లాస్టిక్ సీసాలో మజ్జిగ పోయించుకొని రూములో పెట్టుకుని 10½ గంటల ప్రాంతంలో తినేది. ఈ లోగా ఆకలి గదా అనుకుని భరించలేకుంటే రెండు ముద్దలు తినేది. లేకుంటే అట్లాగే ఉంటే అలవాటు అవుతుంది. చదివింది గుర్తు ఉంటుంది. బాగా చదవగలుగుతాము.

**ఉపనిషత్తులలో విద్యార్థి లక్షణాలు** కొన్ని చెప్పారు. **జీర్ణ వస్త్రం, మితాహారం, కాక దృష్టి, బక ధ్యానం** అన్నారు.

**జీర్ణ వస్త్రం:** విద్యయందు తృష్ణ కలవాడు తాను ధరించే వస్త్రాలంకరణను గూర్చి పట్టించుకోడు. ఎప్పుడు పాత గుడ్డలే ధరిస్తాడు. కానీ ప్రస్తుత కాలంలో నూటికి 90 మంది విద్యార్థులకు గుడ్డల పిచ్చే. నా తోటి ఒక స్నేహితుడు ఉండేవాడు, వాడొక రోజున వీపున చీనిగి పోయిన చొక్కావేసుకున్నాడు. స్నేహితులు చూచి విన్నీసు చేసారు. అతనికి తన డ్రస్ విషయమే పట్టదు. ఎప్పుడూ చదువులో మునిగిపోయి ఉంటాడు. అతనిప్పుడు అమెరికాలో గొప్పరీసెర్చ్ ప్రొఫెసర్ గా ఉన్నాడు. అతని వలె చదివేవారెవరు? అందరికి డ్రెస్ పిచ్చి, తిండి పిచ్చి.

**<u>మితాహారం:</u>** రుచిగా ఉన్నదని కాకుండా చదువు పూర్తయిన దాకా నన్నా శరీరం నిలిచేందుకే ఆహారం తినాలి. బాగా తింటే బలమొస్తుందని తినకూడదు. బలం వస్తే మనమేమన్నా కుస్తీ పట్టే వస్తాదులము అవ్వాలా ఏమిటి?

**<u>కాక దృష్టి:</u>** కాకికి రెండు కండ్లున్నట్లు మనకు కనపడినా నిజానికి ఒక కన్ను కనబడదు. ఒకే కంటితో ఎంతో జాగ్రత్తగా చూస్తుంది. అలాగే మన దృష్టి కూడా ఒక చదువు పైననే ఉండాలి. ఇక కుటుంబ విషయాలు, స్నేహితుల విషయాలు, ప్రపంచ విషయాలు దగ్గరకు రాకూడదు. అప్పుడే సరస్వతి మాత మనలను వరిస్తుంది.

**<u>బక ధ్యానం:</u>** బకము అంటే కొంగ. నీటిలో ఒంటి కాలి పైననే నిలబడి ఉండి తన కాలు దగ్గరకు వచ్చిన చేపను టప్పిక్కుమని పట్టుకుంటుంది. మనం కూడా మన ధ్యాసంతా చదువుకోవటం పైనే ఉంచితే వద్దన్నా చదువు వస్తుంది.

నా కుమార్తె 10 వ తరగతి చదివాక చదువు వద్దంటే వద్దన్నాను. ఆమెకు చదువు పిచ్చి. బాగా చదివిస్తే అంతకంటే ఎక్కువ చదివిన అల్లుడిని వెతకాలని, ఎక్కువ కట్నం ఇవ్వలేం గనుక పెద్ద చదువులు చదివిన వాళ్ళను తేలేమని నిర్మొహమాటంగా చెప్పేశాను. ఆమె ప్రైవేటుగా open యూనివర్సిటీకి కట్టి B. Com. C.A.HIB పాస్ అయ్యింది. బ్యాంకు ఎంట్రన్సు టెస్ట్ పాస్ అయింది. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయి ఇప్పుడు బ్యాంకులో, స్టేట్ బ్యాంకు అఫ్ ఇండియాలో పని చేస్తోంది. ఆమెకు గుడ్డలు తిండి అక్కరలేదు. స్నేహితులు అక్కరలేదు. తనను కదిలించ కుండా చదువుకోనిస్తే చాలు. కొన్ని విషయాలలో ఆమెను నేను గురువుగా స్వీకరిస్తాను.

కవర్ లో పెన్ పంపటం వీలు కాదు. Refil పంపుతున్నాను. అక్కడికి చేరే సరికి పని చేస్తుందో లేదో. సరిగ్గా వ్రాయకుంటే అది అశుభమని తలచ వద్దు. శ్రీ స్వామివారి సమాధికి తాకించే పంపుతున్నాను.

ప్రస్తుతం పారాయణలు అవసరం లేదు. **నిత్యం పది నిమిషాలు గాని, పదిహేను నిమిషాలు గాని పూజ చేసుకో** చాలు. **బాబా చెప్పిన పని చేయకుండా మనకిష్టమొచ్చిన**

**పని చేయకూడదు. బాబా మనకు చదివే పని అప్పగించారు. ఆ పని సక్రమంగా నెరవేర్చుకోవాలి గదా !** దోవన నడుస్తున్నప్పుడు, ఎప్పుడు తీరికగా వున్నా వారి నామం చేసుకుంటే చాలు. ఓర్పు, సహనం ఇతరులకు మంచి చేయటం అన్నీ నిదానంగా అవే వస్తాయి.

**ముందు మనం చదువులో మునిగి పోవాలి. అందుకు ఆహార నియమం పట్టుదల అవసరం. మనం చేయ వలసిన కృషి చేస్తే బాబా కృప తప్పక కలుగుతుంది.** కృషితో నాస్తి దుర్భిక్షం అన్నారు. కృషి చేసిన వారికి కరువే ఉండదని భావం.

**మానవుని ప్రధమ శత్రువు సోమరితనం. దాన్ని తరిమేందుకు తీవ్రమైన పట్టుదల శ్రద్ధ ఉండాలి.** తీవ్రమైన అని మహర్షులు ప్రయోగించారు. దాన్ని సాధించిన వారికి తిరుగులేదు.

స్వామి వారి ఆశీస్సులతో

పె. సు.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

చిరంజీవులైన నారాయణమూర్తి మరియు లక్ష్మీగార్లకు, శ్రీస్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

మీ జాబు చేరింది. చాలా సంతోషము. మీరు మీ ధ్యాసంతా చదువు మీద కేంద్రీకరించండి. **ఇది మనకు బాబా ఇచ్చిన పని. దానిని శక్తివంచన లేకుండా చేసి, వారికి సంతోషం కలిగించాలి. అంతేగాని పారాయణలు పూజలు అని చదువు మీద శ్రద్ధ తగ్గితే బాబా నవ్వుతారు. ఇంటి పరిస్థితులను మనసులోకి రానీయకూడదు.** అబ్రహాంలింకన్ కూలివాని కుమారుడు. తండ్రి పుస్తకాలు చదవద్దని మూల వేశాడు. కానీ ధృడమైన పట్టుదలతో తండ్రికి తెలియకుండా "LAW" చదివి ప్రెసిడెంట్ ఆఫ్ అమెరికా అయ్యాడు. పట్టుదల అంటే ఎలా ఉండాలో అబ్రహాంలింకన్ ఆదర్శము. మా అమ్మ కడుబీదరాలు. ఏ పూట వడ్లు ఆ పూట దంచి మాకు అన్నం పెట్టింది. నా

పట్టుదలతో నేనే చదివి పైకి వచ్చాను. **మానవునకు శ్రద్ధ పట్టుదల ఉండాలి, కానీ ఇతరులు ఇలా జీవిస్తున్నారే అలా మనం లేమే అనే ధోరణి వస్తే మనకు శ్రద్ధ పట్టుదల లేవని లెక్క. విద్యార్థికి 1)జీర్ణవస్త్రం, 2)మితాహారం, 3) కాకదృష్టి, 4)బకధ్యానం ఉండాలి. వీటిని దృష్టిలో పెట్టుకుని ఫస్ట్ క్లాసు కాదు, స్టేట్ ర్యాంకు సాధించాలనే ధ్యేయంతో కృషి చేయండి. సాయి మెచ్చుకుంటే మానవులు ఎవరు అడ్డుపడ లేరు. మా అన్న నాకు ఆస్తి చిల్లిగవ్వ ఇవ్వకుండా నా భార్యను, ఇద్దరు బిడ్డలను నాకు ఇచ్చి పంపారు. నా చదువే నా ఆస్తి అయింది. సాయియే నాకు తోడు. మన పట్టుదలే మన స్నేహితుడు. అలా సాగితే సాయి ఆశీస్సులు పొందుతాము.**

సాయి కృప కలగవలెనని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

ఓం

గొలగమూడి

చిరంజీవి సాయి శివ గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలగవలెనని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయటం. 3.00 రూ కవరు పంపావు అది లాభమే, తెల్ల కాగితాలు ఎందుకు దొరా? ఎంత తింటే మితాహారమూ ప్రక్కన మరొక్కరు చెప్పటం కష్టం. **ఎంత వరకు తింటే ఆకలి తీరి ఇంతకు ముందు కంటే హుషారుగా పని చేయగలుగుతామో అది మితం అంటారు మాష్టారు. అన్నం తిన్నాక భుక్తాయాసం వుండకూడదు, పడుకోవాలి అనిపించ కూడదు** అని చెప్పే వారు.

రాత్రిపూట తినేటప్పుడు చాలా భాధగా ఉంది అన్నావు. కొద్దిగానే తిను. మరలా ఆకలైతే చిన్న టీ లో కలిసే పాలపొడి ఉంది. చన్నీళ్ళలో చక్కెర, పాలపొడి కలిపి రెండు మూడుమార్లు త్రాగు. బాగా ఆకలైతే రెండు మూడు బిస్కట్లు తిను. అవి కాకుంటే నీకు

ఇష్టమైన పండ్లు తిను. పాలు చల్లగా త్రాగటం కష్టమైతే చిన్న (బుల్లి) కిరోసిన్ స్టవ్ పెట్టుకొని ఒకే గిన్నెలో వేడిచేసుకొని త్రాగు.

రూములో చాలా మంది ఉన్నారా ? మీరిద్దరేనా? అంతమందిలో ఇలా చేయటం కష్టం అనుకోకు. నేను P. U. C చదివేటప్పుడు మా హాస్టల్లో నలుగురం P.U.C చదివితే నేను ఒక్కడినే పాసయ్యాను. సంవత్సరం పొడుగునా నన్ను పుస్తకాల పురుగు అని హేళన చేసారు. చివరకు ఏడ్చారు. మన ధ్యేయం గమ్యం దృష్ట్యా ఇలాంటి వాటినన్నింటిని లెక్క చేయకూడదు. ఇదే కాకదృష్టి అని విద్యార్థి లక్షణం చెప్పింది.

మనలను సాయి యుద్ధానికి పంపారు. చక్కగా యుద్ధం చేయాలా లేక ఆయనను స్మరిస్తూ ఉండాలా? **రోజులో ఒకటి రెండుసార్లు పది నిమిషాలు కడ్డీలు వెలిగించి కష్ట సుఖాలు ఆయనకు చెప్పుకోవటం ఒకటే కాని, మిగిలిన కాలం అంతా మన చదువే మనకు ధ్యేయం కావాలి. అనవసర బాతాకానీలు చేయటం తప్పు.** అనవసర భక్తి పుస్తకాలు చదవరాదు. చదువు పూర్తి అయితే deep గా చదవవచ్చు. ఆలోచించవచ్చు. ఇప్పుడు సాయి మనకిచ్చిన పని మాత్రమే మనం నెరవేర్చడం ఒక్కటే మన ధ్యేయం అవ్వాలి. అప్పుడు సాయి మనలను మెచ్చుకుంటారు. అట్లా కాకుండా ఆయన కథలు చదువుతుంటేనే ఆయన సంతోషించే వాడు అయితే ఆయన రాజకీయనాయకుల కంటే హీనమని చెప్పాలి.

నీ సెమినార్స్ లో గానీ, ఏ కార్యక్రమాలలో నైనా నీ శక్తినంతా వినియోగించి కృషి చేస్తూ ఉండు. సాయి భక్తి తగ్గి పోయింది అనుకోకు. **భక్తి అంటే ఏమిటి ? పూజ, పూలు, నైవేద్యాలు, స్తోత్రాలు హారతులా? కానే కాదు. అర్జునునకు శ్రీ కృష్ణుడు భోదించినదే నిజమైన భక్తి. Fight like a true warrior. మనలను కూడా అదే చేయమంటున్నారు. సత్యం, ధర్మం తప్పవద్దన్నారు. ధర్మం అంటే ఏమిటి ? ఎవరి ధర్మం వారు నెరవేర్చడమే!!**

నీవు విదార్థి ధర్మాలు పాటించాలి కానీ భక్తుని లక్షణాలు కాదు. నీ చదువు పూర్తి అయ్యాక పూజలు, హారతులు, పారాయణులు. Not now. **నీవిచ్చిన అవకాశాన్ని**

**సద్వినియోగం చేసుకునే బుద్ధి కుశలత అనుగ్రహించు తండ్రి అనే ఒకే ఒక ప్రార్ధన మాత్రమే (చేయవలసినది). అన్ని జీవులలో ఆయనే ఉన్నాడనే భావం మరచిపోకుండా నడచుకోవటం.** అయ్యో ఇలా చేసానే అనే మనస్తాపం రాకూడదు. ఎదుటి వాడి ప్రాప్తం అలా ఉండి బుద్ధి పుట్టించాడని dashing గా పోతూ వుండాలి. అంతే కాని చిన్న చిన్న విషయాలను అతిగా పట్టించుకోకు. మన ధ్యేయం చదువు. పరీక్షలు.

**దృష్టి సాయి మీదే పెట్టి సాగి పోతుండు. అది తినాల ఇది తినాల అనే మాటలకు fruits & fruit juices మాత్రమే solution.** Room mates ను గూర్చి పట్టించుకోకు. Room mates ఎక్కువగా వుండకుండా మీరిద్దరే ఉండేటట్లు చూసుకో.

**ఆయనను మెప్పించెందుకే నేను చదువుతున్నాను అనే ఒక్క భావం ఎల్లప్పుడూ మరచిపోకుండా ఉండు. Seminar అయి పోగానే ప్రక్క దోవ పోకుండా నీకు నీవే ధ్యాస నిలుపు కోవాలి. విధ్యార్ది లక్షణాలు నిత్యం మననం చేస్తుండు.** శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలి అని ప్రార్ధిస్తూ.

**మితాహారం, జీర్ణ వస్త్రం, కాక దృష్టి, బకధ్యానం – విద్యార్థి లక్షణాలు**

మీ

పె. సుబ్బరామయ్య.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

చిరంజీవి శివ గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగ చేయవలనని ప్రార్ధిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

నీ letter చేరింది. శ్రీ మాష్టారు గారు ఆసనాలు, ఆటలు ఆడడం వయస్సులో ఉండే వారికి మంచిదని చెప్పేవారు. నన్ను కూడా ఆసనాలు నేర్చుకొని వేయమని చెప్పారు. కొన్ని సంవత్సరాలు వేసాను. ఒక రోజు మాష్టారి తండ్రి గారైన శ్రీ అనంతాచార్యులు వారికి ఆసనాలు వేసి చూపించు. తప్పులుంటే చెబుతారు అన్నారు. అలాగే చూపించాను. తప్పులేమీ లేవని చెప్పారు. మాష్టారుగారితో పరిచయం

కానప్పుడు వాలీబాల్, బాడ్మింటన్ ఉదయం, సాయంత్రం ఆడేవాడిని. ఇక రెండో ప్రపంచమే లేదు. మాష్టారితో పరిచయమయ్యాక ఆటలు బొత్తిగా మానేసి నిత్యం 15 నిమిషాలు ఆసనాలు మాత్రం వేసేది. నాకెప్పుడూ మోకాళ్ల నొప్పులుండేవి. ఆసనాలు వేయకుంటే కుంటవలసి వచ్చేది. ఏమీ కుంటుతున్నావని అడిగే ప్రతి వారికి చెప్పవలసి వచ్చేది. అందుకని ఆసనాలు వేస్తే కుంటే పని ఉండదు. కొద్దిగా నొప్పి ఉండేది.

శ్రీ స్వామి వారితో పరిచయమయ్యాక వారు చెప్పిన ఆహారనియమాల వలన మోకాళ్ళ నొప్పులు ఇప్పటికి కూడా లేవు. గనుక ఆసనాలు వేయడం లేదు. **ఆటలు - మానసిక విశ్రాంతి, శరీర ఆరోగ్యమునకు అవసరం.** ఒక అరగంట ఆట, అరగంట స్నానం, పూజ. ఆటలు కష్టమైతే రోజు 15 నిమిషాలు ఆసనాలు వేస్తుండు. ఆసనాలకు చార్టులు అమ్ముతారు. ఎవరైనా తెలిసినవారు, ఒకటి రెండు రోజులు నేర్పితే సరి.

ప్రాణాయామం మాత్రం చేయవద్దు అని మాస్టారు చెప్పేవారు. ఆరితేరిన గురు సన్నిధిలోనే చేయాలట. గనుక నేను దాని జోలికి పోలేదు.

ఏ భావం పెట్టుకొని చదవాలి. Result ఏ భావంతో ఆహ్వానించాలి అని అడిగావు.

మనకు చదువుకునే అవకాశం ఇచ్చి చదువుకొని ఆ విద్య ద్వారా నన్ను సేవించు అని బాబా చెబుతున్నారు. గనుక ఈ చదువుకొనడం బాబా సేవ అనే భావం గట్టిగా ఉండాలి. ఆయనకు పూలు వేయడం స్తోత్రాలు చదవడమే ఆయన సేవ కాదు. మనం చేసే పని ద్వారా మనం ఆయనను మెప్పించాలి. వారు మెచ్చుకునేటట్లుగా మనం మన పని చేస్తుండాలి. **చదువుకోవడం అనేది ఆయన సేవ అనేది ధృఢంగా నాటుకోవాలి. నాకు పాఠాలు సరిగా తెలియకుంటే నేను విద్యార్థులకు చెప్పడం గూడా అంత మాత్రమే ఉంటుంది. అట్లే మీ మీ సబ్జెక్టులలో గూడా మీరు నిష్ణాతులై ఉండనిదే భవిష్యత్తులో మీరు మీ ధర్మం top గా నిర్వహించలేరు. మనకు భగవంతుడు ఇచ్చిన పని క్షుణ్ణంగా చేయడమే ఆయన నిజంగా మన నుండి కోరే దక్షిణ.** కాలము, మనసు ఆయనకివ్వడమంటే ఏమిటి? సాయి, సాయి అంటూ నిరంతరం కూర్చొనే ఇంజినీరు

ఎందుకు పనికొస్తాడు. **పని చక్కగా చేయలేని ఇంజినీరు ఎన్ని పూల మాలలు సాయి కిచ్చినా ఆయన సంతోషిస్తారా!** What do you mean by negligence of duty bloody idiot అన్నారు శ్రీ స్వామివారు. గనుక మనం చదివే చదువే ఆయన సేవ కాబట్టి చదువులో immerse కావడమే ఆయన కోరేది. చదువులో మునిగిన వాడు అంటే ఆయన పనిలో మునిగిన వాడని అర్థం. అట్టివాడు పని చేస్తుంటే పనిలో నిమగ్నమవుతాడు గాని సాయి సాయి అని సాయిని ధ్యానించలేడు. సంపూర్ణంగా పనిలో నిమగ్నమై చేయడమే క్షుణ్ణంగా బాబా సేవ చేయడమని భావిస్తే మన దోషం లేకుండా top rank కోసం క్షుణ్ణంగా శ్రమించాలి. ఫలితం సాయి ఇష్టం. ఇక ఫలిత మెట్లున్నా పొంగుకృంగులు లేకుండా సాగాలి.

చదివేటప్పుడు top గా చదవడమే మన భావన. ఫలితాలను గూర్చి ఆశించకుండా ఉండాలి. పరీక్షలలో ఎక్కువ మార్కులు వస్తే, వాడే మంచి మేధావి కాలేడు. తక్కువ వస్తే పనికి రాని వాడు కాదు. కష్టించి పని చేసే సామర్థ్యముంటేనే సాయి మెచ్చుకుంటారు. గనుక చదువులో లొసుగు లేకుండా మాస్టర్ చేస్తూ ఉండు. Future లో అయ్యో ఇది తెలుసుకోకుండానే పాసయి పోయామే అని చింతిచకుండా ఉండేట్లు చదవాలి. ప్రస్తుత పరీక్షలతో పాటు ఏ ఏ విషయాలు తెలుసుకుంటే future లో ఉపయోగపడతాయో అవి కూడా master చేయాలి.

అన్నీ ఆ సాయినాధుడే చేయిస్తాడు. **రోజు minimum 10 లేక 15 నిమిషాలు పూజ ఏ మారకుండా చేస్తూ ఇదంతా నీ సేవే బాబా. నీ సేవ నేను క్షుణ్ణంగా నీవు మెచ్చుకొనేటట్లు చేసేటట్లు చేయి అని ప్రార్థిస్తుండు. సర్వం వారే చూస్తుంటారు. ఇంతకు ముందు వ్రాసినట్లు కాక దృష్టి , బక ధ్యానం, మితాహారం, జీర్ణ వస్త్రం పాటిస్తుండు. సర్వం సాయి సమకూరుస్తారు.**

ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య

చివరగా ఒక మాట వ్రాసావు. ఒక్కొక్కప్పుడు మనసు సాయి మీద ఉంటుంది. మరొకప్పుడు ఎక్కడో ఉంటుంది అని వ్రాసావు. నిజమే అనేక వేల కోట్ల జన్మల నుండి సంప్రాప్తమైనదే మన మెదడు. దానిని తన కోతి గంతుల నుండి అరికట్టడం చాలా కష్టమే. అయితే వీలు కానిది మాత్రం కాదు. దానినే బాబా శ్రద్ధ, సబూరి అన్నారు. **అసలీ మనసు యొక్క చంచల స్వభావాన్ని అరికట్టాలి అనే శ్రద్ధ ఉండాలట మాస్టారు చెబుతారు.** "**శ్రద్ధ అనేది అనుక్షణము ఉండవలసిన జాగ్రత్త అంటారు**". మనసులో ఇతర ఆలోచనలు వస్తే అది మానసిక వ్యభిచారమని భావించాలట. చేయవలసిన యోచన గాక మనస్సు దానంతట అది ఎక్కడకో వెళ్లి ఆలోచించటమే వ్యభిచారం అన్నారు. శ్రద్ధ అనే దాన్ని బాబాకు సమర్పించడమంటే చాలా గొప్ప విషయం.

మనసును ఎప్పుడు కూడా ఖాళీగా వదలకూడదు. నిరంతరం పనిలో నిమగ్నం చేయమంటారు. **పనిలేని మనసే సర్వ అనర్థాలకు మూలమంటారు.** పనిచేస్తూ మనసు మాత్రం పిచ్చిగా యోచిస్తుంటుంది అది తప్పు. మనసు పనిలో నిమగ్నమవాలట. దానిని త్రికరణ శుద్ధి అన్నారు. (1) శరీరంతో పని చేయడం (2) నోటితో దైవ నామం చెప్పడం (3) మనస్సుతో ఆ పని ఎలా చేయాలో యోచిస్తుండడం. వేరే తలంపు రాకూడదు.

**పనిలేనప్పుడు విశ్రాంతి కోరినప్పుడు "ఈ చూడబడే దంతా కలసి నేను" అన్న బాబా వాక్యాన్ని విశ్లేషిస్తుండు.** మంచి మేత దొరుకుతుంది మనస్సుకు ఎలా?

సూర్యుణ్ణి చూచాము - సూర్యుడు, సూర్య కిరణములు, అందులోని వెలుగు, అందులోని వేడి, వీటి ద్వారా చూడబడే వస్తువులు, వస్తువులు చూచుటకు ఉపకరించే కన్నులు, కన్నులలోని ప్రాణశక్తి, నేను చూస్తున్నాను అని తెలిసే ఎరుక – ఇవన్నీ బాబానే అయితే నేను వేరు ఈ జగత్తు వేరు అనే భావనే అడ్డుగోడ. దాన్ని కూలదోయడం ఎలా బాబా! అదెలాగో నాకు నేర్పించకూడదా అని అడుగుతుండు.

అలాగే దోవన నడుస్తున్నాము. భూమి, దానిపై కనిపించే దుమ్ము, పేడ అన్నీ ఆయనే. ఈ శరీరం కూడా ఆయనే, శరీరం చుట్టు ఉన్న గాలి ఆయనే. శరీరాన్ని నడిపించే ప్రాణశక్తి ఆయనే. నడుస్తున్నట్లు తెలుసుకొనే ఎరుక గూడా ఆయనే. అంతా ఆయనే ఐనా నేను అనే పరిమిత భావమే అడ్డుగోడ. దీన్ని కూల ద్రోయ మన్నావే అది ఎలా బాబా అని అడుగు.

స్నానం చేస్తున్నాము - ఈ నీరు బాబానే, మనం నిలుచునేందుకు ఆధారమైన భూమి ఆయనే. ఆయనకు ఆయన చేతిని కదిలిస్తూ హాయిని ఇప్పిస్తూ హాయిని అనుభవించుచున్నట్లు తెలుసుకుంటున్న ఎరుక ఆయనే కానీ నేను అనే పరిమిత భావమే అడ్డుగోడ. దీనినీ కూలద్రోయడం ఎలా అని అడుగు.

ఇదే విధంగా అన్నం తినేటప్పుడు, నీళ్ళు త్రాగేటప్పుడు, పనిలేని విశ్రాంతి సమయాలలోను నీవు చూచే ప్రతి వస్తువు వంక నవ్యనూతనంగా చూడమంటారు మాస్టర్. నాకు అడ్డుగోడను కూలద్రోసే technique చేత గాకున్న ఇలా వ్రాయడం మాత్రం కొద్దిగా వచ్చు. అడ్డుగోడను ఎప్పుడు కూలద్రోయిస్తారో, అది శ్రీ స్వామివారి పని.

**శ్రద్ధతో - చదువు లేనప్పుడు మనసు విశ్రాంతి కోరినప్పుడు – ఎక్కడో ఆలోచించకుండా చూచిన ప్రతి వస్తువులోను విశ్లేషించి బాబాను చూస్తుంటే అది కూడా ధ్యానమే అవుతుంది**. ధ్యానమంటే కళ్ళు మూసుకొని కూర్చోవడమే కాదు.

ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

చిరంజీవి సంపత్ గారికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయడం.

**ఏ విషయంలో కూడా అతి పనికిరాదు. తిండి విషయంలో మితాహారం విద్యార్థికి తప్పనిసరి. నాలుకను వదిలామంటే మనలను బురద గుంటలో తోస్తుంది.** నాలుక దాటితే ఆ తర్వాత ఏమీలేదు. **అలా తినాలనుకోవడం, తినడం ఇంద్రియలోలత్వం అంటారు.**

**ఇంద్రియాణాం హి చరతాం యన్మనోను విధీయతే**

**తదస్య హారతి ప్రజ్ఞాం వాయుర్నావ మివాంబసి.**

ఇంద్రియములలో అనగా నాలుక, చర్మము, కన్నులు, చెవులు మొ|| వాని కోరికలు తీర్చు మనస్సు శక్తి నశించును. ఎలాగంటే నీటి మీద ప్రయాణము చేయు పడవ యొక్క వేగము గాలి హరించునట్లుగా అని చెప్పారు.

**నీ చదువు పూర్తి అయినంత వరకు నీ వివేకంతో అవి విచ్చలవిడిగా తినాలి అనే కోరికను చంపాలి.** అదొక్కటే మార్గము. కోరిక పుట్టనే కూడదు. మనసులో కోరిక పుట్టడము వేరు, అనుభవించడం వేరు కాదట. మనసులో కల్గినా తినినట్లే లెక్క అంటారు భగవత్ గీతలో మరియు పాకలపాటి గురువు గారు ఇదే మాట బీడి కాల్చు కోవాలనుకొనే భక్తునితో అంటారు.

**సినిమాలు ఎప్పుడో నెలకో రెండు నెలలకో చూడడం కూడా తప్పే కాని నిగ్రహించాలి. అంతేగాని అదే పనిగా చూడడం చాలా తప్పు. మనం సినిమాకు ఇచ్చే డబ్బంతా బ్లాక్ మార్కెటీర్ల సంచిలోకి పోతుందన్నారు మాస్టారు.**

అది మొదలు ఇప్పటికి నేను 2 సినిమాలే గత 25 సం || గా చూచాను. (1) సాయిబాబా (2) లవకుశ. **నిజజీవితంలో లేనివన్నీ కల్పించి చూపుతారు సినిమాలో. అలాంటి కల్పితాలను చూచి మనం కూడా అలాంటి చెడుకు మ్రొగ్గుతాము. విద్యార్థి దశలో వీటికి దూరం కాకుంటే మీ తల్లిదండ్రుల ఆశలానే కాదు నీ గమ్యం మరిపించి నిన్ను అధోగతి పాలు చేస్తాయి. నీ వివేకమే వీటికి మందు.**

శ్రీ స్వామి ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

05-01-2000

చిరంజీవి శివగారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలేనని ప్రార్థన.

నేను శ్రీ నాంపల్లిబాబా గారిని దర్శించి శ్రీ ఆనంద వెంకటేశ్వర్లును కలుసుకునేందుకు వచ్చిన వాళ్ళందరిని అలా అడిగాను. అంతేగానీ అందులో నాకొక భావం అంటూ ఏమీ అప్పుడు నాకు కలుగలేదు. శ్రీ వెంకటేశ్వర్లు గారిని కలుసుకునేందుకు శ్రీ నాంపల్లిబాబాగారే నా చేత అలా అడిగించారు. ఆయన విశ్వ చైతన్యం గనుక నాలో అలాంటి ప్రేరణ పెట్టి అడిగించి మన పని నెరవేర్చారు. అలా అడిగేటప్పుడు నీవు వ్రాసిన విషయాలేవీ నాకు గుర్తు రాలేదు.

**అన్ని వేళలా దైవం మీదనే ఆధారపడాలి. దైవం మీద సంపూర్ణంగా ఆధారపడి మన ప్రయత్నం మనం చేయాలి. ఫలితం అనుకూలమైతే పొంగక ప్రతికూలమైతే క్రుంగక ప్రయత్నించవలసిన మన కర్మ నివారణ అయిందని తలచి సంతోషంగా సాగాలి.**

మనం స్వయంగా సంపాదించగలిగినంత వరకు మన తండ్రి గారి కష్టార్జితం మనదే అవుతుంది. తండ్రిగారిది కదా మనం ధర్మం చేయరాదు అనే భావం రానివ్వకూడదు. అట్లా అని విచక్షణ లేకుండా పావలా ధర్మం చేయవలసిన చోట 1 రూపాయి ఇవ్వడం తగదు. ఆకలైన వానికి డబ్బు ఇవ్వకుండా అన్నం పెట్టించు వీలయితే. ఆ విధంగా సాయికే పెట్టినట్లు తలంచు. ప్రొఫెషనల్ బెగ్గర్స్ ను పట్టించుకోనక్కరలేదు.

**విద్యుక్త ధర్మం అంటే ఎవరికీ ఏ పని భగవంతుడు ఇచ్చాడో అది సక్రమంగా శక్తినంతా వినియోగించి చేయడం. చదువుకోమని పంపితే** వీధులలో అన్యాయాలు జరుగుతున్నాయని రౌడీలతో తిరగడం. **త్రోవన పొయ్యేదానిని నెత్తి మీదకు తెచ్చుకోకుండా కాకదృష్టి, బకధ్యానం, జీర్ణవస్త్రం మితహారిగా ఉండడం.** కాకికి ఒక కన్నే కనిపిస్తుంది. అలా విద్యార్థికి తన చదువే ధ్యాస కావాలి. కొంగ-బకము, చేపను పట్టుకొనుటకు కొంగ ఒంటి కాలిపై నీటిలో కూర్చుంటుంది. చేపను పట్టడమొకటే దాని ధ్యాస - వస్త్రాల గురించి గుర్తే రాకూడదు- మాచింగ్ వగైరా. ఆహారం కూడా నాలాగా అమితంగా తినకూడదు. నేను M.A. పరీక్ష రాస్తూ హోటలు వారికి డబ్బు ఇస్తాము కదా అని ఫుల్ గా భోంచేసేవాడిని తిరుపతిలో. చివరకు ఫెయిల్ అయ్యాను. నా కూతురు బ్యాంకు టెస్టుకు తయారవుతుంటే ఆమె ఆహారపు అలవాట్లు చూచి నాకే సిగ్గేసింది. నేను కూడా అలా తిని ఉంటే M.A. పాస్ అయ్యే వాణ్ణి గదా అనిపించింది. మితాహారం అన్నారు గానీ, నిరాహారం అనలేదని గుర్తించు. బాబా దగ్గర పూజ చేశాక ఏమని దండం పెట్టాలో నాకు తెలియదు. **కానీ నేను మాత్రం చిన్నప్పటి నుండి ఇప్పటి వరకు ఒకటే దండం పెడుతుంటాను. నన్ను మనిషిగా పుట్టించావు. ఏమి చేయాలో తెలియదు. నా ద్వారా నీ సంకల్పమేమిటో నెరవేర్చుకో నేను నీ సంకల్పం నేరవేర్చేటట్లు నన్ను అనుక్షణం నడిపించు అని మాత్రం ప్రార్థిస్తుంటాను.**

**సాయినాథుని చరిత్ర పారాయణ చేశాక అంటే వారు చెప్పినవి ఆచరిస్తుంటే సత్వం పెరుగుతుంటుంది. అన్నం తినేటప్పుడు తప్పక నామస్మరణ చేయి. పడుకునే ముందు నామస్మరణ, నిద్ర లేస్తూనే నామస్మరణ ఇలా చేస్తూ పోతే సాయియే మనలను గమ్యం చేరుస్తారు.**

అష్టవిధ బ్రహ్మచర్యం అంటే (1) పురుషులు స్త్రీలను గానీ వారి చిత్రపటములను గాని చూడరాదు. లక్ష్మణస్వామికి సీతాదేవి నగలు చూపించి ఇవి సీతవేనా అని అడిగితే నేనెప్పుడూ ఆమె పాదాలకు మ్రొక్కేవాడిని గనుక ఈ కాలి అందెలు అమెవే. మిగిలిన నగల విషయం తెలియదు అన్నాడుట. మరి ఇప్పుడు సినిమా యుగంలో సాధ్యమా? ఏమో? ఎవరికీ వారే నిర్ణయించుకోవాలి. ఇట్లే స్త్రీలు కూడా. (2) స్త్రీలతో సంభాషించరాదు (3) శారీరిక సంబంధం ఉండరాదు. (4) అలాంటి దాన్ని మానసికంగా కోరరాదు. (5) అలాంటి విషయాలు కంటితో చూడరాదు. (6) చెవులతో వినరాదు (7) ఇతరులు అలా చేసేటప్పుడు చూడరాదు (8) అలాంటి సంభాషణలు వినరాదు.

ఇవన్నీ ఈ సినిమా రోజులలో సాధ్యమా? **ఆచరించే వారికి సాధ్యమేమో.**

నీవు చక్కగా చదువుకుని మంచి భవిష్యత్తు గల్గి పదిమందికి నీడనిచ్చేవాడివిగా తయారయ్యేటట్లు చేయమని సాయిని ప్రార్థిస్తూ,

మీ

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

# ధర్మాచరణ

Om

Dear Sir !

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మిమ్ము వెన్నంటి కాపాడాలని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

మా గురువుగారు పూజ్యశ్రీ ఆచార్య భరద్వాజ గారు. వీరిని ప్రపంచమంతా ఎరిగిన వారే. మా ఇంట్లోని ఈతి బాధలు వారికి చెప్పుకుంటే వారనేవారు - పూజలో

**"త్వమేవ మాతాచ పితా త్వమేవ, త్వమేవ బంధుశ్చ సఖా త్వమేవ,**

**త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ, త్వమేవ సర్వం మమదేవ దేవ"**

అని మనం ఎన్నిమార్లు పూజ చేస్తే అన్నిమార్లు చెపుతాము. కానీ శ్లోకం అర్ధం ఆచరించము – ఆ శ్లోకం ఏమి చెబుతుంది, నీవే నా తల్లివి, తండ్రివి, నీవే నా బంధువులు, స్నేహితులు, భార్యాబిడ్డలు, సర్వులూ సర్వమూ నీవే. మరి ఆయన పటాన్ని శ్రద్ధగా పూజిస్తాము, నైవేద్యం పెడతాము. **మన భార్యా బిడ్డలు, బంధు మిత్రులు, మాతా పితరుల రూపాలలో ఆయన మన ఎదురుగా ఉంటే వాళ్ళంతా ఆ పరమాత్మయేనని గుర్తించి శ్రద్ధా భక్తులతో సేవించము గదా! మరి మనకు వారి కృప ఎలా కలుగుతుంది అని చెప్పేవారు.**

**గృహస్థుగా మనం మన బాధ్యతలు చక్కగా నెరవేర్చాలి** – భర్త అంటే భరించువాడు అని అర్ధం – భార్యా బిడ్డలు, తల్లి దండ్రులను భరించువాడు అని గదా అర్ధం. **ఇష్టం , అయిష్టం లేకుండా జీవించడమే భగవంతునకు అమిత ప్రీతి కల్గించే పూజ.** ఈ ఇష్టం, అయిష్టం ఎందుకు కలుగుతున్నాయి? ఆశ వల్ల కలుగుతున్నాయి. ఆశ అంటే కోటీశ్వరుడు కావాలనే కోరిక గదా అని అనుకోమాకండి. ఇది ఇలా ఉంటే బాగుంటుంది అని ఆశించడమే ఆశ. అది అలా జరుగకుంటే నిరాశ.

భగవంతుడు మనలను ఎలా ఉంచితే అలా ఉండడం నేర్చుకుని అలా ఉంటుంటే భగవంతునకు ఎంతో ప్రీతి కల్గుతుంది. భర్తగా మనం మన భాద్యత నిర్వహించాలి. ఇది ఇట్లాగే జరగాలి అనుకోవడం తప్పు. జీవుల ప్రారబ్ధం అనుసరించి అవి ప్రాప్తిస్తాయి. అంతేగాని మనం కేవలం అష్టోత్తరం చదివినంత మాత్రాన మనం

కోరినట్టు అంతా భగవంతుడు జరుపుతాడా? **గనుక ఇది ఇట్లా జరిగితే మంచిది, బాగుంటుంది అనే పద్ధతి విరమించి భగవంతుడు మనకు ప్రసాదించిన దానికి శక్తి వంచన లేకుండా పనిచేసి భగవంతుని మెప్పించడమే ఆశ లేకుండా పోవడమంటే.** "ఆశ పోతే అంతా పోతుండ్లాయ్యా" అన్నారు శ్రీ వెంకయ్యస్వామి వారు.

నేను బి.ఎస్.సి. చదివాక ఉద్యోగం రాలేదు. రైలు కట్టమీద గ్యాంగీ పని చేస్తానని పోతే అదీ రాలేదు. అనేక ప్రయత్నాలు చేసాను, అనేక చోట్ల వీలు కాలేదు. కత్తి తీసుకుని కట్టెలు కొట్టుకొచ్చేవాడిని. కనీసం నెలకు Rs.50/- కట్టెలు ఇంట్లోకి కావాలి. ఆ యాభై రూపాయలు మా తల్లిగారికి మిగిలించిన వాడినౌతానని తలచాను. నేను తినే అన్నానికి కొంత న్యాయం చేకూర్చగలనని తలచి తొమ్మిది నెలలు అలా కఠోరంగా కట్టెలు కొట్టాను. ఆ తరువాత భగవంతుడు నేననుకున్న పనులు కాకుండా అన్ ట్రైన్డ్(untrained) టీచర్ పని ఇచ్చారు. నెలకు వంద రూపాయలకు ఆ పని చేశాను. **కష్టమే ఆ పని, ఆ జీతం – వాళ్లిచ్చేది అంతే. భగవంతుడిచ్చిన పనిని ఆయన మెచ్చుకొనేటట్లు చేయాలి అని నా భావన.** చివరకు అదే స్థిరమైంది. ఇతర జిల్లాకు వెళ్లి పని చేశాను. **భగవంతుడు ఎలా తిప్పితే అలా. ఆశ పోవాలి అంటే ఇష్టం, అయిష్టం పోవాలి. అంటే "ఇది ఇలా జరిగితే బాగుండును" అనే కోరిక పోయి భగవంతునకు మన పగ్గాలు అప్పగిస్తే, ఆయన ఎలా తోలితే అలా పోవాలి. కుటుంబం భరించడం ముఖ్యం. అలా చేస్తుంటే, త్వమేవ మాతాచ అన్న శ్లోకం ఆచరించిన వాళ్లము అవుతాము. అంతేగాని డాక్టరు వ్రాసిన మందు తినకుండా ఆ మందు చీటీ వల్లె వేస్తుంటే జబ్బు తగ్గదు కదా? ఇంకా పెరుగుతుంది. ఎన్నో జన్మల ఋణానుబంధం వలన మన భార్యా పిల్లలు బంధుమిత్రులు ఏర్పడ్డారు. వారి వారి ఋణం వారికి చెల్లించాలి, భార్య-భర్తలు కలసి సంసారమనే బండి లాగాలి.** అంతేగాని ఈ ఇసుక రోడ్డున లాగటం నాకిష్టం లేదంటే బండి నడవదు. రెండెద్దులు లాగవలసిన

బండి ఒక్క ఎద్దు ఎలా లాగుతుంది? ఎలా కదులుతుంది? **కష్టమైనా సరే భగవంతుడిచ్చిన కృషి చేయాలి.**

మన కంటే అంగవైకల్యమున్నవారు ఎందరు లేరు? వారి సంగతేమిటి? మనకు భగవంతుడు తెలివితేటలు, అన్ని అవయవాలూ, శక్తి ప్రసాదించాడు. **మన పరిధిలో ఏదైనా కృషి చేస్తే భగవంతుడు ఏంతొ సంతోషిస్తాడు, ఆశీర్వదిస్తాడు.**

అంతేగాని మన పారాయణ, అష్టోత్తరాలతో సంతుష్టుడు కానేకాడు. మన విద్యుక్త ధర్మం మాని పారాయణ అష్టోత్తరాలు చేస్తుంటే భగవంతుడు సంత్రుప్తుడయ్యేటట్లు అయితే ఆయన కుడా ఒక రాజకీయ నాయకుడౌతాడు. భగవంతుడు కాడు. **మన కృషి ద్వారా భార్యాబిడ్డలు, తల్లిదండ్రుల రూపంలో ఉన్న భగవంతుని సేవిస్తున్నాము అనే భావన ప్రధానంగా ఉండాలి.**

ఆచార్య భరద్వాజ గారికి లెక్చరర్ ఉద్యోగం పోయింది. రోజుకు ఐదు గంటల పనికి ఆరువేలు వచ్చేవి. అది పోయాక రోజుకు 15 గంటలు పనిచేసి రెండువేలు సంపాదించేవారు. **భగవంతుడు ఏమిచేస్తే అదే సంతోషంగా స్వీకరించారు. కనుకనే భగవంతునకు ప్రీతిపాత్రుడయ్యాడు.**

మీరు పారాయణ పూజ చేస్తూ, సహించి ఎంతటి స్వల్పమని తలచబడే పని అయినా చేస్తుండాలి. ఒకరిద్దరుతో మొదలు పెట్టి ప్రైవేటు చెప్పవచ్చు, లేక దూరంగా ఎక్కడైనా స్కూలులో, కాన్వెంటులో కష్టమైనా చేయాలి. అలా కాకుంటే మరొక పని మీకు తోచినది, ఇష్టమైనది అలా చేస్తుంటే దైవం కరుణిస్తాడు.

భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి వారు మిమ్ములను మీ కుటుంబాన్ని ఆశీర్వదించవలెనని మరొకసారి ప్రార్థిస్తున్నాను.

**బిడ్డలను సత్ పౌరులుగా తీర్చిదిద్దే కృషి మనం చేయాలి**. మన కృషితోనే వారు వివేకానందులౌతారని కాదు, మనకు భగవంతుడు ఇచ్చిన పని సక్రమంగా నిర్వర్తించిన వారమయ్యేందుకే.

శ్రీ స్వామి వారి కృప సదా మీకు కలుగవలెనని ప్రార్థిస్తూ ,

మీ

పె. సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి,

27-06-05.

Dear Sai,

ప్రతి మానవుడు సుఖశాంతులతో తృప్తిగా జీవించాలని తలుస్తాడు. కాని **అట్టి సుఖము, శాంతి, తృప్తి అనునవి మనం ఆచరించే ధర్మము వలన మాత్రమే లభిస్తాయని ఎన్ని శాస్త్రాలు ఘోషించినా, మహాత్ములు అందరూ ఎలిగెత్తి చాటినా ఆశాబద్ధుడైన మానవునకు అట్టి ఆచరణ దుస్సాధ్యం అయ్యింది. అట్టి ధర్మాచరణ మన నిత్య జీవితంలో సహజ సిద్ధమయ్యేందుకు మహనీయుల సాంగత్యం ఒక్కటే శరణ్యమని భగవద్గీతాది గ్రంథాలన్నీ చెబుతున్నాయి. వారి ప్రత్యక్ష సానిధ్యము లభించనప్పుడు మహాత్ముల చరిత్ర పారాయణ** కూడా మహాత్ముల ప్రత్యక్ష సానిధ్యంతో సమానమని ఎందరో భక్తుల అనుభవాలు ఋజువు చేస్తున్నాయి. మహనీయుల చరిత్ర పారాయణ ద్వారా అనేక మంది భక్తులలో కలిగిన హృదయ పరివర్తనే ఇందుకు నిదర్శనము. అట్టి ధర్మాచరణను గూర్చి శ్రీ స్వామివారు ఏనాడు పెద్దగా ఉపన్యసించకున్ననూ శ్రీ స్వామి వారి నిత్య జీవిత సంఘటనల నుండి ఇట్టి ధర్మభోధ వినగలిగిన వారికి అనుక్షణమూ వినిపిస్తూనే ఉంటుంది.

శ్రీ స్వామివారి గురువు వారికి ఒక పని ఒప్పగించి చేయమన్నారు. అదే ఇతరుల బాధలను తన తపోశక్తితో క్షాళన చేయడం. ఇతరులు అంటే మానవులే కాదు సర్వ జీవుల యొక్క బాధలు తీర్చడం. ఆ కృషిలో నిమగ్నమై తన శరీరాన్ని మరచిపోయి పని చేసారు. **మన గురువు మనకొక చిన్న పని పెట్టారు. ఆ పనిలో నిమగ్నమై మనం ప్రపంచాన్నే మరచిపోవాలి. ఆ పని తప్ప ఇతర యోచనలే ఉండకూడదు.** ఒక రోజు నాకు మందిరం కట్టగా మిగిలిపోయిన రాతి ముక్కలను కంకర కొట్టించమన్నారు. ఆ విషయం రేపటి లెటర్ లో వ్రాస్తాను.

స్వామి వారి ఆశీస్సులతో

పె. సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

## ధర్మాచరణకు – గురుసేవకు పట్టుదల:

om

గొలగమూడి

28 – 6 – 05

Dear Sai !

శ్రీ మాస్టారు గారు విద్యానగర్ సాయి మందిరానికి curing కు నీరు పోయమన్నారు. పది రోజులయి నాకు ఇంకా క్యూరింగ్ పని ఉండగానే మిగిలిపోయిన రాతిముక్కలు కంకర కొట్టించమన్నారు. 600 రూ. తీసుకుని(advance) మూడు నెలలైనా కొట్టలేదట. వాళ్ళు కొట్టకుంటే మా గ్రామం చెముడుగుంట నుండైనా మనుషులను తీసుకువచ్చి కొట్టించమన్నారు. ఇంతకుముందే కొందరు లెక్చరర్లు ఆ కూలీల కొరకు 6కి.మీ. దూరం వెళ్లి అనేకసార్లు ప్రయత్నించి మానేసారు. వారు మాత్రం రాలేదు. శ్రీ మాస్టారు వదలలేదు. అది భల్లూకపు పట్టు. ఇతరులు

చెమటోడ్చి సంపాదించిన పావలా, అర్ధరూపాయి, రూపాయి శ్రీ సాయికి సమర్పించిన డబ్బు వృధా కాకూడదు అనేదే వారి ధ్యేయం.

నేను ఉదయం 5 గం.కి నిద్రలేచి 5½ గం.ల బస్సుకి వెళ్లి ఆపి మా బస్సు 3 కి.మీ.నడకలో 3,4 మార్లు వెళ్లి వారితో మాట్లాడినా వాళ్ళు రేపు వస్తామంటారు కాని రారు. ఈ రోజు కూడా అలాగే చెప్పారు. ఇక లాభం లేదు మా గ్రామం కలిచేడు లోని కూలీల కొరకు ప్రయత్నించాలని ఆ దోవన అట్లాగే కలిచేడు ప్రయాణమైనాను. నీళ్ళలో(నిల్వ)పోసిన చద్దన్నం రూములో ఉంది. ఎప్పుడైనా ఆ గ్రామం నుండి తిరిగివచ్చి 10 గం.కు పైన తినేది. ఈ రోజురూములో చద్దన్నముంది కాని అన్నం కొరకు రూముకు రాలేదు. ఆ గ్రామం కలిచేడు అక్కడ బస్సు ఎక్కాలి. గూడూరు లో దిగి కలిచేడు బస్సు ఎక్కాలి. ఇంటికి చేరేసరికి మధ్యాహ్నం 4 గం.లైంది. అప్పుడు ఇంట్లో అన్నం లేదు. వాళ్ళను అన్నం వండమని నేను కూలీల కొరకు వెళ్ళాను. వాళ్లతో మాట్లాడి వచ్చేసరికి 5½ గం.లు సాయంత్రం. అకాలంలో ఎంత తినగలము. ఏదో కొంత తిని నిద్రపోయాను. ఇక రాత్రికి అన్నం తినలేదు. ఉదయాన్నే 6 గం. గూడూరు బస్సు. గూడూరు చేరి అక్కడనుండి కలిచేడు బస్సు ఎక్కి, కలిచేడులో దిగి కూలీల దగ్గరకుపోతే వాళ్ళు లేరు పనికి వెళ్లారు. ఉసూరుమంటూ 3 కి.మీ. నడిచి కలిచేడు రోడ్డు లో waiting బస్సుకొరకు. రూముకి చేరేసరికి 12 గం.లు మధ్యాహ్నం. ఆకలి దహించి వేస్తుంది. నేనెక్కడా ఏమీ తినను. వండి తినాలి. అన్నీ అంగటి నుండి తెచ్చుకోవాలి. గిన్నెలు కడగాలని గిన్నెలో చేయి పెడితే అన్నముంది, వాసన ఏమీ లేదు ఎర్రగడ్డ నంజుకుని 3 రోజుల నాటి చద్దన్నం తిన్నా.

## ********* సద్గురు దేవా శరణం శరణం *********

ఈ లెటర్ లో శ్రీ సార్ (ప్రధాన పురుషార్థమైన) ధర్మాచరణ కర్మసుకౌశలంగా చేయుటకు అవసరమైన అవగాహన ఇస్తున్నారు.

గొలగమూడి

30-05-2005

డియర్ సాయి,

ఈరోజు ప్రపంచమంతా అంధకార బందురంగా ఎంతో దుఃఖములో మునిగి వుంది. ఒకవైపు తాము చేసే పనులన్నీ తమకు సుఖసంతోషాలను తెచ్చిపెడతాయని వారు ఆ పనుల ద్వారా దుఃఖాన్నే తెచ్చుకుంటున్నారు. రోగాల ద్వారా, నష్టాల ద్వారా, వ్యాజ్యాల ద్వారా, దొంగతనాల ద్వారా కష్టం కలిగినప్పుడు అలాంటి నష్టం కలిగించిన వారే తమ దుఃఖానికి కారణమని మొత్తుకుంటారు. కానీ వాళ్లు చేసిన కర్మలే అందుకు కారణమని ఏ మాత్రము తలంచరు కదా. ఒక కాంట్రాక్టరు లక్షలు కోట్లు సంపాదిస్తున్నారు. ఎట్లా సంపాదిస్తున్నాడు? కేవలం సత్యం ధర్మం తప్పి నడుచుకుని మాత్రమే. పదిమందికి ఉపయోగపడే రోడ్డు వేయమంటే ఇంజనీర్లకు లంచాలు ఇచ్చి రోడ్డు అధ్వానంగా వేస్తున్నాడు. అలా ఆర్జించిన ధనం దుఃఖము కలిగించక ఏమి చేస్తుంది?

**శ్రీ స్వామివారు బోధించిన సత్యం, ధర్మం, సంపన్నత్వం, సాధారణత్వం, సద్గురు సేవ ఎంత గొప్ప పచ్చి సత్యాలో కదా. అందరూ ధర్మం తప్పి సుఖ సంతోషాలు పొందాలని చూస్తారు. కానీ ఆ వచ్చిన సుఖ సంతోషాలు చూస్తుండగానే దుఃఖాలు అవుతున్నాయి.** టీచరు పాఠం చెప్పడు. విద్యార్థి చదవడు. డాక్టర్ తన వృత్తిలో నైపుణ్యము కొరకు శ్రమించి చదవడు. పేషంటు మందు సేవించకుండానే ఆరోగ్యము పొందాలని చూస్తాడు. ఎంతోమంది ఆధ్యాత్మిక పేపరు పేరుతో ధనము ఆర్జిస్తున్నారు. ఆధ్యాత్మికత గోరంత కూడా ఆ పేపర్ లో కనిపించదు. **ఎవరి ధర్మం వారు త్రికరణ శుద్ధిగా ఆచరిస్తే వారికి కలిగేదంతా ఆనందమే. అలా ధర్మాచరణ చేయాలంటే ఆనందం అనేది బాహ్యంగా వస్తువుల నుండి రాదు. అది మన అంతరంగాల లోనే ఉంది. అది మనం పొందాలంటే ఇష్టం, అయిష్టం సమూలంగా పోవాలి. ఇష్టాఇష్టాలు పోవడం అంటే భగవంతుడు**

**మనకిచ్చిన పని నూటికి నూరుపాళ్లు శ్రద్ధగా ఆచరించడం ఒక్కటే మార్గము.** (నీకు ఇప్పుడు) భగవంతుడు అనుగ్రహించిన పని చదువు- పి హెచ్ డి. దానిని నీవు ఇష్టాఇష్టాలు లేకుండా అది నీ ధర్మంగా భావించి సాధిస్తే తరుగులేని ఆనందం శాంతి లభిస్తాయి.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి,

11-6-2002

చిరంజీవి సాయి సుబ్రహ్మణ్యం గారి కి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం WORK ALLOT చేశారని వినినందుకు చాలా సంతోషం. మాస్టారు గారు అంటారు చేసే వాళ్లను చూస్తే బాబా ఇంకా పనులు ఇస్తూనే ఉంటారు. అయితే మనం దానిని ఒక చాలెంజుగా తీసుకొని బాబా మెప్పు పొందేంతగా చేయాలి. పనిని చూసి విడవకూడదు. అదే బాబా సేవ, అంతేగాని కర్పూర హారతులు మాత్రమే కాదు అని చెప్పేవారు. విద్యానగర్ మందిర నిర్మాణమప్పుడు పవళింపు హారతికై పోగలిగేవాడిని. ఉదయం వేకువజామున నుండి క్యూరింగ్ నీరు పోయాలి. 10 గంటల తరువాత కూలీలకు, పిల్లలకు అన్నం కూర సిద్ధం చేయాలి. కనీసం 3 సార్లు 3*4 kg వండాలి. పెద్ద అండా లేదు. అన్నాలు తిన్నాక బొచ్చలు తోముకోవాలి. 3 గంటల నుండి 5 గంటల వరకు CURING కు నీరు – 5 గంటల తర్వాత మరలా వంట పని వడ్డింపులు ఇక హారతుల కెప్పుడు హాజరయ్యేది. ఆ మహానుభావుడు ఎందుకో గాని నన్ను మాత్రం హారతులకు రావడం లేదేమి? అని అడగలేదు. పనిలో INVOLVE అయ్యాక తీరిక లేదు. **ఆయన పని అనే పరిశుద్ధమైన ఎరుకతో చేయి. PROJECT WORK కష్టమని ఎప్పుడు తలవవద్దు. అదే వారి సేవ అని**

**ద్విగుణీకృతమైన ఉత్సాహంతో వారికి నమస్కరించి చేస్తూ ఉండు. ఆయనే నడిపిస్తాడు. అందరికంటే గొప్పగా వారి కృప పొందాలన్న ఒక్క ధ్యేయం ఉంటే వ్యామోహాలు, జిహ్వాచాపల్యాలు అన్నీ పోతాయి. ఇష్టమున్నా, లేకున్నా, తప్పుగా సైనా, సంక్షిప్తంగాసైనా పూజ, పారాయణ, ప్రార్థనలు మానకుండా చేస్తుండు. EXERCISE REGULAR గా చెయ్యి.** JUST TO KEEP UP YOUR BODY IN TUNE WITH YOUR WORK. తాత గారు చెప్పినవన్నీ అవసరం లేదు.

శివ వ్రాసిన letter నిన్న చేరింది. అందులో హైదరాబాద్ అడ్రస్ లేదు. అది బెంగుళూరు నుంచి వ్రాసాడు గదా? హైదరాబాద్ POSTAL ADDRESS ఇవ్వు. ఇంత LATE అయ్యేందుకు కారణం ఒక్కటే. పొరపాటున శివ అడ్రస్ అంతా తెలుగులో వ్రాసారు. PINCODE వేయలేదు. గనుక SORTING లో ప్రక్కన పడేసి తెలుగు తెలిసిన వారి కొరకు వెయిట్ చేయవలసి వచ్చి లేట్ అయింది. పిన్ కోడ్ ఉన్నా త్వరగా వచ్చి ఉండును. హైదరాబాద్ లో శివ అడ్రస్ ఇవ్వు. తీరిక దొరికినప్పుడు మరల వ్రాస్తాను.

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మీ కుండాలని ప్రార్థిస్తూ,

పెసల సుబ్బరామయ్య.

**శ్రీ దర్గా స్వామి వారు చెప్పినట్లు సాయి, సాయి అనుకుంటూ ఎక్కువ పనులు వంట, స్నానం, travel-latrine లో వగైరా చేస్తుండు.**

శ్రీ బ్రహ్మం గారి మఠంనకు పంపిన cheque చేరినది. బెంగూళూరులో మీ area pincode వ్రాయి.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

Om

గొలగమూడి, 13-6-05

Dear Sai,

**మానవుని దుఃఖమునకు కారణము- కోరిక అన్నారు బుద్ధుడు. శ్రీ స్వామివారు "ఆశ" అన్నారు. ఇది అంటే ఆశ ఎంత నిక్కృష్టంగా పనిచేస్తుందో చెప్పలేను. మనం ధర్మబద్ధంగా ఉన్నాము అని అనుకుంటూనే మనము తప్పు దారిన నడిచేటట్లు చేస్తుంది. ఎవరు అలా చేసేది – మన ఆశయే.**

**ఒకే ఒక principle కు stick on అయి ఆ పని, ఆ ప్రిన్సిపల్ తప్పు తక్కిన వాటికి మన బుర్రలో తావివ్వకూడదు.**

నేను తప్పు చేస్తున్నానో, రైట్ చేస్తున్నానో నాకు తెలియదు. శ్రీ స్వామివారి ఆజ్ఞననుసరించి గొలగమూడిలో ఉండాలి. అలా ఉంటూ వారి సేవ చేయాలి. ఆ నిర్ణయానికి వచ్చాక అన్ని మార్గాలు వారే ఏర్పరిచారు. 1. వారి కృపతో నెల్లూరు గానీ ఇతర చోట్లకు గానీ వెళ్ళే అవసరం లేకుండా చేసారు. 2. వైద్యానికి కూడా పంపడం లేదు. 3. బంధువుల వివాహాలు, కర్మ క్రతువులు మాన్పించారు. పెన్షన్ మా ముగ్గురికీ మూడు భాగాలు పెట్టి వాళ్ళ రెండు భాగాలూ వాళ్ళకిచ్చి నా భాగమే నేను ఖాళీ చేస్తున్నాను. మిగిలితే (నా భాగంలో) మదర్ తెరెసా ఆశ్రమంకు ఇస్తున్నాను. ఇవన్నీ నేను చేసినవి కావు. **నీ ఆజ్ఞ పాటించి నీ మార్గాన నడుపు తండ్రీ అనే ఒక్క ప్రార్థన ఒక్క నిర్ణయము మాత్రమే చేశాను. మిగిలినవన్నీ వారే ఒనగూరుస్తున్నారు. ఇది నీవు బాగా యోచించు.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

OM

24-06-2005

Dear sai!

**మానవుని సమస్య ఏమిటి? ఉన్నదానితో అసంతృప్తి లేనిదానికై తపన అంటారు శ్రీ మాస్టారు.** నీవు వారం వారం 15 రోజులకు ఇక్కడకు రావాలంటావు. శ్రీ స్వామివారు మనకిచ్చిన సదవకాశం నీ అసంతృప్తి వలన సద్వినియోగం చేసుకోలేకుండా ఉన్నావు.

ఈ ప్రపంచ వాసన లేకుండా నిన్ను I.I.T Campus శ్రీ స్వామివారు నీకు ఒక పని అప్పగించి చేయమంటే, అది కాదు నేను గొలగమూడి లో ఉంటాను, వారం వారం వస్తాను అనడం, ఉన్నదానితో అసంతృప్తి లేని దానికై తపన అనే మానవుని సమస్యను నీవు వదలలేదు. ఆధ్యాత్మికత అంటే గురువు మాటను implicit obedience గా ఆచరించడం అనేది నీ ఆచరణలో వచ్చేంతవరకు శ్రీ స్వామివారి కృప మనం సంపూర్ణంగా పొందలేము. ఎర్రిస్వామి, తిక్క స్వాముల కథ మర్చిపోయావు. తిక్క స్వామి ఎంత గొప్పవాడో! గురువు మాటకు ఎదురు ఒకమాట చెప్పకుండా వెళ్ళిపోయాడు. రోశిరెడ్డి కూడా తిక్కస్వామి లాంటి మహనీయుడే.

ఇక్కడుంటే నాకు ఎన్ని బాధలు ఉన్నాయో మీకు తెలుసా? ఎప్పుడూ ఏకాంతంగా కూర్చోనివ్వరు. ఎవరో ఒకరు వస్తారు. ఇంటిలో వారు ఎప్పుడు అక్షింతలు వేస్తుంటారు. ఎందుకు? వాళ్ళను గురించి నేను పట్టించుకోనట. పుస్తకాల అంగడి ఆయన రోజుకు ఒక సమస్య తెస్తాడు. సాయి మాస్టర్ నిలయం తాత రోజుకు 5 లేక 6 సమస్యలు తెస్తాడు. **వీటన్నిటిని తప్పించమని ప్రార్థించాలా? No. ఈ బాధలన్నీ తట్టుకుంటేనే నా మురికి వదులుతుంది. ఋణానుబంధాలు, వాగ్దానాలు తీరాలి కదా. మనకు ఆరోగ్యము, అన్నం పెట్టారు. ఇంకేమి కావాలి. తక్కిన విషయాలన్ని ఆటలో భాగాలే. ఆట ఆడడం నేర్చుకోవాలి.**

శ్రీ స్వామివారి కృపా సదా మీకు ఉండాలని ప్రార్థన

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

Dear Sai!

పాతకాలపు యుద్ధాల్లో యుద్ధానికి వెళ్ళే సిపాయి కత్తికి పదును పెట్టుకుని వెళ్ళాలి. పదుని లేని మొద్దు కత్తిని తీసుకోని యుద్ధానికి పొతే అపజయం తప్పదు.

అంతే కాదు వానికి హాని జరుగవచ్చు. కనుక నిన్నిప్పుడు P. HD. అనే యుద్ధానికి పంపారు శ్రీ స్వామి వారు. నీ ఆయుధం నీ మెదడు. దానికి బాగా పదును పెట్టుకోవాలి. మెదడు పదును పెట్టాలంటే మితాహారము ఒక్కటే మార్గము. ఆహారంలో నియమాలు పాటించాలి. నియమాలు కాదు, కఠోర నియమ పాలన అవసరం. కఠోర నియమపాలన చేసే వాళ్ళంటే శ్రీ స్వామి వారికి ఎంతో ఇష్టం. అంతమంది సేవకులలో రోసిరెడ్డిలాగా కఠోర నియమ పాలన చేసే వారే లేరు. అందుకే అంత గొప్పగా వారిని అనుగ్రహించారు. ఎంత గొప్పగా అనుగ్రహించారో నాకు నీవు వ్రాయాలి. నీవు correct గా వ్రాస్తే సరే –తప్పనుకుంటే నేను వ్రాస్తాను. మొదట నీవు వ్రాయి. వాళ్ళు ఆగష్టు లో పరీక్ష పెడతాము అన్నారు. ఆ సిలబస్ అంతా ముందు గానే క్షుణ్ణంగా చదివి ఏ ప్రశ్న వచ్చినా ఎంతో గొప్పగా మీ గైడ్ ఆశ్చర్యపోయేటట్లు వ్రాసేటట్లు చూడాలి. అప్పుడు శ్రీ స్వామి వారికి మనం సంతోషం కలిగించిన వారమై ఉంటాము. అంతేకాని మరి ఏ విధంగా ఉండలేము. అన్నం తినేటప్పుడు దోవ నడిచేటప్పుడు, brush చేసుకునేటప్పుడు, bathroom లో, లెట్రిన్ లో, రాత్రి పడుకునేటప్పుడు నామ స్మరణ చేస్తుండు. స్వామి మీరు నాకిచ్చిన పని మీకు ప్రీతి కల్గించేటట్లు చేసేటట్లు నన్ను అనుగ్రహించ వేడుకుంటున్నాను అని ప్రార్థించు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పె. సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

**భవాని గారి కి సర్ letter :**

మాకు నాన్నగారు ఉన్నన్ని రోజులు మా అమ్మ నిత్యం వడ్లు దంచి మాకు హరిజనవాడలో గంపలో తీసుకుపోయిన సామానులు అమ్మి తెచ్చిన వడ్లు దంచి మాకు అన్నం వండిపెట్టేది. మరి ఈనాడు ఇంత ప్రయోజకులమైనామంటే అది మాతల్లితండ్రులు మాకిచ్చిన ఆస్తిపాస్తుల వలన వచ్చినవి కావు. **గనుక నీవు నీ బిడ్డల భవిష్యత్తు ఎట్లా?**

**ఆస్తిపాస్తులు లేకుంటే? అని చింతించవద్దు. వారికి మంచి సంస్కారము చక్కని విద్యాబుద్ధులు నేర్పించు. నీ రెక్కల కింద పెంచి పెద్ద చెయ్యి. ఇతరులకు సహాయం చేసే బుద్ధిని వారికి ఉగ్గుపాలతో పెట్టిన విద్యగా చేస్తుండు. ఏ వస్తువునే గాని, ధనమునే గాని వృధా చేయరాదనే సంస్కారము నేర్పు. ప్రతి వస్తువు భగవంతుడు సృష్టించినదే. అది మన చేతికి భగవంతుడు ఇచ్చింది తోటి మానవులకు అది లేని వారికి అందించేదానికి కానీ, దానిని మితిమీరి అనుభవించేందుకు కాదనే విషయం వారికి బాగా నేర్పు. బాబా ఏమి చేశారు. తన బిక్షతో జీవిస్తూ తననాశ్రయించిన వారికి సర్వసౌకర్యాలు అమర్చేవారు.** అర్ధరాత్రి వచ్చిన అతిథులకు అన్నం పెట్టమని రాధాకృష్ణమాయి ఇంటికి పంపేవారు. ఎన్నో మిఠాయిలు పండ్లు వస్తే బిడ్డలకు పెట్టేందుకు భక్తులకు ఇచ్చేవారు. మనము అలాగే ఉండేందుకు ప్రయత్నించాలి. **అందరిని మంచి వసతి గృహాలకు పంపి తను మాత్రము పాడుబడ్డ మసీదులో ఉన్నారు. అది మనము నేర్చుకోవలసినది. ఇతరులకు ఇవ్వడంలో సంతోషం పొందాలి. అప్పుడు దైవకృప కలుగుతుంది**. చిన్నప్పుడు మా మేనత్త ఇచ్చిన పాతగుడ్డలు నేను హుందాగా ధరించి సంబరపడేవాడిని. మరి ఇప్పుడు కొత్తబట్టలే ఒకరికి ఇవ్వగలిగే స్థితిలో ఉన్నాను. ఇది మా తల్లిదండ్రులు నాకిచ్చిన ఆస్తిపాస్తులు వల్లనా అమ్మా! 11వక్లాసు (SSLC) పాసై పదిరూపాయలు తీసుకొని మా తల్లిగారి ఆశీస్సులతో మద్రాసు వెళ్లాను. ఆ పది రూపాయలు రానుపోను చార్జీలకు సరిపోతాయి. మరి మద్రాసులో హాస్టల్లో చేరేందుకు తిరగాలి. చార్జీలకు డబ్బులేదు. కాలి నడకే. అన్నం అసలు లేదు. అలాంటి స్థితిలో నుండి ప్రస్తుత స్థితికి ఎదిగాను. ఇది కేవలం దైవకృపే. ఆ దైవకృపకు ఒకటే కారణమని నా నమ్మకం. చిన్ననాటి నుండి ఎందుకో తెలియని దైవభక్తి. గ్రామములోని పాడుబడ్డ దేవాలయంలోని శ్రీరాములు విగ్రహానికి తోటి పిల్లలందరినీ తీసుకుపోయి అభిషేకం చేసేది. అలాగే గ్రామదేవతకు చేసేది. సాయంకాలం గరుడగుమ్మం తీసుకుని ఇంటింటికి తిరిగి నూనె భిక్ష ఎత్తి దేవాలయంలో దీపం పెట్టే వాళ్ళము. మమ్మల్ని చూసి ఒక భజనబృందం

తయారయింది. మాకు ఒక హరిజన టీచరు వచ్చారు. నా పుస్తకాలు చూసి ఆయన మహా ఆశ్చర్యచకితుడైపోయాడు. వాటిని ఎంత జాగ్రత్తగా వాడేవాడినో, ఆయనే నన్ను పై చదువులు చదవమని ప్రోత్సహించి, మావాళ్లు ఆర్థికంగా అసక్తులు అయితే అన్నం తినకుండా నిరాహార దీక్ష చేయమని సలహా ఇచ్చారు. అలా చేస్తే విధిలేక ఒకసారి ఏడో తరగతిలో చేర్చారు.

**ఇదంతా ఎందుకు చెప్పానంటే మనం చేసేది ఏమీ లేదు. అంతా దైవప్రేరితమే. మీరు చింతపడవద్దు అని చెప్పేందుకు.**

ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య.

శ్రీస్వామివారు చెప్పింది ఎంత సత్యమో "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా". ఒకరోజు ఒక ఆమె శ్రీస్వామివారి వద్ద చీట్లు వేసింది. అందులో తన ఆశకు భిన్నంగా చీటీ వచ్చింది. శ్రీ స్వామివారిని కాదనలేక చాలా స్వల్పంగా శ్రీ స్వామివారి ఆజ్ఞ నామమాత్రంగా నెరవేర్చి, ఆ తర్వాత తన ఇష్టం నెరవేర్చుకుంది. అది ఎంత అపచారము వారికి తెలియదు. **అసలు చీటీలు పెట్టి ఆ మహనీయుని సలహా కోరడం ఎందుకు? తన అభీష్టమునకు భిన్నంగా వస్తే ఎట్లా అనే ఆలోచన ముందే ఉండాలి. తీరా వారు ఆజ్ఞాపించాక మనం వారి మాటను పాటించకపోవడం ఎంత అపచారం. మీరెప్పుడూ అలా చేయవద్దు.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

24-04-1997

Dear Rajkumar!

శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయడం. నీ letter చేరింది. **శుభం, చక్కగా ఉద్యోగం చేస్తూ అది భగవంతుని సేవగా భావించి చేయి.**

అహం వైశ్వానరో భూత్వా – అనే శ్లోకంలో (భగవద్గీత) ప్రాణులందరి ఆకలిని నేనై, వారు భుజించు నాలుగు రకముల ఆహారమును జీర్ణము చేయుచున్నాము అని చెబుతారు. **గనుక మనము సంపాదించేది ఎందుకు? ఆకలిని తృప్తి చేయుటకు, అంటే ఆ పరమాత్మను సేవించుటకు అని అర్థము.** కనుక మనం చేసే ప్రతిపని ఆకలి కొరకే? **గనుక పరమాత్మ సేవయే అవుతుంది. మన భావం ప్రధానం అన్న మాట. "కష్టపడి పనిచేయి, దేవుని నామం ఉచ్చరించు" ఇది శ్రీ సాయినాధుని ఆజ్ఞ. నిత్యం హృదయపూర్వక పూజ, పారాయణ చేసుకుంటూ సిటీలో అడ్డ తిరుగుళ్ళు మానివేస్తే బోలెడంత టైం కలిసి వస్తుంది.** వీలున్నప్పుడంతా చార్మినార్ ఏరియాలోని గౌళిపుర గాంధిబొమ్మ దగ్గర బోరింగ్ శ్రావణకుమార్ గారి ఇంటిలోని **శ్రీ శ్రీ నాంపల్లిబాబాగారి సన్నిధిలో సాధ్యమైనంతసేపు గడుపు. Holiday రోజు అన్ని ప్రోగ్రాములు మానుకొని శ్రీ శ్రీ నాంపల్లిబాబాగారి సన్నిధి వదలకుండా కూర్చోవటం అలవాటు చేసుకో**. సాయినాధుడు నిన్ను కరుణించి Hyderabad పంపారు. శ్రీ శ్రీ నాంపల్లిబాబాగారివంటి **మహాత్ముల సన్నిధి అందరికి లభించదు. ఆ సన్నిధి సద్వినియోగం చేసుకో**. "నిప్పు దగ్గర కూర్చొని నా గుడ్డలతడి ఆరబెట్టమని ప్రార్థించనక్కర లేకుండానే తడి ఆరిపోతుంది. అట్లాగే **మహనీయుల ప్రత్యక్ష సాన్నిధ్యంలో కూర్చున్న మాత్రాన మన సాధనతో నిర్మూలించుకోలేని దుష్టసంస్కారాలు వాటంతట అవే కడిగి వెయబడతాయి అని పూజ్య శ్రీ భరద్వాజ మాస్టారు చెప్పారు.** అందుకే నన్ను శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధి వదిలిపెట్టవద్దని పదే పదే చెప్పారు. గనుక నీవు ప్రస్తుతం శ్రీ నాంపల్లిబాబాగారిని వదిలి పెట్టవద్దు. వీలుంటే ఆ ప్రాంతంలో రూమ్ తీసుకోని ఉంటే నిత్యం వారి సన్నిధి లభిస్తుంది.

ప్రకృతిప్రకాశ్, ప్రకృతివైద్యశాల, బేగంపేట, హైదరాబాద్

హైదరాబాదులో నీవుండే ఏరియాలో ప్రకృతివైద్యశాల

శ్రీ స్వామి వారి భక్తుల కొరకు వెతకవద్దు, వారికై వారే పరిచయం అవుతారు. శ్రీ నాంపల్లిబాబాగారే నీకు సర్వస్వం అనుకో. మాస్టర్ గారు 1979 లో చెప్పిన మాటలు 16-04-97 సాయిబాబా పత్రికలో వేస్తారు. అది చదువుకో. నీకు సాయిబాబా పత్రిక రాకుంటే కష్టములోనైనా సంవత్సర చందా కట్టి సాయిబాబా పత్రిక తెప్పించుకో. అన్నిపత్రికలూ దాచిపెట్టు. అవి వెల కట్టలేని ఆణిముత్యాలు. మాస్టర్ గారి చరిత్రరిలీజ్ అయింది. హైదరాబాదు కూడా వస్తాయి.

చింతా లక్ష్మినారాయణ, 5-1/10, 6 New Maruthi Nagar, Kothapet, హైదరాబాద్ – 500035. వీరు మన దమ్మపేట శ్రీరామశాస్త్రి, లక్ష్మక్కగారి బంధువు. వీరిని కలుసుకో. **నీవు ఎక్కడ వున్న నిత్యం ½ గంట పిల్లలతోనైనా సత్సంగం చేస్తుండు. Rolling stone gathers no mass. తిరుగలికి ఏమి అంటుకోదు అని సామెత ఉంది. తిరిగినందున ఏమీ ప్రయోజనం లేదు. లోకం నుండి పకడ్బందీగా బయటపడి మన డ్యూటీ పూజ, పారాయణ, సత్సంగం, శ్రీ నాంపల్లిబాబాగారి సన్నిధిలో నీ కాలం సద్వినియోగం చేసుకో. మనం మన శ్వాసలు ఆగిపోయాక ఏమీ చేయలేము. ఆగకముందే ఏమైనా చేయగలిగింది.** లెటర్ వ్రాస్తుండు. నీ సందేహాలకు జవాబు వ్రాస్తుంటాను. ప్రతి జాబులో అడ్రస్సు వ్రాయి.

ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

26-06-1998

Dear Venu,

ఒకరోజు మాస్టారుగారు ఏదో మాటల సందర్భముగా రాజద్రోహం అంటే ఏమిటో ఇలా చెప్పారు. **"ప్రభుత్వానికి చెల్లించవలసిన టాక్స్ గాని ఇతరత్రా ఏ ధనమైనా చెల్లించక పోవడాన్ని రాజద్రోహమని చెప్పారు. ప్రభుత్వమంటే మనలను పాలించే రాజన్నమాట. రాజుగారికి చెల్లించవలసిన సొమ్మును చెల్లించకపోవడాన్ని రాజద్రోహం అంటారు. మనలను ఒక ఆఫీసులో నియమిస్తే అడిగేవారు లేరని ప్రభుత్వ వస్తువులను సొంతం చేసుకోవడం లాంటి అనేక పనులను నమ్మక ద్రోహమంటారు. ద్రోహం కాదు నమ్మక ద్రోహం అన్నారు**. ఎందుకు? మన ఇంట్లో ఎవరో దొంగ జొరబడి దొంగిలించుకు పోతే అది దొంగ చేసిన ద్రోహమే. నమ్మక ద్రోహం కాదు. కానీ మన ఇంట్లోని వారు గాని, మన స్నేహితులు గానీ, బంధువులు గానీ మనం నమ్మికతో ఇంట్లో ఉంచుకుంటే వారే ఆ దొంగపని చేస్తే అది నమ్మక ద్రోహం. అంటే నమ్మిన వారికి ద్రోహం చేయటం. మనలను నమ్మి office మన చేతికిస్తే మనం అక్కడ **ప్రభుత్వానికి నష్టం కలిగేలా ప్రవర్తించడం నమ్మక ద్రోహం అవుతుంది. మనం ప్రైవేటు personకు నష్టం కలిగిస్తే ఆ ఒక్క వ్యక్తికే బాకీ పడతాము. రాజు సొమ్ము ప్రజలందరిది కనుక దానికి punishment యొక్క మోతాదు కూడా ఎక్కువగానే ఉంటుంది**. బాబా చరిత్ర లో కర్టిస్ దంపతులు అలాగే కనిపిస్తారు, గనుకనే వారు బాబా కృపను పొందలేక పోయారు. వారిలోని అహంకారానికి తోడు వారి back life (file) అంత worseగా ఉంది. గనుకనే బాబా వారినంత నిర్దయగా మాట్లాడి పంపేసారు. కనుక బాబా కరుణామయుడే అయినా వారి కృప పొందుటకు అనర్హులైన నీచులు, తుచ్ఛులన్నమాట. వారు లోకం దృష్టిలో చాలా గొప్పవారే కావచ్చు. కానీ బాబా దృష్టిలో అంత నిక్రుష్టులన్నమాట. ఎంతో పేదవారైన పురందరే, మహల్సాపతులు పస్తులుంటున్నా వారే ఆ దంపతుల కంటే గొప్పవారన్నమాట. గనుక మనలను నమ్మి ప్రభుత్వం మన చేతికి తాళాలిస్తే భగవంతుడు మనపై ఉంచిన బాధ్యతను

మనం వమ్ముచేసే విధంగా నమ్మక ద్రోహం చేస్తూ ఉండడం ఎంత ఘోరమో మనలను ఈ లోకవాసులు ఎవరూ దండించకున్నాగానీ బాబా గారికి మనం ఆఫీసులో చేసే పనులు తెలియవా?

ఇదే విధంగా **మన కర్తవ్య నిర్వహణలో కూడా ఎంతో జాగ్రత్తగా నిర్వహించాలి. బాబా మన యజమాని అని తలచి (విశ్వసించి) మసులుకొంటే కొండంత వారి అండ మనకెప్పుడూ మనం వద్దన్నా మనకుంటుంది.** మాస్టారి తండ్రియైన అనంతాచార్యులు గారికున్నట్టు. మనం మన ఇష్టమొచ్చినట్లు నడుచుకుంటే ఆ పనుల ప్రభావం ముందు ముందు మనమే అనుభవించాలి గదా! రాణిగారి బంగారు కాసుల బిందెను త్రిప్పికొట్టిన ఆ మహనీయుని రాజరికం ముందు మన కర్పూర హారతులు, నైవేద్యాలు ఏపాటివి? **మానవులు కేవలం అజాగ్రత్త కారణంగా రెప్పపాటులో నిచ్చెన మీదనుండి క్రింద పడిపోతారు.** దీన్ని మాస్టారు చక్కగా విశదీకరించేవారు. మేడపై నున్న దారపు ఉండ నుండి దారం తీసుకుంటూ (గాలిపటాల ఆట కోసం) పొరపాటున అజాగ్రత్త వలన దారపు ఉండను మిద్దె క్రిందకు తన చేతినుండి జారగొట్టుకున్నాడు. ఇక వాడు దారాన్ని చేదే కొలదీ దారపు ఉండ ఇంకా వేగంగా గాలిలో దొర్లుకుంటూ భూమిని చేరడం తప్ప తన చేతికి ఉండ రానేరాదు. అలా ఉంటుంది మానవుల Down fall అన్నారు. అజాగ్రత్త అని పైకి మనకు totalగా కనిపించినా ఆ అజాగ్రత్తకు అనేక కారణాలు, total effect ఉంటుంది.

**బాబా చరిత్ర, సాయి ప్రభోధామృతాలలోని వివిధ నీతులు ఎంతో జాగ్రత్తగా హృదయగతం చేసుకుని జాగ్రత్తగా – అనుక్షణం ఏమరుపాటులేని జాగ్రత్త చూసి మసులుకోకపోవడం. తద్వారా బాబా యొక్క నిజతత్వాన్ని మరవడం, సర్వజ్ఞులు, సర్వవ్యాపకులు, సర్వ సమర్ధులు అన్న విషయమే గుర్తుండక పోవడం.** మనం అనుక్షణం ఉండవలసినంత జాగ్రత్తగా మన నిత్యజీవితంలో ఉండకపోవటంతో

వెనుకటి మన సంస్కారాలకు ప్రస్తుత పరిస్థితులు తోడై ఇంకా ఇంకా పాపపు పనులు ఆ అజాగ్రత్త పరిస్థితిలో చేయడం ద్వారా మన పాప ఫలితం మితిమీరి పెరిగిపోవడం.

పై కారణాలే కాక ఇతర అనేక కారణాలు, అంటే **ఎవరి దగ్గరంటే వారి దగ్గర ఏదంటే అది తినడం వంటి వాటి ద్వారా సంక్రమించే ఫలితం లాంటివి etc. వలన నీటిమీద నడిచే పడవ వేగాన్ని ఎదురుగాలి హరించినట్లు మన బుద్ధిని హరించి పతనం చేసి మనలను దారపు ఉండవలె క్రిందికి తోస్తాయి. గనుక ఆధ్యాత్మికతలో ఆరూఢస్థితికి వచ్చినంత వరకూ అనుక్షణం ఎంతో జాగ్రత్త అవసరం.** అది లేకుంటే అధోగతే మిగులుతుంది. ఆరూఢస్థితికి వచ్చే కొద్దీ ఆ జాగ్రత్త వారికి స్వతస్సిద్ధమైపోతుంది. ఇంకా పరిపక్వానికొస్తే మనమే భగవంతునితో ఐక్యమై ఉంటాము. గనుక నిచ్చెన నుండి పడిపోయే ప్రసక్తేలేదు.

డాక్టరు పర్మిషన్ లేకుండా కాంపౌండర్ దగ్గర మందు తీసుకున్న మరుక్షణమే రామకృష్ణ పరమహంస గారికి కళ్ళు పోయి గ్రుడ్డివాడౌతారు. అప్పటికే వారికి అమ్మ సాక్షాత్కారం అయి ఉంది, గనుకనే తన అంధకారానికి కారణం ఈ మందు పొట్లమేనని తెలుసుకుని దాన్ని వైద్యశాల కిటికీ నుండి లోపల పారవేయగానే దృష్టి వస్తుంది. అంతటి వారికే పాపం అలా అంటుకుంటుంటే ఇక మనమెంత జాగ్రత్తగా ఉండాలో మనమే యోచించుకోవలెను.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

3-9-2002

Dear Sir,

మాకు Air Mail Covers దొరకవు. నెల్లూరు నుంచి తెప్పించేలోగా నీవు అడ్రస్ వ్రాసిన లెటర్ పోయింది. అందువల్ల వ్రాయలేక పోయాను. నీ బలహీనత గురించి వ్రాశావు. నీ వయసులో ఉండే అందరికీ ఉండే బలహీనతే అది.

అయితే అది ధర్మవిరుద్ధమైనదని తెలుసుకోవడం ముఖ్యం. మన అక్క చెల్లింఢ్రను ఆ దృష్టితో ఎవరైనా చూస్తే మనం సహించగలమా? అలాంటి తప్పు చేయడం ఏం బాగుంది. శ్రీ మాష్టారు గారు అంటారు "మన పనులు, మాటలు మాత్రమే కాదు మన ఆలోచనలు గూడా మన భవిష్యత్ కర్మను సిద్ధం చేయడంలో పాత్ర వహిస్తాయి" అంటారు. చెడు ఆలోచనలకు చెడ్డ ఫలితం తప్పక సంక్రమిస్తుంది. ఈ విషయం జాగ్రత్తగా అనుక్షణం గుర్తుంచుకుంటుంటే అలాంటి భావాలు రావు. త్వరగా పెండ్లి చేసుకుంటే ఈ devil విరగడౌతుంది. శ్రీ సాయినాధునికి తీవ్రంగా విన్నవించి Devil గుప్పిట నుండి తప్పించమని ప్రార్థించండి.

నీ work ను గురించి వ్రాసింది నాకు సరిగా అర్థం కాలేదు. ఏది ఏమైనా ప్రతి విషయంలోనూ ధర్మబద్ధంగా నడచుకోవడం ముఖ్యం. అప్పుడు మనం మనకిచ్చిన స్థితి నిలుపుకోగలుతాము. కోటాను కోట్ల జీవులలో మనలాగా బుద్ధి వికసించి ఆరోగ్యం చక్కగా ఉండి, పరిస్థితులు అనుకూలమైన జీవులు ఎన్ని ఉన్నాయో యోచించు. గనుక ధర్మంగా నడుచుకోవడం చాలా ముఖ్యం. అధర్మంగా ప్రవర్తించేవాళ్లు దోగాడే పసిపిల్లలతో సమానం. వారికి పెద్ద విలువగల కరెన్సీ నోట్లిస్తే చించేస్తారు. గనుక మనం ధర్మం తప్పితే వారిలాగా ప్రవర్తించినట్లే అవుతుంది. మీ Father and Mother గానీ sister గానీ ఇంకా ఇక్కడకు

రాలేదు. వస్తే మాట్లాడతాను. బెంగుళూరులో ఉండే సాయికి (దమ్మపేట) కాస్త అనారోగ్యమై గొలగమూడి వచ్చియున్నాడు. ఈ లెటర్ నీకు చేరుతుందా ?

శ్రీ స్వామి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

02-11-2002

Dear Sir,

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థన. **దాపరికంలేని నీ లెటర్ చూచి చాలా సంతోషించాను.** ఒక అమ్మాయికి మనసులో చోటివ్వడం ఎంతో అధర్మం కదా! మనకు ఏది శ్రేయస్సో సాయికి తెలుసు. కనుక వారు ప్రసాదించిన అమ్మాయిని స్వీకరించాలి. అంతేగాని ఆ అమ్మాయి తలంపులన్నీ అధర్మమని బాగా చింతించి మనసు నుంచి దూరం చేయాలి. మన అక్క, చెల్లెండ్రను గూర్చి ఎవరైనా ఇతరులు అలా యోచిస్తుంటే మనం సహించగలమా అనేది ఆలోచించు. గనుక అట్టి ఆలోచనలు ఎంత అధర్మమైనవో తెలిసి అట్టి అధర్మకార్యం ద్వారా మనమే మన భవిష్యత్ జన్మలను పాడుచేసుకుంటున్నామనే నిశ్చయానికి వస్తే అలాంటి తలంపులు పోతాయి. అప్పటికీ పోకుంటే ప్రాయశ్చిత్తాలు, తీవ్ర ప్రాయశ్చిత్తాలు self imposed punishments just like Vivekananda చేసుకోవాలి. నీకు తోచిన మరొక మార్గం యోచించు.

T.V. లో sex విషయాలు చూడడం మానసిక బలహీనత - అది వివాహం కాగానే పోదు. భార్య ఉన్నా మరొక విధంగా ఆ బలహీనత పనిచేస్తుంది.

**భగవంతుడు సృష్టి కొరకు పెట్టిన ఈ లైంగిక సంబంధాన్ని దుర్వినియోగం చేస్తే ఎంత నష్టపోతామో వ్రాయలేను. మానసిక, శారీరక శక్తులన్నీ ధ్వంసమౌతాయి.** Explode అయిన టపాకాయ నుండి బయల్పడిన కాగితం ముక్కలాగా తయారవుతాము. **మన వీర్యమే మన మేధస్సు అవుతుంది**. వీర్యం పోయినట్లు భౌతికంగా తెలియదు. అది ఇలాంటి తలంపులతో వీర్యం నష్టపరుచుకున్నామంటే మన భవిష్యత్తు ఎంతో దారుణంగా ఉంటుంది. ఇలాంటి తలంపులకు కారణం

(1) దుష్ట **సాంగత్యం** - మనుషులు గాని, పుస్తకాలుగాని అలాంటి సాంగత్యం అయి వుంటుంది.

(2) రెండవ కారణం మనం తినే ఆహారం. ఆహారం కూడా కామ వాసనలు రేకెత్తిస్తుంది. **ఏ ఆహారం తింటే ఇలాంటి తలంపులు వస్తున్నాయో నీవే** గమనించి **అలాంటి ఆహారం వర్జించు.**

**హృదయపూర్వకంగా ఈ sex బలహీనతనుండి బయటపడకుంటే ఈ బలహీనత మన సర్వస్వాన్నీ హరిస్తుంది.** ఇది మనలోని దొంగ అని చెప్పారు బాబా. ఈ దొంగ పెండ్లితో సమసిపోదు. మరొక విధంగా పనిచేస్తుంది. గనుక **వివేక, విచార, వైరాగ్యాలతో ధర్మమనే వెలుగులో దాన్ని హరింప చేయాలి. జాగ్రత్త! శ్రీ మాష్టారికి నీ బలహీనత చెప్పి దాన్ని తొలగించమని కన్నీటితో ప్రార్థించు. ఇంతకంటే మరొక మంచి మార్గం లేదని నా అభిప్రాయం.** మీ అమ్మ, నాన్న, చెల్లెలు గొలగమూడి వచ్చారు. కానీ రాత్రి 9 గంటలపైన వచ్చి ఉదయం 6 గంటలకు వెళ్లిపోయారు. వాళ్లతో మాట్లాడే అవకాశం రాలేదు. వాళ్లైనా ఏమి అడగలేదు. మరలా లెటర్ వ్రాయి. శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ

మీ పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

13-09-2002

Dear Sir,

నీ లెటర్ చేరింది. నీ బాధ అర్థమైంది. **మన ప్రయత్నం లేకుండా శ్రీ స్వామి వారు ఏమీ చేయలేరు. స్త్రీల వక్షోజాలు ఎంతో పవిత్రమైనవి. మనం చంటి పిల్లలుగా ఉన్నప్పుడు మన తల్లులు మనకు ప్రాణాధారమైన పాలు ఇచ్చి మనలను ఇంత వారిని చేసిన సాధనాలు. వాటిని కామదృష్ఠి తో చూడకూడదు. అవి చిన్నపిల్లలకు భగవంతుడు ఏర్పాటు చేసిన ప్రాణాధారమైన పాలిండ్లు.** ఒక్క బిడ్డ పుట్టకముందే కొందరికి జారిపోయి ఫ్లాట్ గా ఉంటాయి. అవి తోలు సంచులు. ఇప్పుడు shape జాకెట్లు వేసుకుని, ఆ సంచులలో కుక్కి వక్షోజాలు అందంగా ఉన్నట్లు చూపుతారు.

ఈ గ్రుడ్డి ప్రపంచం గుడ్డ సంచుల వలన అవి అలా కనబడుతున్నాయని ఎరుగక కంటితో చూస్తారు. చిన్నారి పాపలకు ప్రాణాధారమైనవాటిని మనం కంటితో చూడరాదు. మన తల్లి, మన అక్క చెల్లెండ్రు అందరూ బిడ్డలను సాకేందుకు అవి కలిగి ఉన్నారు. వాటిని కామ దృష్ఠితో చూడడం గొప్ప పాపం. అక్కడ ఏమీ లేదు. తోలు సంచులు తప్ప. ఎందరో ముసలమ్మలకు వ్రేలాడుతుండేవే కదా. వారికి సరైన దుస్తులు లేక అలా కనిపించేలాగా ఉన్నాయి. వీళ్ళకు మంచి గుడ్డలు ఉండబట్టి మన దృష్టి మరల్చేందుకు అందం పేరుతో shape జాకెట్లు తగిలిస్తున్నారు.

ఏది ఏమైనా ఆ స్త్రీల గుణగణాలు ముఖ్యంకానీ బాహ్యామైన అంగములు వాటి సౌందర్యము పట్టించుకోవడం అవివేకం.  పాపము కూడా.  అవి మనవారికి లేవా? ఇతరులు వారిని ఆ దృష్టితో చూస్తే మనకెలా ఉంటుందో ఆలోచించు.

మీ sister గారిని తన జీవితం దేవుని చేతిలోకి తీసుకొని నడిపించమని తీవ్రంగా పారాయణ చేయమను. నియమాలు పాటించమను. అంతేకాని పెండ్లి తొందరగా చేయమని అడగడం చాలా అవివేకం. ఇది నా personal అనుభవం, మరొక లెటర్లో వ్రాస్తాను. శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య

********* సద్గురు దేవా శరణం శరణం *********

గొలగమూడి

డియర్ సర్,

కాలాన్ని బట్టి ధర్మాలు మారుతాయి. ఆ రోజులలో బ్రహ్మచారి ధర్మాలు అలా ఉండేవి.  ఈ  రోజులలో అందరూ అలా నడచుకోవటం కుదరదు. గురువు చెంత వేదాధ్యయనం చేయడం, సమావర్త హోమం చేయడం ఈ రోజులలో అందరికీ సాధ్యం కాదు. కానీ ప్రతివారు ధర్మబద్ధంగా నడచుకోవడం  అనే ధర్మం ఆదరణపూర్వకంగా  ఆచరించినట్లయితే  వారి జీవితాలు ఎంతో ఆనందంగా ఉంటాయి.

**మన ఆలోచనలు, పనులు, మాటలు అనుక్షణం భగవంతుడు సాక్షీభూతుడుగా రికార్డు చేస్తున్నాడనే సత్యాన్ని సంపూర్ణంగా నమ్మి నడుచుకోవాలి**. ఆ అమ్మాయి విషయంలో నీవు తప్పుగా భావన చేసివుంటే ఆ

తప్పును క్షమించమని బాబాను ప్రార్ధించు. నీవు చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా వరుసగా రెండుపూటలు భోజనం చేయకుండా ప్రార్ధనలో ఉండు. ఆ కరుణామయుడు క్షమిస్తాడు. ఆమెకు నిజంగా వివాహమైనదని ఈ పాటికి తెలిసిపోయి ఉంటుంది కదా? **ఆనందమయమైన జీవితం కావాలని కోరుకోవడంతో సరిపోదు. మానసికంగానూ, క్రియారూపంలోనూ, వాచకరూపంలోనూ ధర్మ బద్ధంగా అనుక్షణం జీవించడం అలవాటు చేసుకోవాలి. ఆమె మన చెల్లెలే అయివుంటే మరొకరు నీలాగ ప్రవర్తిస్తే నీకెలా ఉంటుందో ఆలోచించు. గనుక మరలా అలాంటి పొరపాటు చేయనని బాబాకు చెప్పుకో. మరొకసారి పొరపాటు పడకుండా నడచుకో. ధర్మమే జగతికి మూలం. ధర్మమే భగవంతుడు.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

21-05-2002

డియర్ సర్,

నీ లెటర్ చేరింది. నీ జీవితం నీవనుకున్నట్లు చాలా తేలికగాను నీచంగాను లేదు. ప్రతి ఒక్కరికి తన తప్పు తెలుసుకోకుండా మూర్ఖంగా జీవించడమంటేనే చీకటి బ్రతుకు. **నీ తప్పు తెలుసుకున్నావంటే లైట్ వేశావని అర్ధం. ఇక ఇల్లు సర్దుకోవడమే కావలసింది.ఇల్లు సర్దుకోవడానికి గట్టి పట్టుదల కావాలి. ఇది రావాలంటే గురుస్మరణే అవసరము. గురుస్మరణమంటే అందరు మహనీయుల రూపాలలో వున్న విశ్వగురుని దివ్య లీలలు స్మరించడమే.** మన మనస్సు చాలా ఎక్కువ voltage గల యంత్రం వంటిది. దాన్ని నియంత్రణతో ఉపయోగించకుంటే చాలా నష్టపోతాము. ఒకసారి నష్టపడ్డాక ఇక తిరిగి ఆ నష్టాన్ని భర్తీ చేయలేము. గనుక నియమపాలన చాలా అవసరం.

**నియమపాలన కాదు, కఠోర నియమపాలన. అప్పుడే మనం సద్గురు కృప పొందగలము.** మీరు చెప్పిన పులి విస్తరాకులు ప్రపంచం నిండా ఎక్కడబడితే అక్కడే కావలసినన్ని ఉన్నాయి. అసలు అలాంటి వ్యక్తులతో స్నేహమే పనికిరాదు. మనలను చెడగొట్టిన స్నేహమే పనికి రాదు. మనలను బాగుపరచినా, చెడ గొట్టినా స్నేహితులే కారణం. గనుక ఈ సత్యాన్ని బాగా మననం చేసి పది రూపాయలు పోయినా మంచి స్నేహం చేయి. పది రూపాయలు పోయినా ఫరవాలేదు చెడు స్నేహం వదిలేసేయ్.

ప్రతినిత్యం సరైన టైం లో నిద్రపోవడం, సరైన టైములో నిద్రలేచి నిత్యకృత్యాలు తీర్చుకోవటం చాలా ముఖ్యము. స్నేహితులంతా చెడిపోయిన వానిని చూచి నవ్వుతారు. అంతేగాని ఏ సహాయము చేయలేరు. కానీ సద్గురువొక్కరే మనలను అన్ని వేళలా రక్షించి కాపాడతారు. నీకు సద్గురు కృప ఉంది గనుకనే U.S కు వెళ్లే యోగం పట్టింది. **మన నియమ పాలనలో ఏ లోపం వచ్చినా సద్గురుని కృప అంతమేరకు పోగొట్టుకుంటామని ఎందరి అనుభవాలో తెలుపుతున్నాయి.** ఈ విషయంలో నీవు చాలా జాగ్రత్తగా ఉండు. **ధర్మం ధర్మం ధర్మం ఇది మాత్రమే సద్గురుని మెప్పిస్తుంది. ధర్మం తప్పినాక మెయిన్ లైన్ తో electrical contact పోయిందన్నమాట. అది పోతే మనమెందుకూ పనికిరాము.**

భట్ గారి విషయం మనసులోకి రానివ్వడమే దోషం. వారు నీతో మాట్లాడతారని ఎందుకు ఊహిస్తున్నావు. **మాట్లాడితే కూడా ధర్మం ప్రకారం ఉండాలి. కానీ అనవసరమైన ఆపేక్షలు పెంచుకోవడం అధర్మం.** ఈ వివాహానికి పెద్దల అనుమతిగాని సద్గురుని ఆదేశం కానీ లేవు గనుక బాగా దూరం వుండు. సద్గురుడు ఆదేశిస్తే ఆయననే జరిపించమని చెప్పి నిర్భయంగా ఉండు. నీవు

**వారితో నోరు జారి ఎక్కువగా మాట్లాడవద్దు. Control your spirits. ఇది ముఖ్యం. శ్రీ స్వామి వారికి నీ బాధలు విన్నవించుకో. నీ లెటర్ శ్రీ స్వామి వారి సమాధి మీద ఉంచాను. అన్నీ వారే చూచుకుంటారు. Be brave and devoted to sadguru.**

Yours lovingly,

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

# నిష్కామ కర్మ-కర్మ సుకౌశలం

మా ఆటపాటలతో నిన్ను మెప్పించ వలనే కానీ మోక్షమని నిన్ను అడగతగునా? అన్న రీతి జీవించుటకు మనకు భావ శుద్ధి ఎంత అవసరమో అది సాధించే మార్గం ఈ క్రింది శ్రీ సార్ లెటర్ లలో చూడవచ్చు. భావశుద్ధితో (మాత్రమే) కర్మసుకౌశలం సాధ్యమని శ్రీ సార్ లెటర్ చివరి వాక్యం సూచిస్తుందని గుర్తించాలి.

**"శ్రమ చేస్తేనే కానీ సేవ కాదన్నమాట. గనుక నేను శ్రమించటం -నా ధ్యేయంగా పుస్తకాలు వ్రాయటం, విక్రయం, సత్సంగం చేయాలి. అలా చేస్తేనే కైవల్యం పొందుటకు అర్హులమై ఉంటాము. శ్రమ చేయించేది ఆయనే అయినా శ్రమ చేసే readiness మన దగ్గర వుండాలి. సోమరితనం మన ప్రధమ శత్రువు అంటారు మాస్టర్ గారు. అది దరి చేరకుండా మన శరీరాన్ని కంట్రోల్లో పెట్టుకోవాలి".**

గొలగమూడి

27-7-05

డియర్ సాయి!

మొన్న నా స్వప్న సందేశం గుర్తుందా? బోరు విషయం, బావి లోతు చేయడమా అని **దీక్ష చేయాలన్న రాత్రి - 10 అడుగుల శ్రీమహావిష్ణువు మౌల్డింగు – ఆమౌల్డింగ్ కు గల పూలహారంలో V పూలమాల ఒక వైపు శ్రమతో సేవ, రెండవ వైపు సేవతో కైవల్యం** అని **స్పష్టంగా కనిపించింది.** డొనేషన్స్  పుస్తకములో వెనుక ఆ వృత్తాంతమంతా వ్రాశాను. శ్రమ చేస్తేనే సేవ కాదన్నమాట. గనుక శ్రమించడం మనధ్యేయం గా నీ చదువు చదవాలి, నేను పుస్తకాలు విక్రయము, సత్సంగము, విజిటర్స్ విషయాలలో శ్రమ చేయాలి. **అలా చేస్తేనే మనం కైవల్యం పొందుటకు అర్హులమై ఉంటాము. శ్రమ చేయించేది ఆయనే అయినా శ్రమ చేసే readyness మన దగ్గర ఉండాలి.** సోమరితనం మానవుని ప్రథమశత్రువు అంటారు మాస్టారు. అది దరి చేరకుండా మన శరీరాన్ని కంట్రోల్లో పెట్టుకోవాలి. **వ్యాయామం, ఫుడ్డు చాలా చక్కగా యుక్త ఆహార వ్యవహారాలు ఉండాలి.**

పె. సు.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

27-12-2002

Dear Siva,

నీ లెటర్ అందినది. నిష్కామ కర్మకు ఒక లిస్టు పనులంటు లేవు. **మన పర్సనల్ గా ఉపయోగ పడే పనులు కాక ఇతర పనులని అర్థం.** ఉద్యోగం చేస్తున్నాము. జీతం తీసుకుని పొట్టకు సంపాదించు కొంటున్నాము. కుటుంబ పోషణ మన భాద్యత కనక దానికి ఖర్చు పెడుతున్నాము.  ఆ ఉద్యోగం నిష్కామ కర్మ కాదు. తనకు వచ్చిన ధనంలో కొంత ధర్మ కార్యాలకు ఖర్చు చేశాడు. అది నిష్కామ ఖర్మ అవుతుంది. **ఇందులో మాష్టారు చెప్పేది బాగా అర్థం చేసుకోవాలి. పని ఏమైనా మనసు చలించరాదు. సఫలమైనప్పుడు సంతోషము, విఫలమైతే దుఃఖము బాధ వగైరా ఉండరాదు. భగవంతుడు అలా చేస్తే  మనమేం చేస్తాము. అలా మనసు**

**చలించకుండా ఉండటమే నిష్కామకర్మ ధ్యేయం. అందుకే మనలోని మలదోషం పోవటానికి నిష్కామకర్మ చెప్పారు. మల దోషమంటే రాగ, ద్వేష, అసూయాదులు.**

పె. సుబ్బరామయ్య.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

డియర్ సాయిశివ,

శ్రీ అనంతాచార్యులుగారు ఎట్లా నిష్కామకర్మ చేశారో నేను చూడలేదు. కానీ ఒక్క విషయం సత్యం. వారు తన పేషెంట్లను ఇంత ఇస్తేనే వైద్యం చేస్తానని నేటి వైద్యులులాగ చెప్పేవారు కాదు. హుండీ పెడుతారు. వారివారికి భగవంతుడు బుద్ధి పుట్టించినది వేసిపోతారు. ఒక్క రూపాయి మందు తీసుకున్న వారు వంద రూపాయలు వేయవచ్చు, వంద రూపాయలు ఖరీదు గల మందు తీసుకున్నవారు ఒక్కరూపాయి వేయవచ్చు. **అసలు తనను తన పిల్లలను పోషించే దాత ఆ భగవంతుడు, గనుక ఆ భగవంతుడు తన చేత చేయించుకున్న వైద్యాన్ని క్షుణ్ణంగా చేయడమే తన కర్తవ్యంగా భావించి చేసారు.** ఆ రోజులలో సవరు బంగారు 50 రూ. అలాంటి సమయంలో రోజుకు ౩౦౦రూ హుండీలో వచ్చాయంటే 6 సవర్ల బంగారం. అది ఈనాటి ధరను బట్టి 18,౦౦౦ రూపాయలన్నమాట రోజు రాబడి.

ఇదంతా దాచుకోలేదు. సాయి వలె ఖర్చు చేసేవారు. తేనె, నెయ్యి, పాలు, పండ్లు, ఎండు ద్రాక్ష లాంటివి ఇంటి నిండా వచ్చేవట. అన్నీ పంచేసేవారట. తనకు, తన బిడ్డలకని దాచుకోకుండా అన్ని విషయాలకు భగవంతుని మీద ఆధారపడి జీవించారు అని మాష్టారు చెపితే మాకు తెలిసింది. ఈ విషయాన్ని శ్రీ కృష్ణమాచార్యుల శిష్యులు వ్రాసిన ఒక గ్రంథంలో చదివాను. అలా నిష్కామ కర్మను త్రికరణ శుద్ధిగా ఆచరించబట్టే శ్రీ సాయినాధుడు వారికి 15 రోజులు పాటు భౌతిక దర్శనం ప్రసాదించారు.

**"వాళ్ళుండే దాన్ని బట్టి గదయ్యా మనముండేది" అక్షరాల పరమ సత్యం. ప్రతి ఒక్కరికి అన్ని కాలలయందూ వర్తిస్తుంది. మనం ఫ్రెండ్స్ అనే భావంతో మనలను బురదలోకి దింపేవారితో స్నేహం చేయడం చాలా అవివేకము. మంచి సహవాస మయితే పది రూపాయలిచ్చి కొనుక్కో. చెడు సహవాసమయితే పది రూపాయలిచ్చి వదిలించుకోమని ఊరక చెప్పారా.** విమర్శలు తగవని సాయి చెప్పినా మనం లెక్క చేయకుండా వింటుంటే ఆ మలినం మనకు చుట్టుకొకుండా పోతుందా? కనుక చాలా జాగ్రత్తగా ఉండాలి. అసలు లోకం ఎట్లా పోతే మనకేమి. మనం లోకాన్ని ఉద్ధరించగలమా? **మన కర్తవ్యం మనం చేసుకుపోతే చాలు**. వాదాలు, వంతులకు దూరంగా ఉండడం నేర్చుకోవాలి. ఒకటి రెండు మాటలే చెప్పాలి కానీ మన వాదాలు వంతులతో ఏమీ తెల్లవారదు.

**"మైసూరు మహారాజు కనిపిస్తే ................." నిజమే కదా! వారు పరమ దయామయులే. ఆ దయను మనం అందుకొని నిలుపుకునే స్థితిలో ఉండవద్దా.** కరెంటు ఉంది, దాని నుండి వెలుగు పొందాలంటే వైరింగు, స్విచ్, బల్బు అన్నీ సరిగా ఉండవద్దా, అంతే. సాయి దయామయుడే – అందరినీ ఉపాసనీ బాబా లాగా తీసుకు వచ్చి ఎనిమిది రోజులు నడిచినా ఎనిమిది కిలోమీటర్లు నడవలేనట్లు చేసారా! **ఆధ్యాత్మికత అనేది ఇరుపక్షముల పొందికతో రావలసిందే కానీ, ఏక పక్షం కాదు. మనకు పుణ్యం సున్న అయినప్పుడు వారెంత ఇచ్చినా నిలుపుకోలేము...... మాంసం పొందిన బ్రాహ్మణుడు దాన్ని నీటిలో పారేసినట్లు. మహాత్ముల దర్శనానికి పోయిన వారందరికీ ఒకే ఫలితమొస్తుందా? కొందరికి ఆ మహనీయుని చూడగానే సంతత ధారగా కన్నీరు కట్టలు తెంచుకుంటాయి. కొందరికి రోమాంచితము, కొందరికి ఇంకా కాస్త స్వీటు పెట్టకుండా ఉంచుకున్నారే అని, మరికొందరు ఈ సిగరెట్టు త్రాగే స్వామి దగ్గరకా మనం రావడం అని అనిపించడం లేదా?** కరెంటు అక్కడ ఉంటే

దానిని తీసుకునే శక్తి, ప్రకాశించే శక్తి బల్బుకు ఉండాలి. ఒకటి 80 volts మరొకటి 120 volts కనుకనే భగవద్గీత అంతా మన ప్రయత్నానికే ప్రాధాన్యం ఇచ్చింది. అలాగే యోగవాశిష్టం. **భగవంతుడు మనకు చదువుకునే ప్రాప్తమిచ్చి చదువుకోమంటే భగవంతుడు ఇచ్చిన ఆ పని మాని నిరంతరం భజన చేస్తానంటే ఆయన ఏమి చేస్తాడు. ఆయన సంకల్పాన్ని నెరవేర్చాలి. అది మన ముఖ్య కర్తవ్యం. అది పోతే అన్నీ పోయినట్లే. మహనీయులు మన అర్హతతో సంబంధం లేకుండానే అనుగ్రహిస్తారు. కానీ మనం మన అర్హత ఉన్నవరకే దానిని దక్కించుకుంటాము.**

"ఇంద్రియాణాంహి చరతాం యన్మనోను విధీయతే

తదస్య హరిత ప్రజ్ఞాం వాయుర్నావ మివాంబసీ"

గాలిచేత పడవ యొక్క వేగం తగ్గిపోయినట్లు ఇంద్రియములలో చలించు మనసు యొక్క ప్రజ్ఞ హరించబడును అన్నారు.

**ఆకలికి అన్నం కాని చిరుతిండి కాదు. చిరుతిండి జిహ్వాచాపల్యం వలన తింటాము. అది ఎంతమేరకు పోతే అంత లక్ష్యశుద్ధి కుదురుతుంది. మనలో జరిగే ప్రతీ భావస్పందనకూ కొంత శక్తి ఖర్చవుతుంది. చిరు తిండ్ల వారికి శక్తంతా దానికే ఖర్చవుతుంది. ఇక లక్ష్యం కొరకు చేసేదేముంది. నిజంగా లక్ష్యశుద్ధి గలవారికి చిరుతిండ్ల విషయం గుర్తేరాదు.**

మానవులకు (1) బ్రహ్మచర్యాశ్రమము (2) గృహస్థాశ్రమము (3) సన్యాసాశ్రమము (4) వానప్రస్థాశ్రమము (5) ఆశ్రమ ధర్మాలు లేని అతి ఆశ్రయము అని ఉన్నాయి.

**భగవంతుడు మనలను ఏ ఆశ్రమంలో ఉంచితే ఆ ఆశ్రమ ధర్మాలు పాటించాలి.**

బ్రహ్మచారులు – ఆంజనేయస్వామి వారిని ఆదర్శంగా తీసుకుని అష్టవిధ బ్రహ్మచర్యం వహించాలి. అంతే గాని గృహస్థు ధర్మాలు, వానప్రస్థ ధర్మాలు

పాటించరాదు. **భగవంతుడు మన నుండి కోరిన విద్యా ప్రావీణ్యం గడించి భగవంతుని ఆ విద్యతో ఆరాధించాలి. అనంతాచార్యుల వలె అందరిలోని పరమాత్మను వారి వలె ఆరాధించాలంటే ముందు విద్యా ప్రావీణ్యం సంపాదించాలి. అన్యచింతలు లేకుండా విద్యాధ్యాసలో ఉంటే అన్నీ అవే వస్తాయి.** గృహస్థు గృహస్థుగా ఉండాలి.

భగవంతుడు నిర్దేశించిన పని ఆయనకు తృప్తికరంగా నిర్వహించాలి. పారాయణ, పూజలు చేస్తే మనం ముందుకు పోతామని కఠినంగా శరీరాన్ని కష్టపెట్టరాదు (ఆంధ్ర యోగులు అను గ్రంథంలో మాణిక్య ప్రభు శిష్యురాలు దిగంబర యోగిని చెపుతారు).

దీన్ని మాష్టరు గారు ఆచరించి చూపారు. తాను టిఫిన్ తినకుంటే అమ్మగారు తినరని నిత్యం ఇడ్లీ తినేవారు. మాష్టరు గారి ఉచ్ఛిష్టం అని అమ్మగారు నిత్యం రెండు ఇడ్లీలు స్వీకరించేవారు. అంతేకానీ సాయిని మెప్పించాలని నిరాహారి కాలేదు. మనం కఠిన నియమాలు పెట్టుకొని శరీరం శుష్కింప చేసుకుంటే సాయి మెచ్చుకుంటారా? అతిగా తినవద్దన్నారు కాని నిరాహారులు కమ్మనలేదు. గృహస్థుగా తన విధి నిర్వహించాలి. అదీ సాయి మెచ్చుకునేటంతగా చేయాలి. గృహస్థు - సన్యాసి ధర్మాలు పాటిస్తానంటే సరిపోతుందా? ఇంట్లో అందరినీ భగవంతుని రూపాలుగా చూస్తాను, సేవిస్తాను అని నిత్యం ప్రమాణం చేయడమే "త్వమేవ మాతాచ పితాత్వమే...." అన్న ఆరతి పాటలోని అర్థం. అలా చేయాలి, సేవించాలి గాని పాట మాత్రం పాడి గృహనిర్వహణలో లోపం చేస్తానంటే సాయి ఏనాడైనా ప్రశ్నించరా? ఎదురుగా వచ్చి ప్రశ్నించకున్నా గాని ఆ లెక్క అలాగే ఉంటుంది బాకీ పడి.

**నీవు చక్కగా చదువుకుని తల్లిదండ్రులను సుఖపెట్టాలి. తల్లిదండ్రుల రూపాలలో సాయి ఉన్నారని నిరంతరం గుర్తు పెట్టుకోవాలి. నిత్యం పూజ, పారాయణ వీలైనంత వరకు చెయ్యి. నీవు చక్కగా చదవడం సాయికి చేసే పూజ అవుతుంది.**

**అదే నిజమైన పూజ. అలా ఆర్జించిన విద్య ద్వారా అనంతాచార్యులు చేసినట్లు నిష్కామకర్మ చెయ్యి. ప్రతి విషయం మాష్టారు చక్కగా బోధిస్తారు. ఆయన వాణి విని చూడు.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ

మీ

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

గొలగమూడి

5-10-05

పూజ్య గురు బంధువులైన శ్రీమతి లక్ష్మక్క గారికి, చిరంజీవి సాయికి శ్రీ స్వామి వారి కృప సదా ఉండాలని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

మనకు శ్రీ స్వామి వారిచ్చిన గొప్ప భాగ్యాన్ని గుర్తించకపోవడమే మన మానసిక బాధకు కారణం. ఆ పరమ ప్రేమమయుడు నిరంతరం మన వెంట నుండి ఎంత చక్కగా పుటం పెట్టి శుద్ధి చేస్తున్నారో అందుకు వారు ఎంత శ్రమ చెందాలో మనం హృదయపూర్వకంగా గుర్తించకపోవడమే మన అజ్ఞానం.

**పరోపకారం పుణ్యం-పరపీడనం పాపం.** సాయి **చదువు గొప్ప పుణ్యకార్యము-**అందులో నిష్ణాతులైతే ఎంత మేలొనగూడుతుందో చెప్పలేము. ఇప్పుడు ల్యాప్టాప్ అని ఒక పరికరం వచ్చింది. నేను ఎప్పుడూ దాని పనితనం చూడలేదు. అది ఒక అంగుళం మందం, 12 అంగుళాలు పొడవు, ఎనిమిది అంగుళాలు వెడల్పు ఉంటుంది. ఒక పుస్తకం లాగా ఉంటుంది. దానిమీద ఇక్కడ మనం ఒక లెటరు టైపు చేస్తే అమెరికాలో ఉండే అలాంటి పరికరంపై ప్రింటింగ్ అవుతుంది. పోస్టులో లెటర్ పోయి రావాలంటే (అమెరికాకు) కనీసం 20 రోజులైనా పడుతుంది. ఇది ఒక గంటలో అమెరికా నుండి రిప్లై

తెప్పిస్తుంది. ఇది పరోపకారము కాదా? బొచ్చెలో పది పైసలు వేస్తేనా పరోపకారం. కనుక సాయి చేసే పనే పరోపకారమైన పని.

**దేవ ద్విజ గురు పూజనం, శౌచమార్జవం అన్నారు. పుణ్యకార్యాలలో పూజ మాత్రమే కాదు సత్సంగం కూడా పుణ్యమే.** మనం మన కోసమే సత్సంగం చేస్తున్నా దాని ఫలితం గ్రామమే కాదు ఎంత దూరం అంటే అంత దూరం పోతుంది. సాయి కృప అని కలిచేడు మందిర సావనీరు అది. అంతేగాని నాకు ఆరోగ్యం సరిగా లేదు, దుఃఖంగా ఉందని మనసు పాడు చేసుకోకూడదు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పె. సు

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

# ఉత్తమ జీవన విధానానికి సూత్రాలు

ఓం

గొలగమూడి

1-11-2003

Dear Krishna !

చెడు మార్గములో పోకుండా ఉండాలంటే మన మనసుకు తెరిపి లేకుండా పని పెట్టడ మొక్కటే మార్గం. మహనీయుల చరిత్రలు చదువుతుంటే వారి ఆశీస్సులు ఉంటాయి, ఇటు మనసుకు పని పెట్టినట్లు ఉంటుంది. నిద్ర లేవగానే కనీసం 15 నిమిషాలు సేపు నీ కిష్టమైన నామం చెయ్యి. స్నానం వగైరా అక్కార లేదు. స్నానం చేశాక తప్పక 10 నిమిషాలు కడ్డీ వెలిగించి హృదయపూర్వకంగా "నన్ను నీ శుభ్ర మార్గాన నడిపించు తండ్రి" అని ప్రార్థించు. వీలున్నపుడు అష్టోత్తరం కంఠత చదివి పూజ చెయ్యి. నాలుగు సార్లు పుస్తకం చదివి పూజ చేస్తుంటే అదే

వస్తుంది. చెడ్డ తలంపుల వల్ల మన కెంత నష్టమో మనకు తెలియదు. అనుభవాని కొచ్చినపుడు నిదానంగా తెలుస్తుంది.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

గొలగమూడి

05-03-2004

చిరంజీవి సంపత్ కు శ్రీ స్వామి వారి కృప సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం.

1. పనిలేని మనస్సే సర్వ అనర్ధాలకు మూలం - కాలం గడిచేందుకు ఏదో చీప్ లిటరేచర్ చదవడం. ఏ పైన ఆటలు ఆడడం - ఏదో ఆలోచించడం ఇవన్నీ పనిలేని మనస్సు చేసే పనులు.

ఏది నిజం బాగా వప్ప చెప్పేటట్లు చదువు - దేవుడంటే ఏమిటి - ఎలా ఉన్నాడు - బాగా వంట బట్టి నరనరాల్లో జీర్ణించుకోవాలి. ఆ తరువాత మతం ఎందుకు అలాగే చదువు. శ్రీ సాయి చరిత్ర గాని, శ్రీ స్వామి చరిత్ర గాని, పాత పద్దతిలో గాకుండా క్రొత్త దృష్టితో చదవడం నేర్చుకోవాలి. ప్రతీ లీలలను కూడా అష్టోతరంలోని ఏదో ఒక నామానికి ఉదాహరణగా చెప్పుకోవాలి. ఒక నోట్సులో ప్రతి నామానికి 2 పేజీలు వదులు. ముందే ప్రతి రెండు పేజీల కోక నామం వ్రాసి పెట్టు. తరువాత చరిత్ర చదువుతూ ఆ లీల ఏ నామనికి ఉదాహరణో అ నామం క్రింద లీలను ఒక్క వాక్యంలో వ్రాసేది. ఉదా : మైనతాయి ప్రసవ వేదన, అంటే అ లీల ద్వారా బాబా గారి ఆ నామంలోని అర్ధం ప్రకట మవుతుంది. ఇలా వ్రాసుకోవడం ద్వారా మనసులో బాబాగారి గొప్పతనం బాగా imprint అవుతుంది. అంత సేపు మనసు వారికి సమర్పించినట్లు అవుతుంది. అంటే వారు కోరిన

మనస్సు కాలము వారికి సమర్పించామన్నమాట. మరోక పద్ధతి : ఏ మహనీయుని జీవిత చరిత్రలోనైనా శ్రీ మాష్టరుగారి కామెంట్సు అక్కడక్కడా ఉంటాయి. అవన్నీ చదివేటప్పుడు  అండర్ లైను చేసి తరువాత నోట్సులో వ్రాసి పెట్టుకొనేది.

ఎంత  ప్రళయ మొచ్చినా పగలు నిద్ర పోకుండా వుండడం. నిద్ర తూగినప్పుడు ప్రదక్షిణలు రూములోనే చేయడం - నిత్యం పూజ చేయడం - పూజలో మొదట గురుస్తుతి చేయడం. నీకు అ  మహనీయుడు చేసిన మేలు హృదయపూర్వకంగా స్మరించడం. నా కేమి చేయలేదని నీవు చెప్పవద్దు - అసలు నిన్నీ పొజిషన్‌లో ఉంచినందుకు వారికి నీవు నిత్యం కృతజ్ఞతలు చెప్పుకోవడం. అన్నింటికంటే ముఖ్యం ఆరోగ్యం - అది సంపుర్ణంగా ప్రసాదించారు. ఎంతో గొప్పగా అర్ధిక స్తోమత ఇచ్చారు. B.E వరకు చదువు ఇచ్చారు. నీకు ఏమి ఇవ్వలేదు. ఇవన్నీ భగవంతుడు మనకు ప్రసాదించినవే. దానికి మనం వారికి నిత్యం కృతజ్ఞత తెలుపడమే స్తుతి. అలా వారికి కృతజ్ఞత తెలుప కుంటే మనం చేసిన మేలు మరచిపోయిన వారమవుతాము.

2. Luck మంచిగా వుండాలని అడగవచ్చు. కానీ మనం అడుగగానే ఇస్తాడా? మనకేది మంచిదో మనకంటే అయనకే బాగా తెలుసు. కనుక నన్ను నీ ఇష్టమొచ్చినట్లు మలుపు. నీ ప్రేమకు అర్హుడనయ్యే బుద్ధి ఇవ్వు తండ్రీ అని ప్రార్ధించు.

3. స్నాన పానాలతో అవసరం లేదు. కానీ తూగుగా, బద్ధకంగా ఉండకూడదు. పడుకొని చదవకూడదు. నీ వయసులో పడుకొని చదవడం అసలు పనికి రాదు. అర్ధమయినట్లే  ఉంటుంది. అసలు హృదయగతం కాదు. మన హృదయం తగిన స్థాయిలో స్పందించదు.

4. గురుస్తుతి నోటినుండి వస్తుంది. హృదయం నుండి రాలేదు అంటే ఆహారం బాగా తగ్గించాలి. "బ్రతి కేందుకే తినాలి. తినేందుకు బ్రతకకూడదు".

5. నాంపల్లి బాబా దగ్గరకు వెళ్ళి 10 నిమిషాలో రావడం బాగాలేదు. అక్కడ ప్రదక్షిణ చేసుకునే వీలుంటే నిత్యం 108 ప్రదక్షిణలు చెయ్యి. వారికి వీలు లేకుంటే వారి దగ్గర వారి పటం పెట్టయినా కాస్త ప్రక్కన ప్రదక్షిణలు చేస్తుండు.

అక్కను అడిగినట్లు చెప్పేది.

శ్రీ స్వామి వారి కృప సదా మీకుండాలని ప్రార్థిస్తూ

మీ    పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

గొలగమూడి

07-09-2003

Dear Sampath Kumar !

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పెసల సుబ్బరామయ్య వ్రాయడం. అక్కయ్య క్షేమమా? ఆమె విషయమే నీ లెటరులో లేదు.

1. కోరికలు ఎందుకు లేకుండా పోవాలి? కోరికలు పందికొక్కులకు ఉండవు. మానవులకు ఉండవచ్చు అని చెపుతూ అయితే మంచి కోరికలు ఉండాలి. చెడు కోరికలు ఉండకూడదు అన్నారు మాష్టారు గారు. గనుక సత్ సంగం కావాలి, మహనీయుల ఆశీస్సులు పొందే నడవడి తెచ్చుకోవాలి. అలాంటి పుస్తకాలు చదవాలి, అలాంటి వారితో స్నేహం చెయ్యాలి. ఇతరులను వదిలించుకోవాలి.ఇలాంటి కోరికలు ఉండవచ్చు. నీకు ఎలాంటి కోరికలు వస్తున్నాయో వ్రాస్తే దానికి జవాబు వ్రాయవచ్చు.

2. మన ధర్మము - కర్తవ్యము - చాలా మంచి సలహాలతో కూడిన పుస్తకం. భగవంతుడు ఎలా ఉంచాడో అలా ఉండగలగడంలో తృప్తిపడాలి అన్నారు బాబా. నీవు ప్రతి రోజూ కొంత అన్నానికి, టిఫిన్ కూ, చిరుతిండ్ల కూ కర్చు చేస్తావు గదా. అందులో కొంత ఆదా చేసి అర్హులైన కుంటి, గ్రుడ్డి రోగులైన పేదవారికి కర్చు పెట్టు. డబ్బుగా ఇవ్వవద్దు. గుడ్డలో, మందులో, ఆహారమో తీసి ఇవ్వు. నిత్యం అన్నం, టిఫిన్, కొంత

కాకబలికి సమర్పిస్తుండు, సాటి జీవులకు సహాయం చేసినట్లు, కదా. బస్సులో పోతున్నావు. నీ ముందు గానీ, దగ్గరలో గానీ, ముసలి, ముతక, రోగులు నిలుచుని ఉంటే నీవు నిలుచొని వాళ్ళను నీ సీట్లో కూర్చో పెట్టు. ఒక్కొక్కసారి గర్భిణీ స్త్రీలు, పసిబిడ్డల నెత్తుకున్న వాళ్ళు తంటాలు పడుతూ బస్సులో గాని రైలులో గాని వస్తూ ఉంటారు. వారికి ని సీటిచ్చి కూర్చోబెట్టు.

ఒక్కొక్కసారి అన్యాయంగా దారుణంగా ఒకరు మరిఒకర్ని కొట్టడం తిట్టడం మన ముందే జరుగుతుంది. సౌమ్యంగానే ధర్మం వైపు మాట్లాడు. మన కెందుకులే ఈ గొడవ అనేది నేటి యువకుల fashion. నన్ను నీ సుబ్రమార్గంలో నడిపించు తండ్రీ అని భగవంతుని నిత్యం హృదయపూర్వకంగా ప్రార్థిస్తుంటే ఆయనే మనను నడుపుతాడు. అసలు ఇలాంటి ప్రవర్తన కలగాలంటే అలాంటి ప్రవర్తన గల స్నేహితులు ఉండాలి. కోతుల స్నేహం వదులుకోవాలి. అది చాలా కష్టం. అయినా ఆచరించాలి.

3. అమ్మాయిలను చూచి comment చేయడమునకు ఒకే ముందు. ఆ కనిపించిన అమ్మాయిలు మన sister అయితే అలా చేయగలమా? ఎవరన్నా మన sisters ను అలా comment చేస్తే మనం వాళ్ళ ను వదులుతామా? అని తీవ్ర స్థాయిలో యోచించు. ఆచరణ అదే వస్తుంది. ధర్మం అంటే అదే. దర్మం తప్పినాక బాబా గారికి గానీ, శ్రీ స్వామి వారికి గానీ, శ్రీ మాష్టారు గారికి గానీ నమస్కరించే అర్హత కోల్పోయాను కదా! ఇక జీవితంలో వారి రక్షణ, అండ మనకు కల్గే ప్రశక్తే లేదు. గనుక ధర్మం తప్పకుండా ఉండాలి. చేసిన తప్పులకు ప్రాయశ్చిత్తాలు చేసుకోవాలి. హృదయం విప్పి చెప్పుకుంటే క్షమిస్తారు.

పటాలు ముందు ఉండనక్కరలేదు. అనుక్షణం వారు మన హృదయాలలో ఉండి మన చేతలే కాదు, మన భావాలు కూడా చక్కగా తెలుసుకుంటారు. ఇది చక్కగా తెలిస్తే చిక్కే లేదు.

శ్రీ స్వామి కృప నీ కెప్పుడూ ఉండాలని ప్రార్థిస్తూ

మీ పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

గొలగమూడి

02-11-2002

Dear Nayak Garu !

పరీక్షకు బాగా తయారు కావలసింది. కష్టపడిన వారికే దైవం సహాయం చేస్తారు. పూజ యాంత్రికము, లాంచనప్రాయమైనది కాకుండా సజీవమైనదిగా చేయండి. అలా చేయాలంటే ప్రతి నామానికీ సంబందించిన లీలలు మనసులో మననం చేయాలి. ప్రతి నామము ఎన్నో సార్లు నిదానంగా చెప్పాలి. శ్రీ సాయి మాష్టర్ స్మృతులు అనే పుస్తకములో శ్రీ శ్రీ శ్యాంప్రసాద్ గారి వ్యాసములో శ్రీ మాష్టారు పూజ ఎలా చేసేవారో వివరించారు. చదవండి.

సాయి పటంలో మీరు ఆమెకు కంపించారని చెపితే మీరు చలించిపోయి ఆనందబాష్పాలు ఎందుకు కురవాలో నాకు తెలియదు. అదంతా సాయిలీల అని మనం నిర్లిప్తంగా ఉండాలనేదే నాకు తెలుసు. మందిరంలో ఇంకేమి చేయాలి ?- అని అడిగారు. కాకబలికి సమర్పించే ప్రతి దపా మనం ఏమని భావన చేసి ప్రార్ధన చేసి సమర్పించాలో ప్రింటు చేసి ప్రతి ఇంటికి పంచు. భక్తి అంటే ఏమిటి - భక్తి యోగం భగవద్గీత చదివి చెప్పు. పుణ్యం అంటే ఏమిటి పాపం అంటే - పుణ్యం ఉంటే సాయి మనలను ఎలా తన దగ్గరకు చేర్చుకుంటారో చెప్పు.

నమస్కారములతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

డియర్ రాజ్ కుమార్ !

**సాయికృప పొందాలంటే**

1. మన అలవాట్లన్నీ మార్చుకోవాలి.
2. ఎవరితో (అనవసరంగా) మాట్లాడకూడదు. మాట్లాడితే సాయిని గురించి మహనీయుల గురించి మాట్లాడాలి.
3. **మన అలవాట్లన్నీ క్రమబద్ధం చేసుకోవాలి.**
4. **ఎప్పుడంటే అప్పుడు, ఎక్కడంటే అక్కడ ఎవరు పెడితే వారి దగ్గర తినడం మానాలి.**
5. సినిమాలు బొత్తిగా మానాలి. సినిమాలు మానమంటే కొందరికి అదొక పిచ్చి ధోరణిగా ఉంటుంది. మరి సాయి కృప ఎలా వస్తుంది? సాయికృప ఉండే వారంతా సినిమాలు చూడడం లేదా అంటావు. వాళ్ళు రూపాయి పొందవలసిన చోట ఒక పైసా పొందుతున్నారు.
6. **నిత్యం పూజ, పారాయణ రోజు ఒకే సమయంలో చేయాలి.** వీలున్నప్పుడు చేస్తానంటే సాయి కూడా వీలున్నప్పుడు మనవైపు చూస్తాడు.
7. రోజుకు 24 గంటలు. అందులో ఒక అరగంట సాయికి సమర్పించకుండా ఆయనను ఇది చెయ్యి, అది చెయ్యి అని అడగడం ఎలా వీలౌతుంది. మనం ఏమారిన క్షణంలో కూడా ఆయన మనలను రక్షించాలి. మనం మాత్రం వీలున్నప్పుడు ఆయన వైపు చూడాలి. ఇది మంచిది కాదు. పారాయణ,

మననం చాలా ముఖ్యం. ఈ మననం ద్వారా మనలోని రాగ, ద్వేషాలు పలుచబడతాయి. ఇలా ఏదో ఒకటి చేస్తుంటే కొంత కొంత అభివృద్ధి ఉంటుంది.

పెసల సుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

ఓమ్

Dear *Rajakumar*!

నిద్ర మత్తు విషయంలో నాకు తెలిసినంతవరకు -

1. ఆయా విషయాల మీద కావలసినంత ఆసక్తి లేకపోవడం.

2. **మాటలలోను, ఆశించడంలోను ఆసక్తి చూపడం మాని, కార్యరూపంగా కృషి చేయాలి. ఎవరి నిద్ర మత్తుకు వారే విరుగుడు కనుక్కోవాలి.**

**శ్రీ సాయి కంటే నడుపగల ధీరుడెవరు**?

3. **ఆహార నియమం, వ్యాయామము అత్యవసరమని నా నమ్మిక.**

ఈ నిద్ర నన్ను మొదట నుంచి నీలాగే బాధించింది. మాష్టరుగారితో చెప్పుకొంటే ఆ సద్గురుమూర్తి, పై రెండూ కావాలంటూ చిన్న వ్యాయమాలు నేర్పించారు.

(1) సూర్యనమస్కారాలు, (2) కొన్ని ఆసనాలు.

సూర్యనమస్కారాలంటే ముసలి వాళ్ళు చేసే నమస్కారము కాదు.

ఓం హ్రీం, హ్రీం, హ్రూం, హ్రౌం, హ్రః అంటూ కొన్ని భంగిమలు (poses) ఉన్నవి. అది చేస్తే నిద్రమత్తు దేశం మీద పోతుంది. సూర్య నమస్కారాలు నేర్పించే గురువు మీకు దొరకకుంటే సాయిని ప్రార్థించండి (హృదయపూర్వకంగా). వారు సర్వం ఒనగూర్చగలరు.

ప్రకృతి ప్రకాశన్, ప్రకృతివైద్యశాల, బేగంపేట, హైదరాబాద్

వారికి వ్రాస్తే, సూర్యనమస్కారములు, భోజులు తెలిపే బొమ్మల చార్టు కానీ, పుస్తకంగానీ పంపుతారు. దాని ద్వారా అభ్యసింప చేస్తుంటే మంచిది.

**ప్రతి దానికి హృదయ పూర్వకమైన ప్రార్థనే సాఫల్యమివ్వగలదు. శ్రీసాయినాధుడు సర్వము ఒనగూర్చగలరు.**

నమస్తే

పె. సుబ్బరామయ్య.

పట్టుదల, విశ్వాసము, ఓర్పు ఒకేసారి రావు. **నిత్యం నిద్రకుపక్రమించే ముందు విధిగా ఆనాడు మనం చేసిన కార్యక్రమ మందలి తప్పు, ఒప్పులను సమీక్షించు కోవాలి. ఒక 5 నిముషాలు మనసులో విధిగా గుర్తు తెచ్చుకుని మనం తప్పు చేసిన చోట హృదయపూర్వకంగా తీవ్రంగా సాయినాధునికి క్షమాపణ చెప్పుకుంటూ తిరిగి అలాంటి పొరపాటు జరగకుండా జాగ్రత్త పడే ప్రయత్నం చేస్తూ ఉంటే క్రమంగా అలవడుతుంది.** ఎన్నో జన్మలుగా వచ్చిన సంస్కారాలు గదా! ఇప్పటి మన ప్రయత్నం ఎంత గట్టిగా ఉంటే అంత బాగా ఆయా దుర్గుణాలు పోయి సద్గుణాలు అలవడుతాయి. "వాచా శూరత్వం కాదు, కార్య శూరత్వం చూపు" అని పూజ్యపాదులు మాస్టారు గారు నన్నడిగేవారు. **భగవంతునికి ఇచ్చిన కాలం మన సొంత పనులకు వాడుకోకుండా ముందుకు సాగండి.**

నమస్తే,

పె.సుబ్బరామయ్య

********* సద్గురు దేవా శరణం శరణం *********

**Nagesh సార్ కు వ్రాసిన letter లభ్యం కావటం వల్ల నగేష్ letter, శ్రీ సార్ వ్రాసిన సమాధానం letter కూడా ఇక్కడ పొందు పరచడమైనది.**

13-02-06

Hyderabad

డియర్ సర్,

నమస్కారములు. మీరు క్షేమంగా ఉన్నారో లేదో తెలియదు. నేను మాత్రం లేను.

కనీసం మనస్ఫూర్తిగా నవ్వటం కూడా చేయలేకపోతున్నాను. మీతో సహా అందరూ నాకు 'దూరంగా' ఉన్నారు. మీ మీద చాలా కోపం వచ్చింది. మనస్సు తీవ్రంగా చలిస్తుంది. అసలు పారాయణ చేయబుద్ధి కావటం లేదు.

ఎంతైనా సరే ఇమ్మని C.A. FIRM కి వెళ్ళినా job దొరకలేదు.

మీరు చెప్పినవి ఒక్కటీ జరుగలేదు .

Exam తప్పక పాస్ అవుతనానని అన్నారు

Course చెయ్యమన్నారు. మీరు ఇచ్చిన డబ్బులు కూడా వారు తీసుకుని నెల రోజులు గడిచినా start చెయ్యలేదు సరికదా తిరిగి return చెయ్యమన్నారు. ఇప్పుడు మరి ఆ institution ను ఎలా నమ్మను ?

ఇదంతా నా 'ఖర్మ' అని ఎంత కాలం అనుకోవటం ?

అన్నీ 'ముందు నిర్ణయసారమే జరుగుతాయంటే' మరి సద్గురువుల అనుగ్రహం కూడా అంతేనా? అలా అయితే స్వప్రయత్నం ఎందుకు? పారాయణలు, పూజలు చేయటం కూడా ముందు నిర్ణయం ప్రకారం జరుగుతుంటాయా ?

కేవలం అనుగ్రహం నమ్మకం ఉంటేనే వస్తుందా ? లేకపోతే రాదా? ఏ basis పై నమ్మాలి ?

అంతా ముందు నిర్ణయమైతే అసలు పూజలు ఎందుకు చెయ్యడం ?

కేవలం మంచిగా ఉంటేనే కృప ఉంటుందా? 'పొయ్యేవారిని పోనిచ్చేవారు గురువు ఎలా అవుతారు'?

నాకు మీ మీద భయం, భక్తీ లేవు. మీ మనసు బాధ పెట్టినా క్షమించనవసరం లేదు.

నమస్కారములతో ,

నాగేష్ .

**ఈ letter కు శ్రీ సార్ సమాధానం విందామా ?**

గొలగమూడి,

18-02-06

Dear Nagesh!

ఆవేదన పూర్వకమైన నీ లెటర్ అందినది. నీవు ఆవేదనలో అలా వ్రాసావు కాని ఆ ప్రశ్నలకు నీకు సమాధానములు తెలియక కాదు అని నాకు బాగా తెలుసు. నీవు కోరినట్లు నేను టెంకాయ శ్రీ స్వామి వారి ధునికి సమర్పిస్తాను కానీ నీవు వ్రాసిన ప్రార్ధన మాత్రం చెయ్యను. అంత పొడువు ప్రార్ధన ఎపుడూ చేయకుడదు. హిరణ్యకశిపుదు తన తెలివినంత ఉపయోగించి వరమడిగాడు.

మానవులచేత, ఇతర ఆయుధములచేత, భూమిమీద, ఆకాశములోనూ, నీటిలోనూ, పగలు, రాత్రి నాకు చావులేకుండా వరమియ్యమన్నాడు. నరుడు జంతువు కాని రూపం, ఆయుధాలు లేకుండా గోళ్ళతోనూ, భూమి ఆకాశము కాకుండా సంధ్యా సమయంలో సంహరింపబడ్డాడు. గనుక **ప్రార్ధన ఎప్పుడూ సాధ్యమైనంత చిన్నదిగా ఉంటే మంచిదంటారు. నాకు శ్రేయస్కరమైనదే చేయి ప్రభూ అని గాని, నా జీవితం మీ చేతిలోకి తీసుకుని నన్ను సంపూర్ణ శరణాగతి చేయించండి అనిగాని, నన్ను మీ సంకల్పానుసారం నిరంతరము నడిపించండి అనిగానీ చెయ్యాలంటారు**. నా మట్టి బుర్రకు అర్థ్యా చేయడం చేతగాదు. సరేనని నమ్మేస్తాను. ఇప్పుడు నీ ప్రశ్నలకన్నింటికీ మొదట సమాధానాలిచ్చి, తర్వాత

నేను నా అభిప్రాయాలు వ్రాస్తాను. ఇంత పొడవు లెటరా అని చించి పారవేయ్యవద్దు.

చివర ఒక మాట వ్రాసావు దొరా! "మీకు శక్తి లేకుంటే ఈ ప్రార్థన చెప్పి ధునిలో కొబ్బరికాయ వేయండి" అని వ్రాసావు. నాకు శక్తి ఉందని నీకు నీవే తలచావా? లేక పిచ్చి వాళ్ళెవరైనా చెప్పారా? నాకు శక్తి ఉందనుకునేవాళ్ళంతా 100% పిచ్చివాళ్ళని నమ్ము.

ఈరోజుకు ఇంతవరకే, మిగిలిన దానిని రేపు వ్రాసే ప్రయత్నం చేస్తాను.

ప్ర 1. అన్నీ ముందు నిర్ణయానుసారమే జరుగుతాయంటే మరి సద్గురువుల అనుగ్రహం కూడా అంతేనా?

ఆన్సర్: **అనుగ్రహం ఎప్పుడూ ఉంటుందట. ముందు నిర్ణయం, వెనుక నిర్ణయం అంటూ లేదు. ఆ అనుగ్రహం మనకు దక్కకుండా మన అహం అనే గొడుగు అడ్డుందంటారు. నీకు ప్రస్తుతం ఉద్యోగం రాలేదని అనుగ్రహమే లేదని అనుకొనడం గొప్ప అజ్ఞానం. మనకెప్పుడు ఏది మంచిదో అది చేస్తారుగానీ మనం కోరినవన్నీ కాదు కదా?**

ప్ర 2. స్వప్రయత్నం ఎందుకు?

ఆన్సర్: **నీ ప్రయత్నం సఫలమైతే ఆనందంతో గంతులు వేయకు. విఫలమైతే క్రుంగిపోకు. విఫలమైనప్పుడు ఆ విధంగా ఆర్థికంగానూ, శరీరక శ్రమద్వారానూ మన కర్మ క్షాళన అయిందని భావించాలి గానీ క్రుంగిపోవడం విజ్ఞుల లక్షణం కాదు.**

ప్ర 3. పారాయణలు పూజలు చేయడంకూడా ముందు నిర్ణయం ప్రకారం జరుగుతుంటాయా?

ఆన్సర్: **అంతా ముందు నిర్ణయమే** - అలా కాకుంటే అందరూ పారాయణలు పూజలు చేయడం లేదు గదా. మన 100 మార్లు చెప్పినా చేయరు. ఉదా: నేనే. 8 నెలలు పాడు చేసాను. ఈ 8 నెలలలో నాకు తెలియకనే పుణ్యం పెరిగి పారాయణ, పూజ చేసాను.

ప్ర 4. కేవలం అనుగ్రహం నమ్మకముంటేనే వస్తుందా? లేకపోతే రాదా? ఏ బేసిస్ మీద నమ్మాలి?

ఆన్సర్: 3. **అనుగ్రహము <--- 2. నమ్మకము <-- 1. పుణ్యము. పుణ్యముంటే నమ్మకమొస్తుంది. అనుగ్రహం కల్గుతుంది. చూచి నమ్మిన వారికంటే చూడక నమ్మినవారు ఘనులు అన్నారు క్రీస్తు**. చూడక నమ్మేవారికి బేసిస్ అక్కరలేదు. పుణ్యాన్నిబట్టి సింపెల్ గా నమ్మేస్తారు.

ప్ర 5. అంతా ముందు నిర్ణయమైతే అసలు పూజలు చెయ్యటం ఎందుకు?

ఆన్సర్: **పూజలు చేయడం - మనం కోరినవి పొందేందుకు - అని ఎవరు చెప్పారు? ఏ గ్రంధంలో ఉంది? నీ భావం తప్పు.**

నా నమ్మకం -- పూజ అంటే ఏమిటి -- ఎలా చేయాలి? నీవు వ్రాస్తే ఆ తర్వాత నేను వ్రాస్తాను.

**కృప పొందేందుకు అహంకారం అనే గొడుగు తీసేస్తే, కృప అనే జల్లు మనపై వర్షిస్తుంది. సర్వస్య శరణాగతి కోరుచున్నాడు అది చేయాలి. ఏది ఎవరికి ఎప్పుడు ఇవ్వాలో సర్వేశ్వరునకు బాగా తెలుసు. అంతవరకూ నిస్పృహ పడకుండా ఆయనను స్మరిస్తూ ఉండాలేగానీ బాధ పడుతూ ఉన్నా అంతకాలం ఉండాలి. నవ్వుతూ ఉన్నా ఉండాలి. సంతోషంగా ఉంటే పోతుంది గదా?**

ప్ర 6. పొయ్యేవ్వరిని పోనిచ్చేవారు గురువులు ఎలా అవుతారు?

ఆన్సర్: **ఎందుకు కారు? అందరినీ ఒకే విధంగా సృష్టిస్తే పోలేదా అని నీవనవచ్చు. సృష్టి ఆయన క్రీడ. సృష్టిలో మానవునకు 1. విచక్షణ, 2. స్వేచ్ఛ రెండూ ఇచ్చారు. విచక్షణ లేకుండా స్వేచ్ఛనే ఉపయోగిస్తే కష్టపడుతారు.** విచక్షణతో man must be the master of his senses but not the slave of his mind అంటారు పెద్దలు. విచక్షణ లేకుండా స్వేచ్ఛనే ఉపయోగిస్తే పొయ్యేవాళ్ళను పోనిస్తారు.

ప్ర 7. నాకు తిరుగులేని నిదర్శనమిచ్చారు. ఇది నిజమే. అదికూడా నేను ఏమాత్రం ప్రార్ధన చెయ్యకుండా. వారు ఇప్పుడు ఏమి చేస్తున్నారు? ఎందుకు ఆలస్యం?

ఆన్సర్: **నిద్రపోతున్నాడనుకుందామా? కొలిమిలో పెట్టాక impurities పూర్తిగా పోకుండానే తీసేస్తే మరలా కొలిమిలో వేయాలి. అందుకని చూస్తున్నాడేమో? ఆలస్యం, అజాగ్రత్త ఎంత బాధ తెస్తాయో నీకెలా తెలుస్తాయి?**

ప్ర 8. టైం రావాలంటే - సర్వ సమర్ధతకు అర్ధం ఏమిటి?

ఆన్సర్: **సర్వసమర్ధత్వం అంటే కర్మ క్షాళన కాకుండానే వెంట వెంటనే మనం కోరినవన్నీ ఇచ్చేస్తుండాలా? What a wonderful statement.**

ప్ర 9. మీ మాటలు విని పొరపాటు చేశానా? లేక సరిగా అర్ధం చేసుకోలేదా ? లేక ఆచరించ లేదా?

ఆన్సర్: నేను suggest చేశాను. వెంకటేశ్వరరావును గైడెన్స్ తీసుకోమన్నాను. కానీ వెంటనే నిన్ను చేసే job వదిలి రమ్మనమని వ్రాసానా. నీ పరిస్థితి ఈ పీరియడ్ లో అలా జరగాలని ఉంది. జరుగుతుంది. చింత పడవద్దు, దిగులు పడవద్దు. హాయిగా టీ.వీ. లో ఆట చూస్తునట్లు జరిగేదంతా చూస్తుండు.

ప్ర 10. మీకు శక్తి లేకపోతే, మీ మీద మీకు నమ్మకముంటే నా లోపాలు సర్దుకొనే కొనే శక్తినిమ్మని, బుద్ధినిమ్మని, వివేకం ఇవ్వమని, విశ్వాసం ఇవ్వమని స్వామి ధునిలో ఒక కొబ్బరికాయ వేయండి.

అన్సార్: నాకు శక్తి ఉందని నేను సర్వసమర్ధుడనని నీకు నమ్మకం ఎలా కుదిరింది. ఎవరు చెప్పారు. అంతా మీ భ్రమ. తెలివి తక్కువ. Mis-understanding చేసుకున్నావు. ఎప్పుడూ భగవంతుని నమ్ము. తుచ్ఛమైన నాలాంటి మానవులను నన్నేకాదు. ఎవరిని విశ్వసించవద్దు. **ఇంత పొడమైన ప్రార్ధన కాకుండా "నగేష్ కు ఏది మంచిదో అది చేయండి" అని టెంకాయ శ్రీ స్వామి వారికి సమర్పిస్తాను.** ఆ ఆఫీస్ వారు నీకేమైనా రసీదు ఇచ్చారా? డబ్బులు వారికి ముట్టినట్లు. అలా అయితే S.P ని కలిసి help అడగవచ్చు. ఫోన్ ద్వారా తెలుపు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మీకుండాలని ప్రార్ధిస్తూ

మీ

సుబ్బరామయ్య

19-02-06.

---

Dear Ravi,

నీ పేరు G.V.R.M.S.Subrahmanyam అయితే రవి అని ఎందుకు పిలుస్తున్నారు? కవరు పై అడ్రసు చూచి ఎవరు క్రొత్తవారనుకున్నాను.

శ్రీ స్వామి వారి చరిత్రలో what do you mean by negligence of duty? అని శ్రీ స్వామివారు ఒకరిని మందలిస్తారు. అది మనందరికీ మందలింపే. **మన**

**duty చదువు. దానిని పాడు చేసేవే ఈ చాపల్యాలు. విద్యార్థి లక్షణాలు మరలా గుర్తు తెచ్చుకో.**

**మితాహారం; జీర్ణవస్త్రం; కాకదృష్టి; బకధ్యానం**

**మితాహారమంటే భగవద్గీతలో యుక్తాహార విహారస్య అన్నారు. బిసికెట్లు, టీలు ఎలాగంటే అలా తిని, త్రాగితే ఇంద్రియములలో చరించిన వాళ్ళమయి మన బుద్ధి హరించబడుతుంది. బుద్ధి హరించాక మనం మన duty (చదువు) neglect చేస్తాము. చదివినట్లే ఉంటాము. చదువుతాము. కానీ నిష్ప్రయోజనమై పోయి నూటికి నూరు మార్కుల నుండి 40 మార్కులకు దిగజారుతాము.** ఎవరికి వారే బుద్ధి తెచ్చుకుని ఇంద్రియ నిగ్రహము, చాపల్యములు చంపుకోవడము చేయాలి గాని శ్రీ స్వామివారు ఏమి చేస్తారు. ఏమీ చేయరు. **నరసమ్మ, వక్కెమ్మ, రోసిరెడ్డికి చేశారే అంటే వారి త్యాగము, పట్టుదల వైరాగ్యము మనకున్నాయా? వారిది ఎన్నో జన్మల సాధనో గదా. మనం కూడా ఈ జన్మలో వైరాగ్యము, చపల్యములు నిగ్రహించుట మొ|| సుగుణములు అలవరచుకోకుంటే ఏ భగవంతుడు మనలను రక్షించరు.** వక్కెమ్మ, నరసమ్మల వంటి త్యాగముందా మనకు?

ఇతరుల గొప్పకు సంతోషించాలి. మనకు అది లేదే మనకు అని బాధపడకూడదు. **అసూయాది దుర్గుణాల నుండి విడిబడే తీవ్ర ప్రయత్నం చేయాలి. అలాంటి భావాలకు ప్రాయశ్చిత్తం చేసుకోవాలి. Each is great in its own place అన్నారు. భగవంతుడు మనలను ఏ విధంగా ఉంచితే అలా సంతోషంగా మన డ్యూటీ అంతా వారి సేవేనని ఆత్మ పూర్వకంగా విశ్వసిస్తే అలా చేస్తే అన్నీ వారే చూచుకుంటారు. ప్రెసిడెంట్ of ఇండియా – పాకీ పనివాడు ఇద్దరూ ఒక్కటే.**

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

Dear Ravi,

నీ లెటర్ చేరినది. project asst. గా చేరినందుకు సంతోషము.

సత్ సంగం బాగా చేయండి. **కొత్త విషయాలు తెలుసుకునేటట్లు సత్ సంగం రూపొందించుకోండి. మాష్టరు గారి literature అంతా క్షుణ్ణంగా వంట పట్టించుకోండి.** ఏది నిజం, నిజానికి నిచ్చెనలు, పూజ, మిలారేపా చరిత్ర, విజ్ఞాన వీచికలు, సాయి ప్రబోధామృతం, సాయి మాస్టర్ ప్రవచనములు బాగా discuss చేయండి.

అతిగా తినడమని వ్రాశావు. అతియని నీకెందుకనిపిస్తుంది. తిన్నాక తూగు, డ్రౌజీనెస్ ఉండకుండా ఉండేటంత తిను. Special తినాలనిపిస్తే అన్నం దగ్గరే తిను. కొంత అన్నం తగ్గించుకో. **భగవంతుడిచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేయి. ఇప్పుడు ఈ వయస్సులోనే ధర్మంగా ప్రవర్తించాలి. కామ వాసనలకు దూరంగా ఉంటూ అలాంటి వాసనలనిచ్చే ఆహారం వాటిని నిషేధించు.**

**శ్రీ స్వామిని గానీ, భగవంతునికి గానీ సంపూర్ణ శరణాగతి చెయ్యి. అప్పుడు ఆయనే మనలను నడిపిస్తాడు.** శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

# సాధన–నియమపాలన

సాధనంటే నైవేద్యాలు, కర్పూరహారతులు, పూలమాలలు కాదు. నీవు నిజమైన సాధకుడుగా నిలవాలని నా ఆశ. అంతే కాని కష్ట సుఖాలకు బెంబేలెత్తే బేలవు కాకూడదు. పది మందికి నీడ నిచ్చేవృక్షంగా మనం రూపు దాల్చాలి కానీ పదిమందిని యాచించేవారం కాకూడదు. మరలా మరలా శ్రీ మాష్టారి రచనలు చదువు. పారాయణలు అని తొందర పడవద్దు. సత్యం హృదయ

గతం చేయమని శ్రీ మాష్టారిని ప్రార్థించు. ఆయన నిత్య సత్యుడై నిరంతరం మనలను కనిపెట్టి నడుపుతూ సరైన సమాధానం ఇచ్చేందుకు రెడీగా ఉన్నారు. ఆ అసమాన సద్గురుమూర్తి ఆదేశాలు స్వీకరించి నడచుకునేటట్లు మన బుద్ధిని మలచమని ప్రార్థించు.

- శ్రీ పె. సుబ్బరామ్మయ్య

---

చిరంజీవి G.సాయిశివ గారికి,

శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సుబ్బరామయ్య వ్రాయడం.

మనసు స్థిమితంగా పూర్వం వలె లేదని వ్రాశావు. Sunday Holiday కదా ఆ రోజు ఒక్కరోజు ద్రవాహారం మాత్రమే తీసుకొని ఉపవాసముండు. పండ్లరసం, పాలుతీసుకో. మూడుపేళలా solid food తినవద్దు. అలా ఒకే ఒక్కరోజు చేస్తూ సాయిని ప్రార్థించు. "తెలియక ఏదైనా పొరపాటు చేసి ఉండవచ్చు. నా ఈ ప్రాయశ్చిత్తమునకు కరుణ చూపి నాకు పూర్వపు స్థిమితమైన మనస్సును ప్రసాదించు ప్రభూ! తమరు నాకు అనుగ్రహించిన పనిని క్షుణ్ణంగా చేసే బుద్ధికుశలత ప్రసాదించు తండ్రీ" అని ప్రార్థించు. సాయి పరమ దయానిధి. నీ ప్రార్ధనకు తప్పక స్పందించి దయ చూపుతాడు.

శ్రీ సాయికృప కలుగవలెనని ప్రార్థిస్తూ..

పె. సుబ్బరామ్మయ్య

**ఏమీ బెంబేలు పడవద్దు. అంతా సాయి దయ. అంతా మన మంచికే చేస్తారు. కొండంతను గోరంతతో తొలగిస్తారు. ఆ విశ్వాసమే మనలను కాపాడుతుంది.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

7 -07 -1999

పూజ్యులైన లక్ష్మి గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. మీకు లెటరు వ్రాయడంలో నా ఉద్దేశ్యం నాకు ఎక్కువ తెలుసునని కాదు. నా భావాలు మీతో పంచుకున్నందున లెటరు ద్వారా సత్సంగం అని మాత్రమే.

నేను ఇంతకుముందు చివటం అమ్మ చరిత్ర 2, 3 సార్లు చదివాను. కాని ఈ వాక్యం మాత్రం నా హృదయానికి హత్తుకోలేదు. అమ్మ బోధ అనే అధ్యాయంలో 94 వ పేజీ శారదా వివేక్ గారు వ్రాసిన మూడవ పేరాగ్రాఫ్ లో **"పత్తమైనా వచ్చిందంటే" అన్నారు అమ్మ. ఆ మాట అందరు భక్తులు తర్కించి యోచించి హృదయగతం చేసుకోవలసిన వాక్యము. ఏ మహనీయుని దగ్గరకైనా, దేవాలయానికైనా ఎలా వెళ్ళాలి అనే విషయం అమ్మ బోధిస్తుంది. ఇది నాకు గొప్ప బోధ. ఇది శ్రీ మాస్టారు చెప్పిన మాటకు మరొక రూపము. కనీసం నామజపం, పారాయణ, ధ్యానం లాంటి కాలక్షేపలతో చేరాలని వారి బోధ.**

ఆ భక్తురాలికి అది పాఠమైతే నాకొక గొప్ప బోధ చేసారు. **"ఉండటమైనా నీకు వచ్చిందా"** అని అడిగినట్టుంది. **శ్రీ వెంకయ్యస్వామి వారి సన్నిధి లో ఎలా ఉండాలి. ఇంతటి గొప్ప సన్నిధి లభించినా దాన్ని సద్వినియోగం చేసుకుంటున్నానా?** లేదు. అమ్మే నన్ను చెప్పుతో కొట్టినట్లు ఉంది. అందుకే మాస్టారు **"ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు"** అన్న ఆదేశానికి చక్కగా సరిపోయింది. మహాత్ములు సమాధి చెందాక కూడా మనతో మాట్లాడటం అంటే ఇదేననుకుంటాను. ఇక దీనిని గూర్చి వారి వారి శక్త్యానుసారం ఆలోచించుకోవచ్చు.

శ్రీ పాకలపాటి గురువుగారి చరిత్ర చదవటం 3 వ సారి అనుకుంటాను. అందులో ముఖ్యంగా చరమ సందేశం అనే అధ్యాయం నన్నెంతగానో ఆకట్టుకుంది. అహం అంటే ఎంత సూక్ష్మంగా ఉంటుందో చూడండి, గాయత్రీ సిద్ధి అంటే ఏమిటి? ఉపదేశాలు, నామజపం, మంత్రజపం-ఎన్ని విధాలైన బోధలో. అదే పుస్తకం 16 , 17 పేజీలలో **ఆ తలంపు రావటం, ఆ పని చేయటం వేరుకాదు అన్నారు. ఎంత అమోఘమైన బోధ! మానసికంగా వ్యభిచరించని వారు మొదటిరాయి వేయండి అన్న**

**క్రీస్తు** వాక్యాన్ని తలపిస్తుంది. అలాగే పేజి 68,75,76 మరలా మరలా చదవాలి. మననం చేయాల్సిన బోధలు.

మహా సమాధి అనంతరం ఇట్టి దివ్య బోధలు చేస్తున్న శ్రీ మాస్టారు గారికి ఋణం చెల్లించడం ఎలాగో తెలియదు. అంతటా నిండియున్న ఆ పరతత్వమే తానైన వారి ఆజ్ఞలు పాటించే ప్రయత్నమైన చేసి వారికి కృతజ్ఞత తెలుపుకుందాం. ఆచరణలో సఫలం కావాలంటే వారి దయలేక ఎన్ని జన్మలకైనా సఫలం కాలేను.

నమస్కారములతో

పె.సుబ్బరామయ్య.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

పూజ్య గురుబంధువులైన శ్రీమతి భవాని గార్కి ఆ రూపంలో ఉన్న శ్రీ స్వామి వారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు. అమ్మా! మీరెంతో అభిమానంతోను వాత్సల్యముతోనూ పంపిన మందు చేరినది. అవసరమైనపుడు వాడతాను. ప్రస్తుతం చాలా ఆరోగ్యంతో ఉన్నాను. జనవరి 2 వ తేది నుండి అలాగ ఆయాసం పెట్టి నన్ను ఎంత చక్కగాను గొప్పగాను సంస్కరించారో నేను ఇక్కడ చెప్పలేను. ఇన్ని సంవత్సరాలుగా అర్థం కాకుండా ఉన్న అనేక విషయాలు అరమరికలు లేకుండా విప్పిచెప్పారు. చెప్పడమేకాక ఎంతో ఆచరించేటట్లు చేస్తున్నారు. శ్రీ మాస్టారుగారు శ్రీ స్వామివారు శ్రీ సాయి వేరు కారని స్పష్టపరిచారు. 2 సంవత్సరాల క్రిందట శ్రీ మాస్టారు నన్ను మూడు సార్లు మందలించినా దున్నపోతు తత్వం గల నాకు ఆ సందేశములు అర్థం అయినట్లే ఉన్నా ఆచరణకు రాలేదు. ఆచరించని సందేశములు అర్థం కానట్లే

లెక్క. వారు ముగ్గురు ఒకటే కనుక వారిని నేను ట్రినిటీ అంటే త్రిమూర్తితత్వమని పిలుస్తున్నాను.

ఈ ఆయాసంలో నా తప్పేమో చెప్పమని కష్టపడ్డాను. **"దారం తెగిపోకుండా చూచుకుంటే నేనెప్పుడూ మీదగ్గరే ఉంటుండ్లాయ్యా"** అని ఎంతో స్పష్టంగా తెలుపుతున్నారు. దారమంటే చేతికి కట్టుకున్నది కాదు. మానసికంగా వారితో సంబంధం అన్నమాట. నా దారం ఇట్లా తెగిపోతున్నదెందుకు స్వామీ అంటే 2 సంవత్సరాల నాడు మాష్టరు చెప్పింది చేస్తున్నావా? అని చెపుతున్నారు. శ్రీ మాష్టారు 2 సంవత్సరాల క్రిందట ఏమి చెప్పారు? ఇది సాయి మాష్టారు నిలయంలో గోడమీద రంగుతో వ్రాయించారు శ్రీ మాష్టర్. అది

**1. ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు.**

**2. మాయ ఎవరినీ తనంతట తానుగా తనను అతిక్రమించనివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నము ద్వారా మాయను దాటవలసిందే.**

3. **శ్రీ స్వామి వారిని వెంబడిస్తే నీకు భుక్తి, ముక్తికి డోకాలేదు అన్నారు. మరి శ్రీ స్వామి వారిని నేను వెంబడించలేదా అని నాకు సంశయము.**

వెంబడించనే లేదని వారి తిరుగులేని నిర్ణయం. **నేనేమి ఆచరించలేదో తెలుపుతున్నారు.**

1. కఠోరమైన నియమ పాలన నాకు లేదు. శ్రీ స్వామి వారు మూడు రోజులు గడిచినా తాటి ఆకు రేక లేదని గంజి ముట్ట లేదు. నాల్గవరోజు సేవకులు రైలు దిగి ఒక గ్రామంలో కత్తి తీసుకొని తాటాకు కొట్టి రేక తెస్తేనే గంజి తాగారు. మరి నేను అవసరాన్ని సమయాన్నిబట్టి మాత్రమే నియమపాలన సాగిస్తూ చాలా గొప్పగా పాటిస్తున్నట్లు కీర్తి వహించుచున్నాను.

2. వర్షం వచ్చి పూర్తిగా తడిసి గడగడ వణుకుతున్నా ఇంట్లోకి రాకుండా బయట ఉన్నారు. సేవకులంతా, ఇంట్లోనే ఉన్నారు. ఇక చూడలేక వారికి గూడ అడ్డం పెట్టారు.

3. వర్షం వల్ల నిప్పు ఆరిపోతుందనే భయం లేకుండా బొంత చెట్టుకిందనే అగ్నిహోత్రం సాగించారు. ఇలా వారి కఠోర నియమ పాలన వ్రాస్తుంటే ఒక గ్రంథం అవుతుంది. వారి లాంటి పరిపూర్ణ వైరాగ్యం అబ్బిందా నాకు, లేనే లేదు. ఉద్యోగం వదిలాడని కీర్తి తప్ప వారిలాంటి వైరాగ్యమే లేదు.

4. ఇతరులను విమర్శించడం పంది మలభక్షణం చేయడంలాంటిదని సాయి చెప్పినా ఈ పంది దానిని సంపూర్ణంగా మాననే మానలేదు. ఇలాంటి ఎన్నో విషయాలు ఆయాసం తరువాత బాగా తెలుస్తున్నాయి. గ్రుడ్డిలో మెల్ల శ్రేష్టమన్నట్లు ఆచరించే ప్రయత్నమైనా చేస్తున్నాను.

5. శ్రీ స్వామి వారు మితాశనాయనమ: అంటే మితంగా ఆహారము ఔషదము వలె స్వీకరించు వారు అని అర్ధము. మరి నేను అమితాశనాయనుడను.

ఆహారం విషయంలో నాకు పాకులాట ఎంతదో మీకెలా తెలుస్తుందమ్మా అది నాకు తెలుసు, శ్రీ స్వామి వారికి తెలుసు. కనుక వారు చిన్న తప్పయినా తప్పేనని చెప్పారు. అంతేగాక రెండుసార్లు స్వప్నం ద్వారా నా ఆహారం పాకులాట తగదని బోధించారు. స్పష్టంగా తెలుస్తూనే ఉంది. నేను ఆచరించితే కదా!

శ్రుతిమించి రాగాన పడిందని తలచారు కనుక 02-01-2000 రాత్రి **నుండి ఒకవైపు పట్టకారుతో తోడపట్టుకుని నలగ కొడుతూ మరొక వైపు ఆచరించకుంటే నీకు బాధ తప్పదని స్పష్టపరుస్తున్నారు.** దారం తెగిపోకుండా ఉంటే సరేసరి లేకుంటే ఇక చూసుకోండి, **ఆహా! ఎంత బాధ పడినా అంత సంతోషంగా ఉందమ్మ, ఎందుకు? కొంతకు కొంతైనా బాగా ముందుకు నెడుతున్నారు కనుక.**

శ్రీ స్వామి వారికి మనుసులో ఈ జగత్తు పట్ల ఉదాసీన భావం తప్ప ఎలాంటి బంధమూ లేదు. మరి నాకు ఆత్మలో ఎంత బంధముందని నాకు తెలియకున్నా వారికి తెలుసు. భార్య, బిడ్డ, కూతురు, మనుమడు, అల్లుడు వీళ్ళందరినీ కాపాడేది శ్రీ స్వామి వారా? లేక నేనా? పైకెన్నిచెప్పినా ఆత్మలో వారి ఎడల రాగం ఉంది. అది చావనిదే సాధనే లేదంటారు శ్రీ మాష్టారు. (మన) వారు ఏమి అవుతారో, ఏమి తినాలో అవి అన్ని అనుభవానికి వచ్చి తీరుతాయి. కానీ మన రాగం వల్ల కాదని సుస్పష్టంగా తెలుపుతున్నారు. మీలాంటి ఆత్మీయులనే కాక కొండంత అండయైన శ్రీ స్వామి వారిని చూపించిన శ్రీ మాష్టారి గారికి దండ  ప్రణామములు.

కష్టాలు కూడా అనుగ్రహానికి గుర్తు.

నమస్కారములతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

డియర్ సత్యనారాయణ గారు,

మీ ప్రశ్నలాంటి ప్రశ్న నాకు కలగలేదు. అలాంటి కోరికే కలుగలేదు. అమాయకులు నేను బాగా తెలిసినవాడిననుకొంటారు. ఒక్క శ్రీ సాయి, శ్రీ స్వామి, శ్రీ మాష్టారి లాంటి వారే తెలిసినవారు. తక్కిన వారంతా అంటే తక్కిన మహనీయులని తలచకు. శ్రీ రామకృష్ణ పరమహంస, శ్రీ రమణ మహర్షి గారు, శ్రీ స్వామి సమర్థ లాంటి వారు కాదు. నాలాంటి తోక ఆడించే వారు చాలామంది ఉన్నారు. వాళ్లందరమూ అజ్ఞానులమే. నీ ప్రశ్నలకు చెప్పాలంటే ముందు సాయిని నేను అంతటా ఉన్నాడనేది అనుభవించి ఉండాలి, ఈ అనుభవం (1) మానసికంగానూ (2) శారీరకంగానూ ఉంటుంది అని నేను విన్న దాన్ని బట్టి, చదివిన దాన్ని బట్టి తెలుసుకున్నాను. అసలు మానసికంగా కూడా నేను

అనుభవించలేదు కదా! ఇక శారీరకంగా ఏమి అనుభవిస్తాను? నాకు తెలిసినంతవరకు **మీరు థియరీ తెలుసుకోవాలి. థియరీ తెలియాలంటే శ్రీ మాష్టారుగారి రచనలన్నీ క్షుణ్ణంగా ఎక్కడ అడిగినా చెప్పగలిగివుండాలి.** ఒకరడిగితేకాదు. నీ ఆత్మ ప్రశ్నించినపుడు నీకు నీవే సమాధానం చెప్పుకోగలగాలి. **అంటే అంత క్షుణ్ణంగా ఆ రచనలన్నీ వంట పట్టించుకోవాలి.**

(1) ఏది నిజం (2) మతం ఎందుకు (3) పూజ (4) విజ్ఞాన వీచికలు (5) మహనీయుల చరిత్రలు (6) ధ్యానయోగ సర్వస్వము (7) బుద్ధ ధ్యాన హృదయం (8) నాకు తెలిసిన మాష్టారు (9) గురు చరిత్ర

వీటి ద్వారా theory తెలుస్తుంది.

ప్రాక్టికల్ కు వస్తే అది పెద్ద విషయం. **థియరీలో నేర్చుకున్న దాన్ని ప్రాక్టికల్ గా అనుభవించాలి. నాకు వెంటనే రిజల్ట్ రాలేదు అంటే రాదు.** శ్రీ రామకృష్ణ పరమహంస గారికి 12 సంవత్సరముల కాలం పట్టింది. అంతటికీ కలిపి.

**పై వన్నీ చేయగా ఏమిటంటే జరిగేది : మనసును నిగ్రహించేందుకు సర్వసాధనలూ అని తెలియడం "ఆశపోతే అంతా పోతుండ్లాయ్యా" అంటారు శ్రీ వెంకయ్య స్వామి. ఇష్ట అయిష్టములు నిగ్రహింపబడి మనసు నిగ్రహించబడడమే జరగవలసింది.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

Hello సత్యనారాయణ గారు!

ఏమైనా చదవటం మొదలు పెట్టావా ? లేక వీళ్లకు తెలియదు, ఏదో కోతలని మానేశావా? **మన sincerity హృదయపూర్వకమైనదని లెటర్ ద్వారా కాదు నీ ఆచరణ ద్వారా ఋజువు చేసుకో. ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా ఆ సత్యం తెలుసుకోవాలని ఉందన్నావుగా మరి.** ముందు జాగ్రత్తగా ఏది నిజం, మతం

ఎందుకు, విజ్ఞాన వీచికలు, సాయిలీలామృతం, గురుచరిత్ర, శ్రీ స్వామివారి **చరిత్రలు దీక్షగా అర్థ ఆకలితోనే పారాయణ చేయాలి. దీక్షా కాలంలో ఎవ్వరితోనూ తగాదాలు, జోకులు, సినిమాలు, అమ్మాయిల కబుర్లు పనికి రావు. ఎప్పుడూ అర్థ కడుపు నిండగానే లేయాలి. నీవు ఆధ్యాత్మిక విద్య కోరుతున్నావు. కనుక విద్యార్థికి చెప్పబడ్డ నియమాలు పాటించాలి.**

**(1) మితాహారం (2) జీర్ణ వస్త్రం (3) కాక దృష్టి (4) బక ధ్యానం**

**ఈ నియమాలు పాటించకుండా నీకు పుస్తకంలో చెప్పబడ్డ సత్యం హృదయగతం కాదు. దిల్ కే బాత్ కావాలి. దిమాక్ కే బాత్ కాదు. నిత్యం నియమం తప్పకుండా పెట్టుకున్న కాలాని కంటే ముందే (ఐదు నిమిషాలు) వచ్చి ప్రశాంత చిత్తముతో మాష్టారి పటం ముందు కూర్చోవాలి. విశ్వాసంతో వారు తప్పక సందేహనివృత్తి చేసి శుభ్రమార్గాన నడుపుతారనే విశ్వాసముండాలి.** విశ్వాసం లేకుండా సంశయ హృదయుడపై కూర్చున్నా ప్రయోజనం లేదు.

ఏకలవ్యుడు కేవలం విశ్వాసం వలననే అర్జునున్ని మించిన విలుకాడయ్యాడు. తన ఎదుట ఉన్నది మట్టి బొమ్మ అని ఎప్పుడూ కలలో కూడా పొరపాటున గూడ అనుకోలేదు. అందుకే శబ్దవేది బాణ ప్రయోగం మంత్రపూర్వకంగా నేర్చుకున్నాడు.

నీకూ అలాంటి విశ్వాసముంటే శ్రీ మాష్టారి పటమే అయన అంతటా ఎలా ఉన్నాడో అనుభవపూర్వకంగా బోధిస్తారు.

**నీవు విద్యార్థి ధర్మాలు, నియమాలు పాటించకుండా, నిష్ట, సబూరీలు సమర్పించకుండా అంత గొప్ప సత్యం నీకు ప్రాక్టికల్ గా అనుభవం కావాలంటే ఇది తొలి పాఠం. ఈ తొలి పాఠానికే ఎంత త్యాగముండాలో చూడు. నిష్ఠ కుదరాలంటే సబూరి ఉండాలి. సబూరి అంటే ఓర్పు. ఏమిటి ఓర్చుకునేది. నీవు సమర్పించే**

**కాలంలో నీ సొంత పనులు నష్టమౌతాయి. ఈ నష్టాన్ని ఓర్చుకోవాలి. ఇలా భల్లూకపు పట్టుదలతో బ్రహ్మచర్యం కాదు, అష్టవిధ బ్రహ్మచర్యంతో, కఠోర నియమపాలనతో కాక దృష్టితో సాగిచూడు. అంతటా అయన ఎలా ఉన్నారో తెలుపుతారు శ్రీ మాష్టారు.**

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

OM

గొలగమూడి

Dear Siva !

నీ లెటరు చేరింది. సిద్ధపురుషులు స్వప్నంలో కనిపించినా సరే అది భౌతికదర్శనంతో సమానమని చెప్పేవారు మాస్టర్ గారు.

అమ్మ, అన్న క్షేమంగా ఉన్నారు. అన్న ఆరోగ్యం 80% మెరుగైంది. శ్రీస్వామి వారి ఆజ్ఞ మేరకు Ph.Dకి ప్రయత్నిస్తున్నాడు. 4,5 రోజులలో బెంగుళూరు పోతారు. Ph.Dకి వాళ్ళ ప్రొఫెసర్ రమ్మన్నాడట. నీకు B.Tech ఈ సంవత్సరం అయిపోతుందా?

నీవు ఆసనాలు నిత్యం వేస్తున్నావని తలుస్తాను. **ఆసనాలు వేయడం సాధనలో, చదువులో ఒక భాగంగా తప్పక తలవాలి. ఆసనాలు వేయకుంటే మన సాధన, చదువు రెండూ కూడా పరిపూర్ణం కావు.** శ్రీస్వామివారి ఆశీస్సులు సదా నీకుండాలని ప్రార్థిస్తూ.

మీ

పె.సుబ్బరామయ్య.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

సాయిరాం

శ్రీ సాయినాథాయ నమః

ఓం

గొలగమూడి

Dear Sai!

"ఒక్క చెడ్డ లక్షణం మిగిలి ఉన్నా మిగిలిన అన్నింటినీ ప్రజ్వలింప చేస్తుందని, వాటిని తొలగించు కోవటానికి చేసే ప్రయత్నం దానికి అడుగడుగునా ఆయన సహకారం అలా అలా ఇంకా ఉధృతం కావటం ఎందుకు సాధ్యం కావటం లేదు" అని వ్రాశావు.

**నిత్యం శరీర వ్యాయామం అవసరం.** అవసరమంటే పహిల్వానులా కసరత్తు వంటిదని తలచకు.. **సూర్య నమస్కారాల వంటివి తప్పనిసరిగా ఉండాలి**. మాస్టారు చేయలేదు అని చెప్పవద్దు. వారు సాయి వద్ద సమాధి స్థితి పొందక ముందు వ్యాయామం చేసారు. Ph.D. వారికి చక్కగా వివరించే కుశలత లేదు. అవసరం అని మాత్రం గట్టిగా చెప్పగలను. అది అనుభవం నేర్పిన పాఠం.

Job నుండి 6.30 గంటలకు వస్తే తిరిగి 9 గంటల వరకు గుడి, Mess, సరుకులు, ఏదో తిరుగుతూ 2½ గంటలూ పాడు చేసు కోవడమేనా?

**మన కళ్ళ గుండా, చెవుల గుండా, స్పర్శ ద్వారా, శ్వాస ద్వారా ఎంత లౌకికం మనకు చుట్టుకుంటుందో బాగా యోచించు.** నిన్ను నీవు సంఘంలోని ఇతరులతో పోల్చుకుంటే ఇక ఎప్పటికైనా వాళ్ళ లౌకిక స్థాయి నుండి బయట పడలేవు. సరుకులు మనిషి ద్వారా తెప్పించుకుని నీ వంట నీవు తిను. సర్వం సమకూడుతుంది. కొత్త రకం Instrument వచ్చింది. అన్నం, కూర రెండు గిన్నెలలో పెట్టి తగిన నీళ్ళు పోసి స్విచ్ వేసి వదిలేస్తే ఉడకగానే అదే auto systesm ప్రకారం ఆరిపోతుంది. మరొక బటన్ on అయి కొద్ది పాటి వేడి ఉండి, మనం ఎప్పుడు తిన్నా వేడిగా ఉంటుంది. రుచులు పాకాలుగా తినడం తగదు. **శరీరానికి శక్తే కానీ, రుచికి**

**తినరాదు. Food విషయం జాగ్రత్త. అప్పుడు మన సాధన ఉదృతం అవుతుంది. Practical గా చేసి చూడు.**

ఇంద్రియాణాంహి చరతాం యన్మనోను విధేయతే

తదస్య హరతి ప్రజ్ఞాం వాయుర్నవ మివాంబసి

అన్నారు గీతలో. ఇంద్రియములలో చరించు మనస్సు యొక్క ప్రజ్ఞ హరించబడును. ఎలాగు? పడవ యొక్క వేగము గాలి చేత హరింప బడినట్లు.

మామిడి పండు మానేస్తాను. స్వీటు మానేస్తాను అని లోపల చివుక్కు మంటూ వదలటం కాదు. ఆకలికి మందుగా భగవంతుడు ఇచ్చింది ఆయన ప్రసాదంగా తినాలి.

**ఆహారానికి హృదయపూర్వకంగా నమస్కరించి ఎన్నో జీవుల కృషి ఫలితంగా సమకూర్చావు. ఆ జీవులన్నీ తమరే. మరి నీకు ఋణపడకుండా ఏమి చేసి ఋణ విముక్తుడనవ్వాలో అలా నడిపించు అని ఏమి తిన్నా తాగినా ప్రార్థిస్తుండు. దిల్ కే బాత్ గా వుండాలి దిమాక్ కే బాత్ గా వుండ రాదు.**

సత్సంగం మన ఉన్నతి కొరకే. ఇతరులను బాగు చేసేందుకు కాదు అనే లోపల ఎరుకతో ఇతరులకు చెప్పడం తప్పు కాదు. ఆయన పంపిన వారికే చెబుతాము.

"వ్యామోహాల వల్ల నిర్దుష్టమైన ఆచరణ లేకుండా పోతుంది" అన్నావు.

ముందు ఆశయం గట్టిగా నిర్ణయించుకోవాలి. లౌకికంగా లక్షలు గడించి అనుభవించడమా! లేక ఆత్మ శాంతి, తృప్తి, ఆనందంగా మనకు కావలసినది అనేది నిర్ణయించుకొని తక్కిన వ్యామోహాలన్ని మన మార్గంలోని ముండ్ల కంపలని గుర్తించి దూరంగా తొలగించుకుంటూ జాగ్రత్తగా పోవాలి. దానినే వివేకము, వైరాగ్యము అన్నారు. వివేక, వైరాగ్యాలే వ్యామోహాలను

నిర్మూలిస్తాయి. ఇక మార్గమే లేదు. సాయి కృప చూపినా కాని, వివేక వైరాగ్యాలు లేకుంటే ఆ కృపను నిలుపుకోలేము. అందుకే మాస్టారు నీ జోలికి చిల్లి లేకుండా చూచుకో అన్నారు. అంటే నీలోని బలహీనతలను రూపుమాపుకో అన్నారు. అంటే మనలోని బలహీనతలను రూపు మాపుకో అన్నారు.

"Professor ను motivate చేయడం నా సేవలో భాగం" అనుకోకు. అది నిష్కామ కర్మ – సాయినే మన చేత అలా చేయిస్తున్నాడు అనుకో. ఎప్పుడూ ఫలితం ఆశించకూడదు. బాబా ఇష్టం ఉంటే త్వరగా అవుతుంది. లేకుంటే మనం ఎంత ప్రయత్నించినా కాదు. **ప్రయత్నం – తీవ్ర ప్రయత్నం మాత్రమే మన ప్రధమ కర్తవ్యం అని సాగుతూ ఉండు.**

ఉదయప్రార్థన పొడుగు చేయవద్దు. శ్రీ మాస్టారు వ్రాసిన ప్రార్థన majority of people కొరకు. గట్టి పట్టుతో సాగే వారికి ఒకే ఒక్క మాట చాలు. "**నిస్సహాయుడనై నీ పాదముల నాశ్రయించాను. నా సర్వ బాధ్యతలు నీవే ప్రభూ. మాయ నా దరి చేరకుండా మీరే చేయాలి. మా బహిరంతరముల యందున్న మిమ్ములను అనుక్షణం గుర్తించుచూ మీ ఆజ్ఞలను తు||చ|| తప్పకుండా పాటించేటట్లు నాకు శక్తి ప్రసాదించు ప్రభూ**" అని క్లుప్తంగా చెప్పుకో. హృదయపూర్వకంగా చెప్పు. ఆ ప్రార్ధనలో నీ సాధనలో వచ్చే ఇబ్బందులు, doubtలు అన్నీ వారికి విన్నవించుకో. అది living ప్రార్థన. అంతే కానీ ఉదయ ప్రార్థన అంతా stereo type లో చెప్పుకున్నందుకు లాభం ఏమిటి ? Paracetamol, Paracetamol అని ఎన్ని మార్లు అనుకున్నా జ్వరం తగ్గదు కదా!

జీవితలక్ష్యం ఏర్పరచుకోవటంలో పూర్వ జన్మ సాధన, ఈ జన్మలో పూర్వం చేసిన సాధన బాగా పని చేస్తాయి. సాయి సర్వ సమర్థుడు – ఇది తిరుగులేని సత్యం – మనం ఒక్క అడుగు వేస్తే వారు పది అడుగులు మనవైపు వేస్తారు. ఒక్క అడుగు

వేసే హక్కు మన కిచ్చారు. మనం ఎటు అడుగు వేస్తే అటు తాను 10 అడుగులు వేస్తారు. జీవిత లక్ష్యం ఎంచుకునే స్వేచ్ఛ మనకే ఇచ్చారు. **జీవిత లక్ష్యం సాధించేందుకు మన జీవిత విధానం సరి అయినదిగా ఉండాలి. ఆధ్యాత్మికత, ఆత్మానందం, తృప్తి, శాంతి అనేవి కావాలంటే మొదట మనం బానిసలుగా ఉండకూడదు.** 50 వేల రూపాయలు నెలకు జీతం. రాత్రి పగలు విద్యుక్త ధర్మ నిర్వహణలో తలమునకలు అవ్వటం. ఇలాంటి జీవితానికి డబ్బు ముఖ్యం, మన స్వేచ్ఛ అమ్ముకున్నాడు అన్నమాట. అందుకే మాస్టారు కలెక్టర్ పని బంగారు సంకెళ్ళు అని బడి పంతులు అయ్యారు. వచ్చిన ఉద్యోగం వదిలేశారు. మన టైం మన సాధనకు ఉండాలి. మన మీద పెత్తనం చలాయించేవారు ఉండకూడదు. **అన్నానికి చేయి చాచకుండా ఉద్యోగం** మాత్రమే కాని మన Research తోనే ప్రజా క్షేమం ఉంది అనుకోకూడదు. ఈ Research లు అన్ని లేనప్పుడు ప్రజలు సుఖ శాంతులతో లేరా?? Research లు చేసి కొత్త కొత్తవి కనుక్కొని కొత్త జబ్బులు వచ్చాయి.

**అసలు జీవిత ధ్యేయం – జీవిత లక్ష్యం ఏమిగా ఉండాలంటావు ?**

**నాకు తెలిసినంత వరకు మనలను ఈ విధంగా పుట్టించి పెంచి పోషించిన భగవంతుడు మన నుండి కోరేది ఏమిటి? మన కాలము, మనస్సు మాత్రమే!**

మనస్సులో ఆలోచనలు రాకుండా సాధన చేసేందుకే కాలం ఇస్తున్నాము. ఈ సాధనకే మన లక్ష్యం పరిమితమై ఉండాలి. ఈ లక్ష్యం దృష్టిలో పెట్టుకొని job చూసుకోవాలి. Job చేస్తూ వ్యామోహాలకు గురి అయితే నిచ్చెన మీద నుండి క్రింద పడ్డట్లే! ఎవరో బాటకావు బచ్చా మారుతి కార్లలో తిరుగుతూ చాలా turn up చేస్తున్నట్లు కనపడితే అది మంచిదనుకోవటం వ్యామోహము.

ఒక కోనేటిలో ఒక రాయి వేస్తే దాని నుండి పుట్టిన అలలు కోనేరంత వ్యాపించినట్లు మనం ఒక చోట కూర్చొని ధ్యానం చేస్తే దాని ప్రభావం విశ్వమంతా ఉంటుంది అంటారు మాష్టారు. T.V. మెకానిజాలు వివరించగల మీకు నేను ఏమి చెప్పగలను?

**ఆయన సర్వ సమర్థుడు – సర్వ ప్రేరణాధికారి.**

**మనం ఒక్క అడుగు వేయడంలోనే మన ధర్మం ఉంది. ఆ తర్వాత వారు మనలను నడిపిస్తారు.** ఆ ఒక్క అడుగు బాబా కోరినట్లు వేస్తామా! లేక MAJORITY OF MASS వేసినట్లు వేస్తామా అనేది COUNT అవుతుంది.

జీవితధ్యేయం ఏర్పరచుకొనడంలో అహంకారంతో కూడిన కర్తృత్వం ఉంటుందని తలచకూడదు. "బాబానే మనకు సరైన లక్ష్యం (ధ్యేయం) ఏర్పరచమని హృదయ పూర్వక ప్రార్థన" చేస్తే సరి.

బాహ్య పరిస్థితులను మనం మలచుకోవడం ఏమిటి? నేను sub inspector పనిలో చేరి బాహ్య పరిస్థితులను ఏమి మలుస్తాను? Nature of job selection లో చూచుకో. **నా మనస్సు, కాలము నీకు సమర్పించేటట్లు చేయమని బాబాను ప్రార్థిస్తే అన్నీ ఆయనే చూస్తారు**.

డబ్బు నిల్వచేయడ మనేది సాధకుని స్థితి ఏ మెట్టులో ఉంది అనే దాన్ని బట్టి ఉంటుంది. లౌకికులకు ఒక సూత్రం, గృహస్థులకు ఒక సూత్రం, సన్యాసులకు ఒక సూత్రం. మను ధర్మశాస్త్రం సంపాదించి చదువు. బాబా మీద ఉండే విశ్వాసాన్ని బట్టి ఎంత దాచి పెట్టాలి అనేది ఉంటుంది. బాబానే చెపుతారు కదా? నా లాంటి వారి సలహా ఎందుకు? సర్వజ్ఞులైన సాయిని, మాస్టారిని అడగాలి.

**సదోపవాసం చేస్తున్నందుకు చాలా సంతోషం.**

శ్రీ సత్యసాయి గారిని గురించి నీ భావన correct గానే ఉంది. శ్రీ మాష్టారు కూడా అలానే చెప్పేవారు. "నేను సాయిని అనే మాట ఒక్కటి తప్పితే మిగిలిన అన్నింటిలోను వారు మనకు మార్గదర్శకులు అనేవారు.

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

మీ  పె. సుబ్బరామయ్య.

ఇక్కడ మిలిటరీ స్వామి స్వర్గస్తులయ్యారు. సాయినాధుని భక్తులలో మహల్సాపతి, శ్రీ వెంకయ్య స్వామి వారి భక్తులలో పోలిరెడ్డి గారు దేహత్యాగం చేసినట్లు చేశారు. మార్చి 24వ తేది మద్రాసులో తన సొంత రూమ్ లో పదిమంది మిత్రుల ఎదుట వారు ధ్యానం చేస్తూ శరీరం వదిలారు. శ్రీ స్వామివారి కోసం వారు గొలగమూడిలో ఉండేవారు. Latrine, బాత్‌రూం లేదు. ఇంటి గోడలు 4 అడుగులు ఎత్తు. **ఈ కష్టాలన్నీ సంతోషంగా భరించాడు గనుసకే వారికి ఉత్తమంగా శరీరం త్యజించే భాగ్యం కలిగింది.**

పె. సుబ్బరామయ్య.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

పూజ్య గురుబందువులైన లక్ష్మక్క గారికి, చి|| సాయికి శ్రీ స్వామివారి కృప సదా ఉండాలని ప్రార్ధిస్తూ పె. సు. వ్రాయటం. అమ్మా! శరీర అవసరాలకు చాపల్యాలు అని వాటికి చాలా గొప్ప భేదం ఉండి. చాపల్యాలు అంటే రుచిగా ఉందని రోజు తినే కంటే ఎక్కువగా తినటం. తనకు గొప్ప ఆకలి అయినట్లు దొంగ ఆకలి వస్తుంది. అది గుర్తించి ఇది నిజం ఆకలి అయితే ఒక అరగంట ఆగి తింటాను. ప్రస్తుతానికి రోజు తినే పరిమాణం (మోతాదు) తినేశాను. అని తినటం మానెయ్యటం. నేను చక్కర తినినట్లు తినకుండా ఆపెయ్యటం. ఒక అరటి పండు తిని ఆపాలి. మాయ నాదరి చేరకుండా చేయమని ప్రార్ధిస్తూ మాయను కౌగలించుకోకూడదు. అరటి పండ్లు చూస్తే తినేస్తామని అరటిపండ్లే ఇంటికి తేకుండా ఉండటం చాపల్యాలను జయించటం ఎలా

అవుతుంది? తన చుట్టూ బోలెడు అరటి పండ్లు ఉన్నా చూస్తూ కాగితాల వలే, కట్టెల వలె ఆడ పడేసి ఉండగలగాలి. ఉదా: జనక మహారాజు దగ్గర శుక మహర్షి ఉన్నట్లు. మీరెలాగైనా శుకుణ్ణి వంచించి కామోద్రేకుడిని చేయండి అని జనకుడు వేశ్యల్ని పంపాడు. ఆ గదిలో ఎవ్వరూ లేరు, శుకుడు తప్ప. ఆ వేశ్యలు అర్ధ నగ్నంగా నృత్యాలు చేసి శుకుణ్ణి తాకి, లాగి ముద్దుల వర్షం కురిపించినా ఆయన శిల వలే కూర్చున్నారు. అది చాపల్యములు నశించటం. **స్త్రీలకు దూరంగా ఉంటూ సందు దొరికినప్పుడు మానసిక వ్యభిచారం చేయటం కాదు**. అలాంటి బలహీనత ఉంటే అది తీర్చేసుకోవాలి కాని, అలాంటి వాటికి ఎన్నాళ్ళు దూరంగా ఉన్నా మనలోని ఆ వాసనలు నశించవు కదా. వాసనా త్రయము నశించాలి అంటారు. వాసనాత్రయము, ఈషణ త్రయము ఒకటే ననుకుంటాను. లోకవాసన, శాస్త్ర వాసన, ఇంకొక వాసన ఏదో గుర్తు లేదు మీరు చెప్పండి. దారేషణ, ధనేషణ, పుత్రేషణ- **నియమిత కాలంలో స్మరణ కాదు మనకు నిరంతర స్మరణ కావాలి.** నియమిత కాల స్మరణ లౌకికులకు, మనకు ఒకరు అన్నా అనక పోయినా సాధకులమే. సాధనలో ఒకటవ తరగతి కాకున్నా ఇంకా క్రింది తరగతి వాళ్ళమైనా శ్రీ మాష్టారు చెప్పిన నిరంతర స్మరణ ఒక్కటే మనకు శరణ్యం కావాలి. స్మరణ అంటే ఓ దేముడో, ఓ దేముడో అనుకోవటం కాదు అది నామ స్మరణ. భగవత్ స్మరణ , నిరంతర భగవత్ స్మరణ ఉండాలి. కూరలు తరుగుతున్నాము. ఓ గురుదేవా ఈ కూరల రూపంలో శక్తిగా మీరుండి మా లోపలికి వస్తున్నారు. ఆ శక్తీ నీ ఈ శరీరం ద్వారా మీ స్మరణ చేసేందుకు వాడేటట్లు నాకు సహకరించండి. సాయి చెప్పుకొని తరగటం. దోవన నడుస్తున్నాము. ఈ భూమి నీ రూపమే. ఈ శరీరం నడిపించేందుకు అవసరమైన ప్రాణ చలనము మీరే, ఈ ప్రాణ చలనానికి సహకరించు ప్రాణ వాయువు మీరే

అనుకుంటూ **గురుదేవుని దివ్య విలాసాన్ని స్మరించాలంటారు శ్రీ మాష్టారు**. శ్రీ స్వామి వారు దయ తలిస్తే మరొక జాబు వ్రాసేందుకు ప్రయత్నిస్తాను.

<u>నియమము – ఆహార నియమం ఏ రీతి ఉండాలో అది పాటించడానికి మార్గము ఏమో సార్ మాటల్లో:</u>

om

గొలగమూడి

16-07-2001

Dear Sai!

నీ అనుభవాలు చాలా బాగున్నాయి. **Guide గా బాబా ఉండగా ఇక దిగులే లేదు. మనం తెలియక తప్పు చేయాలన్నా చేయనివ్వరు. “మీ ఇష్టం వచ్చినట్లు ఈ దేహాన్ని నడిపించు తండ్రీ” అని హృదయ పూర్వకంగా ప్రార్థిస్తూ ఉండు. మిగతా విషయాలన్నీ వారే చూసుకుంటారు.**

ఒకసారి తీపి పదార్థాలు వదిలేసావు, బాగుంది. ఇక చూచిన దాన్నంతా వదిలేయాలి అనుకోవటం మంచిది కాదు. చూచిన దాన్నంతా తినాలి అనే కోరిక లేకుండా చూచుకో. సదోపవాసిగా ఉండేందుకు ప్రయత్నించు. సదోపవాసి అంటే భోజనానికి, భోజనానికి మధ్య ఏమి తిననివాడు. ఉదయం టిఫిన్ తిన్నాక, మధ్యాహ్నం భోజనం లోపల ఏమి తినక పోవటం. అలాగే మద్యాహ్నం భోజనం, రాత్రి భోజనం మధ్య చాలా లేటుగా నిద్ర పోతావు కనుక ఏదైనా తిన్నా, తాగినా ఒక టైం ప్రకారం తింటూ ఉండు. ఈనాటి కుర్రాళ్ళకు ఫార్మాలిటీ అని, కర్టసి అనీ ప్రతి ఫ్రెండ్ ఆఫర్ చేసింది తీసుకోవటం ఒక ఫ్యాషన్ అయ్యింది. అది నీకు ఉంటే వదులుకో. ఈ మిత్రులెవ్వరూ మనకు గైడ్ గా ఉండి నడిపించలేరు. అంతే కాని చూచిన వాటినల్లా

నియమంగా వదలవద్దు. చూచిన వెంటనే తినాలనే కోరిక లేకుండా చూచుకో. అలా వదలవలసి ఉంటే మన గైడే మనకు చెపుతారు. సందేహం లేదు. వారు చెప్పారంటే వెంట్రుక వాసి తప్పు చేసినా సహించరు. నీప్రార్ధన తోటే All Pervading spirit సంప్రీతుడై, మీ మిత్రుని ల్యాబ్ లో సంగీతం పెట్టకుండా చేసాడంటే ఆ ఒక్క అనుభవం చాలు.

నీ శ్రద్ధనంతా నీ studies మీద కేంద్రీకరించు. సాయి నిర్వహించే విశ్వయజ్ఞంలో నీ పాత్ర ఎవ్వరూ నిర్వహించ లేనంత గొప్పగా నిర్వహించేటట్లు చూచుకో. Gas trouble గాని ఇతరత్రా **ఆరోగ్య విధులు జాగ్రత్తగా చూచుకో. "యుక్తా హార విహారస్య" అన్నదే మనకు guideline.** నేనెప్పుడు ఉపవసించి ఎరుగను. **చదువులో మునిగిపో. అదే ఆయన సేవ. లెక్చరర్ గా ఎన్నో దీపాలను వెలిగించాలంటే మన దగ్గర ఎంతో సరుకు ఉండాలి. మన వంతు మనం కృషి చేస్తుంటే సాయి సహాయం ఎప్పుడూ ఉంటుంది**. నీ letter లో నేను సమాధానం ఇవ్వని అంశాలు ఉంటే మరలా వ్రాయి. Postal envelope పెట్టకుంటే reply ఇవ్వనా?

శ్రీ స్వామి వారి ఆశీస్సులు మీకుండాలని ప్రార్థిస్తూ

పె. సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

25-03-1999

పూజ్యులైన శ్రీమతి G. లక్ష్మక్క గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు.

మీరు వ్రాసిన letter చేరినది. ఎన్నాళ్ళు గా ఉంటున్నారు? ఈ విధంగా నైనా తమరు శ్రీ నాంపల్లిబాబా గారిని దర్శిస్తున్నారు. చాలా సంతోషం. వేసవి సెలవుల్లోనైనా శ్రీ స్వామి వారి దర్శనానికి ఒకసారి గొలగమూడికి రండి. శ్రీ సాయి

మాస్టారు నిలయం చూడవచ్చు. శ్రీ మాస్టర్, శ్రీ సాయి, శ్రీ స్వామి వారి పటాలు పెట్టి అఖండ దీపం ఉంచాము. నిత్యం సాయంత్రం 6.30 నుండి 8.00 వరకు సత్సంగం. చాలా కొద్ది మందితో, ఎవ్వరు రాకుంటే ఇద్దరితో. ఎవ్వరిని పిలవటం లేదు. మిలారేపా చరిత్ర చదువుతున్నాము. అది కాగానే శ్రీ సాయి ప్రభోధామృతం తర్వాత అవధూత భోదామృతం. శ్రీ మాష్టారికి నా మీద ఎంత దయో చూడండి. వారి నిలయాన్ని నిర్మించుకొని నా కోరిక ప్రకారం నా దగ్గరుండి గైడ్ చేస్తున్నారు. కాని నేనే మొద్దుబారి కాలం వృధా చేస్తున్నాను. ఈ మధ్య మూడు రోజులు మూడు సందేశాలిచ్చారు.

**తొలి రోజు – ఇచ్చిన సదవకాశం సద్వినియోగం చేసుకోకుంటే బూడిదై రాలిపోతావు.**

**రెండవ రోజు- మాయ ఎవ్వరిని తనంతట తానుగా అతిక్రమించ నివ్వదు. నీ ప్రత్యేక ప్రయత్నము ద్వారా మాయను అతిక్రమించాలి.**

**3వ సారి - సద్గురువును అక్కిం వెంకటరామిరెడ్డి లాగా వెంబడిస్తే దైవ దర్శనమే గాక భుక్తికి కూడా కొరత లేదు.**

వారు నిత్య సత్యులని తన భక్తుల ఎదుట సర్వత్ర సర్వదా ఉన్నారని, పిలిచి పిలువక ముందే పలుకుతానని పై సందేశాల ద్వారా నిరూపించారు. **వారిని ఏమి కోరకుండా నిరంతరం నాకు తోడుగా ఉండి నన్ను మీ ఇష్ట మెచ్చినట్లు నడపండి. ఏది ముందు కోరాలో ఏది వెనుక కోరాలో తెలియని బుద్ధి హీనుడను అని మాత్రం ప్రార్థన చేస్తున్నాను.**

అక్కయ్యా! ఎంత గొప్ప పుణ్యం చేసినామో గాని మనందరం మాస్టారికి సన్నిహితులము అయినాము. ఇక జన్మకు ఏమి అక్కర లేదు.

**బాబు! ఏ పనైనా సక్రమంగా చేయాలంటే మన చేతిలోని పనిముట్టు IMPLIMENT మంచిదిగా ఉండాలి. అది ఎంత మంచిదైతే మనం పని అంత చక్కగా చేయగల్గుతాము. ఈ శరీరంతో మనం భగవంతునికి సేవ చేసి తరిస్తాము. ఇంజనీరు తన మేధా సంపత్తితో సేవిస్తే కార్మికుడు తన కండ బలంతో సేవిస్తాడు.** ఎక్కువ తక్కువలు లేవు. **గనుక నీవు నీ మెదడుకు మేత బెట్టి చక్కని ఇంజినీరు అయితే నీ ద్వారా దేశము అనబడు దైవ కార్యానికి మంచి సేవ దొరుకుతుంది. గనుక ఇప్పుడు నీవు చేయవలసిన పూజ, ధ్యానం అంతా చదువే.** నీవు ధరించ బోయే IMPLIMENT పరికరాన్ని బాగా పదును పెట్టుకొని చక్కని IMPLIMENT తయారు చేసుకోవాలి. అది భగవంతుడు మనకు నిర్దేశించిన పని. ఆ పని అత్యంత గొప్పగా నెరవేర్చేటట్లు చేయమని శ్రీ నాంపల్లిబాబాగారిని ప్రార్థించు. **సత్ పౌరుడిగా నాకిచ్చిన కార్యాన్ని దేవునకు ఎంతో తృప్తి కలిగేటట్లు నెరవేర్చేటట్లు ఆశీర్వదించమని అడుగు. స్వార్ధం నుండి దూరంగా ఉండి ధర్మాన్ని ఆచరిస్తే లోకంలో పొగడ్తలకు, కీర్తి ప్రతిష్టలకు దూరంగా ఉండే నిగ్రహం ప్రసాదించమని అడుగు. అడగడమే గాక సాధ్యమైనంత వరకు నీ వైపు నుండి హృదయ పూర్వకమైన కృషి చెయ్యి.**

**నీకు ఏ మాత్రం తీరిక ఉన్న నాకు తెలిసిన మాస్టారు అనే పుస్తకం మరల చదివి శత్రు మిత్రుల యెడల సమభావం, మానావమానాలలో సమతుల్యంగా ఎలా ఉండాలో బాగా ఆలోచించి మాష్టారి ఆచరణ ఎలా ఉండేది చూచి నేర్చుకో. చేతికి వచ్చిన ప్రతి పైసాను దుర్వినియోగం చేయకుండా సద్వినియోగం చెయ్యి. శ్రీ బాబాగారి దగ్గరకు పోయినప్పుడల్లా పై ప్రార్థన చెప్పుకొని నిశ్చలంగా బాబా రూపాన్ని ధ్యానిస్తూ వారి సన్నిధిలో సాధ్యమైనంత సేపు ఉండు. వారి సన్నిధిలో మాటలు మాను. అలా చేస్తే వారి సన్నిధి మనకు చక్కగా ఉపయోగ పడుతుంది.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

om

గొలగమూడి

1 – 10-99

పూజ్య గురుబంధువులైన భవానిగారికి, పె.సు. శ్రీ స్వామివారి ఆశీస్సులు తెలుపుతూ వ్రాయడం –

మీరు నాకేమీ బాధకలిగించరు. అప్పుడప్పుడూ లెటర్లు వ్రాయండి. మీ మనసులో బాధంతా వ్రాయండి. వ్రాస్తే కొంత బాధ నివారణవుతుంది. **ఆ లెటరు సమాధి పై ఉంచగానే మీకు కొంత ఊరట కలుగుతుంది.** గనుక వెంటనే సుదీర్ఘంగా విపులంగా ఎన్ని టావులైనా వ్రాయండి. నిదానంగా చదువుతాను. అమ్మగారి ఆరోగ్యం ఇప్పుడెలా ఉంది? మీ ఆరోగ్యం బాగుందా? అమ్మాయి గొంతు బాధ ఎలా ఉంది? అబ్బాయి క్షేమమేనా?

**కష్టాలు అనుగ్రహానికి గుర్తు–ఆచార్య భరద్వాజగారి మాట ఇది.**

**మన ఏవ జగత్సర్వం–మన ఏవ బంధమోక్షయో: అంటే మన కష్టాలకు, మోక్షానికి అంతటికీ మనసే కారణం.**

కుంతీదేవిగారు – ఓకృష్ణా! ఎప్పుడూ కష్టాలే ప్రసాదించు. అప్పుడు ఏమారకుండా నిన్ను స్మరిస్తాను అంటుంది.

మీకు తెరిపి ఇస్తే బాబాను మరచిపోతారని ఎడతెగకుండా, తెరిపి లేకుండా కష్టాలలోనే ముంచేస్తున్నారు. మంచంలో నుండి కదలలేని అమ్మగారిని ప్రతి నిమిషం ఆదర్శంగా తీసుకోండి. వారితో మనం సాటి వస్తామా? అని అనవద్దు. అంతటి గొప్ప ఆపదలో నున్న వారిని గూర్చి ఆలోచిస్తుంటే కొంతైనా ఉరట కలుగుతుంది. ఆమె గారికి ఎవరుండారు. అమ్మ అక్కలు చెల్లెండ్లు, అన్నదమ్ములు అందరూ దూరమయ్యారు. బిడ్డకు పెండ్లి చేసి అత్తగారింటికి పంపింది. నడిమంచంలో కూర్చొని ఉండే ఆమెను ఏమనాలి. ఈ మధ్యలో భక్తుల తగవులు. ఎటు మాట్లాడినా

ఇబ్బందే. ఈ తగవులలో ఆత్మీయులు కొందరు దూరమవడం. అయితే మీ కష్టాలు మీకు గొప్పవే. కానీ మానసికంగా బాధపడ్డా అనుభవించలిసిందే. బాధ పడకుండా సంతోషంగా అనుభవిస్తే పోలా.

**రిక్షా తొక్కాలని నా మొకాన వ్రాసి ఉంది. సంతోషంగా తొక్కితే పోతుంది. అట్లా కాకుంటే ఏడుస్తూనైనా తొక్కాలిసిందే గదా.** మీరు లెటరు విపులంగా బాధంతా వ్రాయండి.

ఆశీస్సులతో

పె.సు.

సుధాకర్, రాజుగారు ఎలా ఉన్నారు? అంతా వ్రాయండి.

## ********* సద్గురు దేవా శరణం శరణం *********

### బలహీనతలగుర్తింపు – తొలగింపు:

OM

గొలగమూడి

04-07-2005

పూజ్య గురు బంధువు లక్ష్మక్క కు నమస్కారములు,

శ్రీ స్వామివారు మనలోని బలహీనతలు బయటికి రప్పించేందుకు ఎలాంటి పరిస్థితులు ఏర్పరుస్తారు చూడండి. ఆ బలహీనత బయటపడనిదే మనకలాంటి బలహీనత ఉందని మనకు తెలియదు. దానిని పోగొట్టుకునే తీవ్ర ప్రయత్నం చేయము. శ్రీ సాయి మాస్టర్ నిలయం కట్టించి నాలోని ఎన్నో బలహీనతలు ఎలా తొలగిస్తున్నారో చూడండి. మొన్న 20 సంవత్సరాల ఎం.బీ.బీ.ఎస్ చదివే అమ్మాయి దీక్ష చేయాలంటే ఉండమన్నాను. ఆమె ప్రవర్తన నచ్చక ఖాళీ చేయమన్నాను. తప్పు చెప్పమన్నది చెప్పాను. ప్రమాణాలు చేస్తానన్నది. మాటకు మాట అరిచేసాను.

అసలు అరవడం ఎందుకు? మెల్లగా తప్పు చెప్పకుండానే ఖాళీ చేయి అంతే. మీ తప్పులు చెప్పేందుకు మేము లేము. మీకు 40 రోజులు ఉంచుతామని రాసి ఇవ్వలేదు అని మెల్లగా చెప్తే పోతుంది కదా.

**"వాక్ పౌరుష్యమేవచ అజ్ఞానం అన్నారు" గీతలో- నాకు పౌరుష వాక్యములు ఆడటం చెడ్డ అలవాటు. దానిని పోగొట్టాలని శ్రీ స్వామివారి తపన.**

ఈ శ్రీ సాయి నిలయం కట్టించి, ఆమె అందులోకి ఆమెను ప్రవేశపెట్టి నా చేత పరుష వాక్యములు అనిపించి, అది తప్పు అని నాకే తెలిపి - అలాంటి సన్నివేశాలు లో శ్రీ స్వామివారు ఎలా ప్రవర్తించారో గుర్తు చేసి- పౌరుష వాక్యములు భవిష్యత్తులో పలుకరాదు అనే నిర్ణయం చేయించారు. **అలాగే ప్రతి వారికి అలాంటి విషమ పరిస్థితులు కలిగిస్తారు. ఆ పరిస్థితులను మనం నేర్పరి అయిన నావికుని వలే ఉపయోగించుకుని మన లోపాలు సరిదిద్దుకోవాలి. మన లోపాలు ఏమిటో తెలియకుంటే కోటికంఠాలతో ఘోషిస్తాడు శ్రీ స్వామి.** శ్రీ స్వామి వారివలే చక్కగా ఆత్మలో బోధ చేయగల వారెవరు లేరని నా నమ్మకం. శ్రీస్వామి వారి కృప ఎప్పుడు సదా మనందరికీ ఉండాలనిప్రార్థిస్తూ.

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

13-11-2002

నీ లెటర్ చేరింది. శ్రీ నాంపల్లి బాబా గారు స్వప్న దర్శనమిచ్చి మాట్లాడారంటే భౌతిక దర్శనంతో సమానమే. తొణుకు బెణుకు లేకుండా భగవంతుడు నీ కిచ్చిన పని చక్కగా చెస్తూ పోవటమే మార్గము. తొందరపడి భగవంతుడు మనకిచ్చిన పని చేయటంలో అశ్రద్ధ చూపకూడదు. ఇంత గొప్ప సృష్టిలో మన పాత్ర మనం చక్కగా నిర్వహించేటట్లు మొదట చూచుకోవాలి. ఆధ్యాత్మికత పేరుతో నేడు జరిగే విశృంఖలత గుర్తుంచుకో. శ్రీ స్వామి వారు నిన్ను సర్వదా కాపాడాలి ప్రార్థిస్తూ.

మీ పె.

సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

3-12-1999

Dear Raja !

శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా మీకుండాలని ప్రార్థన. నీ లెటర్ మొదటి ప్రశ్నకు సమాధానం వ్రాయలేదు. శ్రీ స్వామి వారు మందు తిన్నారంటే కాళ్ళు రావాలనే ఉద్దేశంతో తినాలి. అలా కాళ్ళు తెచ్చుకుంటే ప్రారబ్ధం మిగిలిపోయే ఆస్కార ముంటుంది. కాళ్ళు లేకుండా ఎంతో గొప్ప బాధ అనుభవిస్తే కాని ప్రారబ్ధం పూర్తి కాదు. ప్రారబ్ధం పూర్తికానిదే విశ్వ చైతన్యంతో తాదాత్మ్యం లభించదు. కాళ్ళు పోకముందు అనేక దివ్య లీలలు చేసారు.

అదంతా సిద్ధుల ప్రసక్తితో భగవంతుడు తనకిచ్చిన కార్యాన్ని నిర్వహించడం. విశ్వ చైతన్యంతో తాదాత్మ్యం వహించాలంటే ప్రారబ్ధం సున్నా కావాలి. అందుకే అలా అన్నారనుకుంటాను. ఇంత మందికి వారిని మోసేటటువంటి దివ్యభాగ్యం మనకు లభించదు గదా కాళ్ళు ఉంటే !

ఆశీస్సులతో

పె. సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

ఓం

పూజ్య గురుబందు శ్రీ నాగేశ్వరరావు మాష్టారు గారికి పె.సుబ్బరామయ్య నమస్కారములు. అంతా క్షేమం. మీరు యావన్ మంది శ్రీ  సాయి మాష్టారు దయవల్ల క్షేమమని ఆశిస్తాను.

కాలము ఎంత త్వరగా నడిచి వెళ్ళుతుందో మనమంత త్వరగా మృత్యువుకు సమీపిస్తున్నా మన్న సత్యం మనమందరమూ గుర్తించకున్నా పరమ సత్యం. అందుకే చివటం అమ్మ "ప్రొద్దు గ్రూకుతుంది చెయ్యి చాచండిరా" అనే వారు. దమ్మపేట నివాసులు ఎంతో అదృష్టవంతులు. ఆ మాత్రం నిత్య సత్సంగాలు జరుపుకోగలుగుతున్నరు. మీరు అందులో భాగస్వాములు కావటం అది మీ అదృష్టం. సాయి బాబా 1997 సం|| పక్ష పత్రికలో ఆరాధనాంజలి "నిష్కామ కర్మకు మాష్టారు గారి ఆసిడ్ టెస్టు" అన్న వ్యాసం అందరికి చదివి ఆచరించేందుకు సహకరించ మనవి.

మన అగ్ని హోత్రంలో నిత్యం:

1. సాంబ్రాణి సమర్పించటం చాలా ముఖ్యం. శ్రీ స్వామి వారు "అయ్యా గుండంలో గంటెడు సాంబ్రాణి నిత్యం వేసుకుంటే లెక్క సరిపొద్ధి" అని పదే పదే చెప్పేవారు. గనుక మేము నిత్యం సాంబ్రాణి సమర్పిస్తాము.

2. **సాయి నాధుడు అగ్ని రూపంలో ఉన్నారనే భావన ముఖ్యం.** వారికి నివేదన సమర్పించేటప్పుడు ఆ పదార్ధాలన్ని విస్తరల్లో పెట్టి సమర్పించడము ముఖ్యమట. మనం ఆహారం ఎలా తీసుకుంటామో, అలాగే వారికి నివేదించాలని మాష్టారు గారు చెప్పేవారు. విస్తర లేకుండా మనం భోజనం చేయము గదా. గనుక అలా విస్తరలో పెట్టి అగ్నిహోత్రంలో సమర్పిస్తే మంచిది.

3. **పారాయణతో మాత్రమే తృప్తి చెందక నిత్యం పూజ చేసుకునే విధానం కూడా సత్ సంఘీయులకు అలవాటు చేయ మనవి**. మొదట అష్టొత్తరం తరువాత షోడషోపచార పూజ అలవాటు చేయండి. నేను పూజంటే అంగీకరించకుండా ఉండేవాడను. మాష్టారు నా చేత పూజ చేయించేటట్లు ఉత్సాహపరచి దాని గొప్పదనం వివరించారు. అది మొదలుకొని చేసుకొనే వాణ్ని. ఉత్తమ పుణ్య కర్మలలో దేవ, ద్విజ గురు ప్రాజ్ఞ పూజనం చెప్పబడింది. ఆ పూజ మానసిక, వాచక, కాయక పూజగా ఉంటుంది. కనీసం కాయక పూజ చేస్తుంటే అవతలి మెట్టు ఎక్కుతారు.

**మన కాలాన్ని సద్వినియోగం చేసుకొనే సద్బుద్ధిని సాయినాథుడు మనందరికీ ప్రసాదించాలని ప్రార్థిస్తూ,**

మీ పె. సుబ్బరామయ్య.

శ్రీమతి లక్ష్మక్క గారికి శాస్త్రి గారికి సత్ సంఘీయులందరికి నా నమస్కారములతో శ్రీ స్వామి వారి ఆశీస్సులు తెలుప మనవి.

నమస్తే

**పే.సుబ్బరామయ్య.**

శ్వాసను గమనించుట : అసలు శ్వాసను ఎందుకు గమనించాలి? అలా గమనించేటప్పుడు మనలొ ఎమి జరుగుతుంది? ఇవి తెలుసుకొని చేయడం ముఖ్యం.

శ్వాసను గమనించే ప్రక్రియ యొక్క ముఖ్య ధ్యేయం ఒక్కటే! **ఆలోచనల రూపంలొ నిరంతరం చలించే మనసుకు ఒక ఆలంబన కలిగించి చలించకుండ నిలపడమే ధ్యేయం.** శ్వాస అనేది అన్ని జీవులలొను ఎడ తెరిపి లేకుండా జరిగే క్రియ. ఆలొచన అనేది ఎడ తెరిపి లేకుండా జరిగే క్రియ. ఈ ఆలొచనలకు మన మనస్సు కారణం. కనుక ఈ మనస్సుకు శ్వాసను గనించుట అనే పని కల్పించి ఆ పని ఆలంబన మన మనస్సులొ వేరే ఆలొచన పుట్ట కుండ జాగ్రత్త వహించుతాము. గనుక చంచలమైన మనస్సు ఈ ప్రక్రియ ద్వారా కొంతసేపు చలనము లేకుండా ఆ క్రియలొ నిలపాలి.

అలా నిలపడం కష్టమే. అయితే అప్పుడు కాస్త ఆ మనస్సుకు మన ఇష్టానుసారం (దాని ఇష్టానుసారం కాదు) కొంచెం చలనము ఇస్తాము. కొద్దిగా ఆలొచన కల్పిస్తాము. ఎలా? ఈ శ్వాసక్రియ ఎలా జరుగుతుంది? జీవిలొ ప్రాణముండడంచే జరుగుతుంది. ప్రాణమునకు ఆధారం చైతన్యం. నేను శ్వాసిస్తున్నాను అని మనకు తెలుస్తుంది. అలా తెలిపేదే ఎరుక. గనుక శ్వాసక్రియకు

ప్రాణ చలనము, ఎరుక ఇన్ని ఉన్నాయి గదా. ఇవి అన్ని జీవులలోను ఒకే విధంగా ఉన్నాయి. అయితే మనం దేహ పరిమితులమన్న భ్రాంతి లో ఉండడం చేత ఇతర జీవుల కంటేభిన్నంగా ఉన్నట్లు అనిపించే రాగద్వేషముల కల్గుచున్నాయి. ఓ బాబా నన్ను దేహ పరిమితుడను అనే భ్రాంతి మయ జీవితంనుండి ఉద్ధరించు తండ్రి అని తిరిగి తిరిగి ఆయనను వేధిస్తూ ఉండడం ద్వారా మన మనసులో వేరే ఆలోచనలు కాకుండా కేవలం ఆ ఒక్క ఆలొచనకే పరిమితంగా మన మనస్సు ను నిలిపే ప్రయత్నం చేయాలన్నమాట. అభ్యాసం మీద ఈ వివరణల్లా పోయి గమనించుట అనే ప్రయత్నంలో నిమగ్నమై కొంత వరకు ఆలోచనలు అరికట్టగల్గుతాము.

కోపము:- నిగ్రహించే మార్గము

కోపము కలిగించే కారణమేమి?

**ఒకటి ఇష్టము, అయిష్టము**

**రెండు కావాలి అనే కోరిక**

ఇష్టము, అయిష్టము గాని, కావాలి అనే కోరిక అర్ధరహితాలని నీ వివేకం ద్వారా తెలుస్తుంది.

నిరంతరం మన ధ్యేయం మనకు గుర్తుండాలి. ధ్యేయం ఏమిటి – దుఃఖ రాహిత్యం –అందుకు మనస్సును నిగ్రహించడం అవసరం. మన ప్రస్తుత ప్రయత్నం తోఏమీ మనం పొందే ది లేదని, మనకు ఏమేమి రావాలో ఏమేమి అనుభవం కావాలో ముందే మన ప్రారబ్దాను సారం నిర్ణయించ బడి వున్నాయనని ధృఢంగా విశ్వసించాలి. మనం ప్రయత్నించకుండా కూర్చొన్నా ఆ టైం వచ్చినప్పుడు మన ప్రారబ్ధమే ఆ పని ఆ క్షణంలో చేయించి తీరుతుంది. శ్రీ స్వామి వారి చరిత్ర, సాయి చరిత్ర, మాష్టారు గారి వాక్కులు, వేద వ్యాసు గారి అనుభవమూ (ఇదే).

ఇష్టము అయిష్టము, రాగము ద్వేషముల ద్వారా మనకు క్రొత్త బంధాలు తగులుకోకుండా జాగ్రత్త వహిస్తూ, ఏ విషయంలో నైనాశాంతంగా చెప్పవలసిన ది చెప్పటం. వినకుంటే వారి ఖర్మకు వారిని వదలడం. మనం మంచాన పడితే వాళ్ళు చూడరేమోననే భయం ఉంటుంది, ఒక మూల హృదయంలో.మన ప్రారబ్ధం కొద్ది ఎవరి ద్వారా ఏమి పొందాలో అది తప్పక అనుభవమయి తీరుతుంది. మనం భయపడి మన మార్గం వీడనక్కరలేదు. సత్యాన్ని నిరంతరం గుర్తుంచుకోవాలి.వివేక విచారాలతో రాగద్వేషాలు నిర్మూలించు కోవడం తప్పకోపాన్నిజయించి లొంగదీసు కోవడంవీలే కాదు. (వానితో) రాగ ద్వేషాలు కోపం అంత మేరకు అదుపులోకి రావడం పరమ సత్యం.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

OM

గొలగమూడి

2-9-2005

పూజ్య గురు బంధువులైన శ్రీమతి లక్ష్మక్కగారెకి చి || సాయి కి శ్రీ స్వామి వారి కృప సదా ఉండాలని ప్రార్థిస్తూ పె. సుబ్బరామయ్య వ్రాయటం. శ్రీ సాయినాధుడు సోనాముఖి అనే ఆకు కషాయం త్రాగటం మిరియాలు నూరి కండ్లలో పెట్టుకోవటం మనకు తెలిసిందే. ఇవిగాక ఇంకెన్ని చేసారో మనకు తెలియదు. శ్రీ వెంకయ్య స్వామి వారు తెల్లగడ్డలు కాల్చి కాని ఉడక పెట్టి కాని తినే వారు. కరి వేపాకు పొడి, ధనియాల పొడి తినే వారు. అంత గొప్ప సిద్ధ పురుషులే శరీరాన్ని జాగ్రత్తగా వాడు కొంటున్నారు. ఇక మనమెంత జాగ్రత్తగా చూసుకోవాలో యోచించండి.

నా అనుభవం ఏమిటంటే నా శరీరం బాగా బలహీనమైతే కళ్ళ నీళ్ళు వస్తాయి. నాకు భయం గాను ఆందోళన గాను ఉంటుంది. ఈ లక్షణాలు నాలోకనిపించగానే మావాళ్లుచాలా హుషారుగా ఆహారం పెట్టె విధంగా ప్రక్కన ఉంటుంది. చక్కని మజ్జిగ, పాలు బలవంతంగా తినిపిస్తుంది. ద్రాక్ష నెల్లూరు నుండి తెప్పించి తినకుంటే బలవంతంగా తినిపిస్తుంది. శరీరం కొంచం బలం పుంజుకుంటే నాకు కళ్ళ నీరు కారడం, భయము, ఆందోళనగా ఉండే లక్షణాలు పోతాయి. గనుక ఈ శరీరం చాలా తుచ్ఛమైనది, మాంసం, ఎముకలు ఇంతే గదా అని లక్ష చెప్పినా **మనం సాధన చేసి తరించే నావ అదే గనుక శరీరాన్ని చాలా జాగ్రత్తగా చూసుకోవాలి**.అతి వృష్టి, అనావృష్టి పనికి రాదు. రాజస,తమోగుణాలు ఆహారం వల్ల రావు. మనసు వల్లనే వస్తాయి. శ్రీకాళహస్తి స్వామి పచ్చి మాంసం తినే వాడు. క్రీస్తు కాని, మహమద్ గాని పచ్చి మాంసం తినలేదా ? వారు తమో గుణంచే బ్రష్టులయ్యారా ? మనం **తినే సాత్విక ఆహారమే తగినంత** తినాలి.అది తినకుండా ఉంటే మీరు సాయి కి ఏమి సహాయం చేయ గలుగుతారు ?

పె. సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి,

27-8-05

పూజ్య గురు బంధువులైన లక్ష్మక్క గారికి చి||సాయికి శ్రీ స్వామివారి ఆశీస్సులు సదా కలుగవలెనని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం. **శ్రీ స్వామివారి అడుగుజాడలలో గానీ శ్రీ మాస్టారి అడుగుజాడలలో కానీ శ్రీ సాయీశుని మార్గములో మనం సంపూర్ణంగా నడవలేకపోయినా ఫరవాలేదు. నడిచేందుకు తీవ్ర ప్రయత్నమైనను చేయాలి. తీవ్ర ప్రయత్నం కూడా చేయలేకున్నామంటే ఆ**

**మహనీయులు అంగీకరిచరు.** వారేమి మనలను మితిమీరిన కష్టం చేయమనడం లేదు. మనస్సంతా వారి కర్పించమనడమూ లేదు. **ప్రతి నిత్యము కొంతకాలం వదలకుండా నామం చేయమనుచున్నారు. అన్నం బయట పెట్టేటప్పుడు మన కృతజ్ఞతా భావం ఎంత తీవ్రంగా హృదయ స్పందనతో ఉంటుందో చూచుకోమన్నారు.** ఈ విషయంలో 2సం|| క్రిందటి నా భావనకు నేడు నా భావనకు చాలా భేదముంది. నేను శారీరక బలములో చాలా బలహీనుడనయ్యాను. కానీ నా భావనలో చాలా మార్పు వచ్చింది. మంచినీళ్ళు త్రాగుతుంటే పంచ భూతాత్మ స్వరూపాయ నమః అనే మాట రోజులో ఎన్నిమార్లు త్రాగితే అన్ని మార్లు గుర్తు రావడం ఎంత విచిత్రమో గదా!

మందిరం వాళ్ళు పూజ చేయవద్దు అంటే ఇంతకు ముందు వాదనకు దిగేవాణ్ని. కానీ నేడు అంతయూ మన మేలునకే. **శ్రీ స్వామి సర్వ సమర్థులు గనుక ఇది నా మంచికే అనే భావన చెదరకుండా ఉంది.** ఇది నాకే విచిత్రంగా ఉంది. ఇది ప్రతి ఒక్కరికీ వర్తిస్తుంది. సప్త సముద్రాల అవతల ఉన్నా నిన్ను కాపాడుతానని సాయికి వారి గురువు చెప్పినా సాయికి కష్టాలు తప్పాయా. కుస్తీలో ఓడిపోయి ఊరి వెలుపల ఉన్నాడు. అందరూ తెచ్చుకునే నీటి తొట్టిలో తన డబ్బాను ముంచనివ్వలేదు. అంతటి మహానీయునే చంపాలని కర్ర ఎత్తాడు. వెలుగులోకి రాని ఇంకెన్ని బాధలు పడ్డాడో. ఆ పూటకు బియ్యం లేవు. ఇంటి బాడుగ కట్టగలడా. భార్య వైద్యానికెట్లా? వచ్చే అతిథులనేమి చేయాలి. కులభ్రష్టుడని వెలివేయడం, తన సొమ్ము తిన్నవారే తనపై దుమ్మెత్తి పోయడం. వారికే తప్పనివి మనకు తప్పవు గదా? **అంతయూ మన మంచికే.**

## ********* సద్గురు దేవా శరణం శరణం *********

# సంపన్నత్వం - సద్గురుసేవ

Dear Sai !

శ్రీస్వామివారు ప్రేమించిన శిష్యులు-పోలిరెడ్డి, జాతకాల రామానాయుడు, రోశిరెడ్డి, వక్కెమ్మ, తులసమ్మ వీళ్ళందరిని ఎందుకు ఎక్కువగా ప్రేమించారు? వారియొక్క కఠోర నియమపాలన, రెండవది శ్రీస్వామివారి ఆజ్ఞను ఎంత కష్టమైనా ఆచరించడం. నేను వారి ఆజ్ఞలను కఠోర నియమ పాలనగా పాటించలేదని సామదాన భేదదండోపాయాలు నాపైన ప్రయోగించారు. మొదట చిన్న తప్పయినాతప్పేనని చెప్పారు. ఆతర్వాత స్వప్నాల ద్వారా బెదిరించారు. అప్పటికీ వినకుంటే విపరీతంగా ఆయాసం పెట్టారు. అంతేగాక నాతప్పేమిటని అడిగితే నీకు కఠోరనియమపాలన లేదని చెప్పారు. ఆతర్వాత మరలా చాపల్యములు నశించనదే వెయ్యిసంవత్సరాలు తపస్సు చేసినా ఉన్నచోటనే ఉంటావని చెప్పారు. అది వారి అనంత కరుణకు నిదర్శనం. జిహ్వకు లొంగితే ఏ పని చేయాలనే బుద్ధి పుట్టదు. మనస్సు చేయమన్న పనిమీద ఉండక అన్యచింతలకు లోనవుతుంది.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## గురుసేవకు మానసిక సాధన : checklist

om

గొలగమూడి

22 – 5 – 05

Dear Sai !

సద్గురువు లభించగానే అంతా అయిపోయినట్లు కాదు. వారు చెప్పింది చేయాలి . అలా చేసేందుకు మాయ పొంచి ఉండి ఎప్పుడూ మనలను చేయనీయకుండా అడ్డు

పడుతుంది. మాయకు లోబడినవాడు మానవుడే కాదురా అన్నారు. అంటే మానవుడకంటే హీనుడని అర్థం.

శ్రీ జ్ఞానేశ్వర్ మహారాజ్ చెప్పిన మాటలు గుర్తుంచుకో.

**దైవీ హ్యేషా గుణమయీ మమమాయా దురత్యయా**

**మామేవయే ప్రపద్యన్తే మయా మేతం తరంతితే.**

**సద్గురువనెడి మంచి నౌక లభించినవారు :**

1. **అనుభవమ నె డి కౌపీనము ను బిగించి**
2. **అహంకారమను మిక్కుటమను బరువును పారవైచి**
3. **సంకల్పములు, వికల్పములనెడి అలల నుండి తప్పించుకుని**
4. **విషయాసక్తి అనెడు తీవ్రమైన వానదెబ్బ నుండి కాపాడుకుని**
5. **ఆత్మబోధ యనెడు బల్ల కట్టునందుకుని**
6. **వైరాగ్యమనెడు చేతులతో నెట్టుకొనుచు**
7. **శ్రద్ధా, సామర్థ్యము ల పై తేలుచూ**

నన్ను పొందగలరు.

పై ఏడు అంశము ల ద్వారా మనము శ్రద్ధ తో కృషి చేస్తూ ఉంటే తప్పవారి కృప మనకు కల్గదు. **పిచ్చి ప్రార్థనలు లక్ష చేసినా అవి గాలికి పోతాయి. మనం శ్రద్ధతో చేసిన కృషే లెక్కలోనికి వస్తుంది.**

మొట్టమొదటనే నీ అనుభవాన్ని చూచుకుని ప్రవర్తించమంటారు. ఏది తింటే ఏమైంది, ఎంత తింటే ఏమైంది, ఏది తిన్నప్పుడు చదువు బాగాసాగింది. ఎంత తింటే మనం హుషారుగా ఉండగలిగాము అనేవన్నీ అనుభవం ద్వారా తెలుసుకుని ఆచరించు. కఠోర నియమ పాలన చేయమంటారు. చాపల్యంబులు నసించనిదే వెయ్యి జన్మలైనా మనం

అక్కడనే ఉంటామో ఇంకా దిగజారుతుంటామో తెలియదు. మిగతా విషయాలన్నీ వదిలేసి మనకు శ్రీ స్వామి వారిచ్చిన పనిమీద మనదృష్టంతా పెట్టాలి .

శ్రీ స్వామివారి ఆశీస్సులతో

పె.సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

8-9-2005

పూజ్య గురుబంధువులైన శ్రీమతి లక్ష్మక్కగారికి, చి॥ సాయికి శ్రీస్వామి వారి కృప సదా ఉండాలని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం.

శ్రీ మాష్టరు గారు చెప్పిన మాటలు ఒక్కొక్కటి గుర్తించి వాటియొక్క అర్థం ఎంత లోతుగా గొప్పగా ఉందో మనసుకు అందే కొద్దీ వారిపై గౌరవభావం ఎంతగానో పెరుగుతుంది. నాకు ధ్యానం చేసే విధానం చెప్పండి అంటే దానితో ఇప్పుడు నీకేం పని అన్నారు. అదేంటి సార్ అందరికీ చెపుతున్నారు కదా అంటే వాళ్ళంతా గజస్నానం చేస్తారు నీవూ చేస్తావా? అన్నారు. గజ స్నానమంటే ఏనుగు స్నానమని వివరించారు. ఈ విషయాన్ని భగవద్గీత లో ఒక శ్లోకం వర్ణిస్తుంది .

రాగద్వేషవియుక్తైస్తువిషయానింద్రియైశ్చరన్|

ఆత్మవశ్యైర్విధేయాత్మా ప్రసాద మధిగచ్ఛతి.॥2-62శ్లో॥

**రాగము, ద్వేషము, అసూయ, మదమాత్సర్యంబులు ఆదిగా గల సర్వ అంతః శత్రువులు వదిలి , ఇంద్రియములు విషయముల వెంట పరుగిడకుండా ఉన్నప్పుడు ఆత్మజ్ఞానము కలిగి ప్రసాదము లభించును .**

గనుక మనం ధ్యానం చేయడం ముఖ్యముకాదు. రాగ ద్వేషములు, ఇంద్రియ నిగ్రహమే మన ధ్యేయము కావాలి. రాగద్వేషములు లేక ఇంద్రియ నిగ్రహము

గల్గినపుడు స్వతస్సిద్ధము గానే మనస్సు ధ్యానస్థమగును. మన ప్రయత్నమే ఉండదు. **జరిగే నాటకాన్ని మనం సాక్షిగా చూస్తుండటమే. నాటకంతో తాదాత్మ్యం చెంది రాగాద్వేషాల వలయంలో చిక్కరాదు.**

శరీరం అనే బండికి కావలసిన ఇంధనము సప్లైచేయకుండా ఉంటే శరీరము సరిగా పని చేయదు. దానివల్ల కొన్ని క్రొత్త సమస్యలు వస్తాయి. అందుకే ఆధ్యాత్మిక సాధన కత్తి మీద సాధన అన్నారు. **ఇంద్రియలోలత లేకుండా శరీర అవసరాలను తీరుస్తుండాలి. ఏమరుపాటులేకుండా ఆ దివ్యపురుషుని స్మరణతో వారికి సమర్పించబడిన ప్రసాదాన్ని స్వీకరిస్తూ –ఋణానుబంధాలు, కర్తవ్యాలు తీరుస్తుంటే గట్టెక్కగలుగుతాము.**

శ్రీస్వామివారి ఆశీస్సులుండాలని ప్రార్థిస్తూ,

పె.సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

6-4-1997

పుజ్య గురు బంధువులైన శ్రీమతి లక్ష్మక్క గారికి నమస్కారములు. మీరుపంపిన ఉపాసనా  క్రమము మరియు నాగేశ్వరరావుగారి, మీ వ్యాసాలు అందినవి. చాలా సంతోషము ఉపాసనా క్రమం ప్రకారం నిత్య కృత్యాలు జరుపుతూ పొతే క్రమ ముక్తి ఈ జీవితం లోనే సాధ్యమతుంది. కేవల శ్రద్ధతో ఆచరించడ ముక్కట్టే మనకు కావలసినది. భగవంతుడు ఎంతో కరుణతో మానవాళి మధ్యకు మహనీయ మూర్తి అయిన శ్రీ మాస్టారుగారిని పంపి భగవంతుని సందేశం వెదజల్లినారు. దానిని ఉపయోగించుకొని కృతార్థుల మవడం మన వంతు గదా.

పూజ్య శ్రీ మాష్టారు గారు ఒకరోజు నాతో "సుబ్బరామయ్య నా నోటిగుండా వచ్చిన ప్రతిమాట వ్రాసి పెట్టుకో" future లో పనికొస్తా యని సెలవిచ్చారు. అజ్ఞానమనే చిమ్మ చీకటిలో నున్న నాకు ఆ మాటలలోతు ఇప్పుడు వలె అప్పుడు తెలియలేదు. కాని మాష్టారు గారంటే ఉండే గౌరవమూ అభిమానముననుసరించి వారి మాటలు అదే రోజు ఎప్పుడో మూడ్ వచ్చినప్పుడు ఏకాగితం మీదనంటే అక్కడ వ్రాసుకునే వాణ్ణి అలా వ్రాసిన కాగితాలు 1979 నాటి పెండ్లిపత్రిక ఒకటి మొన్న వారిలీలగా ఒక పుస్తకంలో దొరికింది. అందలి అమృతాన్ని గ్రోలి ఆనందిద్దాము.

1.తప్పు చేసిన వానిని క్షమించాలి. ఎప్పుడు? తప్పు ఒప్పుకుంటే.

2. సుఖ, దు:ఖాలను సమభావంతో తీసుకోవాలి. బ్యాంకు లోని పైకం తీసి అప్పుల వాళ్లకు అప్ప చెల్లిస్తుంటే భాదెందుకు?

3. రాళ్ళతో కొడితే ఓర్చుకోవాలి, క్రీస్తు వలె ఎప్పుడు నిర్దోషిగా ఉంటూ.

4. అనేక జన్మల బాకీలే మన చుట్టు పక్కల పరిస్థితులు, మన ఆశ్రితులు, బంధువులరూపంలో మనకు కలిగే అనుభవాలు. ఆ బాకీలు తీరిపోగానే మనుషులు మారి మన పట్ల మార్పు చూపిస్తారు.

5. "ధర్మేచ, అర్థేచ, కామేచ నాతిచరామి" అని పెండ్లి నాడు అగ్ని సాక్షిగా ప్రమాణం చేసాము. ఇందుకు భిన్నముగా నాది అని భార్యను వదలి అనుభవించరాదు. ((మాష్టారు) ఒకరి పెండ్లి లో విస్తర లోని పదార్థాలు ఎంతో స్వల్పంగా తాకి వదలి పెట్టారు. ఆ సందర్భంలో నేనడిగితే చెప్పారు.)

6. పూర్వం స్త్రీలకు కూడా యజ్ఞ యాగాదుల యందు నిర్వహణలో భాగం ఉండేది. కాని division of labour వల్లకొన్ని పనులు భార్యకు, కొన్ని పనులు భర్తకు సంక్రమించాయి. అదే జంధ్యము, తాళి. ఆ యజ్ఞమే స్త్రీలు నిర్వహించే వంట. వంట

కాగానే కొంత అన్నం కూర అగ్నికి సమర్పిస్తుంటారు (మా తల్లిగారు అలా అగ్నికి (పొయ్యిలో) సమర్పించడం నా కళ్ళారా చూచాను.).

7. గురు సేవ:- వారు తప్ప నాకన్యం లేదు అని శరణాగతి హృదయపూర్వకం గా చేసి సేవించాలి.

8. పరమ వైరాగ్యము:- గురువును వదలి శిష్యుడు తన ఏర్పాట్లను తాను చేసుకోకూడదు. అధికంగా అనుభవిస్తే రాబోయే కాలంలోని మన వసతులను ముందుగా అనుభవిస్తున్నా మన్న మాట.

9. రక్షించేది చంపేది మన ధర్మము, మన పుణ్యమే కాని మన డబ్బు, బంగారం కాదు.

10. Deception of our previous Janmas makes the good people also to deceive us.

11. King living like a fakir is a Mahatma.Give away to needy in the name of God.

12. రక్షణ ధర్మంలో ఉన్నది కాని వస్తువులలో కాదు. అందుకే ఒక్కొక్క సారి డబ్బు ఉన్నా రోగం నయం కాదు.

ఈ పాత పెండ్లి పత్రికపై వ్రాసిన ఈ అమృతవాక్కుల్ని నాకు లభించడమే మాష్టారి గారి కృపగా భావిస్తున్నాను. (హృదయపూర్వకంగా) ఇందులో 4 వ సూక్తి నా పరిస్థితి ని అద్దం పట్టి చూపించింది. కొంతమంది పుస్తక ప్రచురణకు వడ్డీ లేకుండా డబ్బిస్తామని సమయానికి తప్పుకున్నారు. మరికొంత మంది తప్పుచేస్తూ కమిటి మెంబరుగా అలా చేయకూడదని నేను చెప్పినందున నా కెన్నో విధాల కీడు చేసారు. వాటిని మనం బాహ్యంగా ఓర్పు వహించినా ఆయా వ్యక్తులు కంటపడ్డప్పుడు నా మనస్సులో మాత్రం వారు తప్పుడు మనుషులు అనే

భావన పోయేది కాదు. అలా భావించడం సాధనా పరంగా తప్పని ఈ పెండ్లి పత్రిక చూచేదాకా నాకు తోచలేదు. మనం పూర్వం వారికి చేసినదే ఈ రోజు వారి నుండి మనకు అనుభవమౌతుంది. అలాంటప్పుడు వారిని మన మనసులో చెడ్డగా భావించడం తప్పు గదా. బాబా చెప్పినట్లు శతృత్వం (కు)ఋణం చెల్లించక తీరదు గదా. మరు జన్మకు నేను చెన్నబసప్ప, వీరభద్రప్పల వలె ఉండడం తథ్యం. "ధ్యాసలేకుండా గడిపిన క్షణాలలోని మనో వికారాలు జన్మపరంపరలు పెంచుతుంది". కనుక ఆ మనో వికారాలను వారి కృపతో నిర్మూలించుకోకుంటే రాగద్వేషాల వలలో తప్పక పడుతాము. ఈ letter చదివి అర్థం చేసుకునే భాగ్యం శ్రీ సాయి మాష్టారే నాకు మీకు కల్పిస్తారు. **లేకుంటే ఆయా భావాలు అర్థమవడం వేరు. హృదయగతమవడం వేరు.** అప్పుడు మనం సాధన అనుకునే అంశమే మనకుశత్రువు అవుతుంది.

నమస్కారములతో

పెసల సుబ్బరామయ్య

ఇందలి రెండవ సూక్తిలో చెప్పిన విషయానికి శ్రీ మాష్టారు గారే ఉదాహరణగా ఉంటారు. వారు సుఖదుఃఖాలను ఎలా సమభావంతో తీసుకున్నారో చూచిన వారికే తెలుస్తుంది.

నమస్తే.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

11-7-2000

పూజ్య గురుబంధువులైన K. భవాని గారికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు కలుగవలెనని ప్రార్థిస్తూ పె.సు. వ్రాయడం. మీరు పంపిన 21 రూ M.O. అందింది. దేనికైనది వ్రాయలేదు తెలుపవలసినది.

అంతకు ముందు వ్రాసిన letter అందినది. మీ బాధ అర్ధమయింది. మీ బాధను శ్రీ మాష్టారు గారు తీర్చ వలసిందేగానీ మానవుల వల్ల కాదు.

మా లాంటి వాళ్ళము ఎన్నయినా చెబుతుంటాము. అనుభవించే మీకు సాధక బాధకాలు మానసిక బాధ తెలుస్తుంటాయి. అయితే మీకు శాశ్వతంగా హృదయంలో (విశ్వాసం) ఎందుకు నిలవడం లేదో అది సాయికే తెలుస్తుంది.

మీరు మీ బిడ్డల భవిష్యత్తు తలచుకొని అంతగా ఎందుకు బాధ పడి పోతారు? మా వాళ్ళంతా ఉన్నత స్థాయిలో ఉంటే నా బిడ్డలు తక్కువ స్థాయిలో ఉంటే నే నెట్లా సహించగలను అంటారు. మీరిచ్చిందే మీ బిడ్డలకు ఉంటుందా? అంతకంటే గొప్ప వాళ్ళు కాకూడదా! మా అమ్మ ప్రతి పూట వడ్లు దంచి మమ్ములను చాకింది. కట్టెలు ఆమే తెచ్చుకొని వంట చేయాలి. మరి ఈ రోజు మేము ఏమి చేయకుండా నెలకు నాలుగు వేల పెంక్షన్ తో జీవిస్తున్నాము. మేము ఇలా జీవిస్తామని ఆమె అనుకున్నదా? ఆమె ఎప్పుడూ మా భవిష్యతును గూర్చి తలంచనే లేదు. మా చేత గొడ్డు చాకిరి చేయించేది. ఉద్యోగం చేసేటప్పుడు కూడ ఆమె గడ్డి తెచ్చి బర్రెలు మేపుతూ నన్ను తెమ్మని చెప్పి తెప్పించేది. తల్లి మాట కాదనలేక వెళ్లి తెచ్చేవాడిని. అసలు భవిష్యత్తును గూర్చి తలంచడం సాయి భక్తులకు పనికే రాదు. I.A.S. చదివిన మాష్టారు గారికి ఉద్యోగం పోయిన క్రొత్తలో అన్నానికి కష్టమైంది. **ఆయన మరు పూటకు అన్నం ఎట్లాగా అని యోచించలేదు. సాయియే అన్ని సమకూర్చారు. అందరికి ఆయనే పెడతాడు. మనమంతా ఆయన బిడ్డలమే కదా? మనకు కష్టమయితే వారికి కష్టం లేదా!**

**అసలు సాయికి పగ్గాలప్పగించాక చింతకు తావేలేదు.**

**బిడ్డల ఆరోగ్యం బాగా ఉండాలని సాయిని ప్రార్థించాలి. అంతే కాని సిరి సంపదలు కాదు. వాళ్ళ ప్రవర్తన చక్కగా ఉండాలని ప్రార్థించు. అంతే గాని వారికి ప్రారబ్ధంలో లేనివి సమకూర్చమని అడుగ రాదు. ప్రారబ్ధంలో ఉండేవి రాక తప్పవు.**

మరలా వ్రాస్తున్నాను మనకంటే క్రింద తరగతిలో తిన తిండి, ఉండ గూడు, కట్టు బట్ట లేని వారిని గూర్చి చింతించి మనం తృప్తిగా ఇంత వరకైనా ఉన్నామని తృప్తి పడాలి.

మాష్టారు గారి జీవిత మంతా మనకు నేర్పే గొప్ప పాఠం అదే. కాలేజీ లెక్చరర్ గా ఉండి రాత్రి మిగిలిన అన్నంలో పాలు పోసి తోడు పెట్టి యర్రగడ్డలు తరిగి వేసి, టిఫిన్ కు బదులు తినేవాడు. అలా మిగిలిన డబ్బంతా ఇతరుల కొరకు ఉపయోగించే వాడు. **మనం అలాగే ఇతరుల కొరకు శ్రమిస్తే సాయి ఆనందిస్తాడు. మన వారే బాగు పడాలని చింతిస్తుండడం స్వార్ధం అవుతుంది.** మరు పూట, మరు రోజును గూర్చి చింతించకుండా కాలం గడపటం గొప్ప సాధన.

**గతాన్ని గూర్చి చింతించకు, రేపటి గురించి మరుక్షణం ప్లాస్ వేయ వద్దు. ఈ క్షణంలో నివసించు అన్నారు. మాస్టారు గారు " కష్టాలు గూడా అనుగ్రహానికి గుర్తు" అన్న మాష్టారు గారి మాటలు మీద విశ్వాస ముంచి జీవిత యాత్ర సాగించండి.**

**మనకు చింత భయము, ఆందోళన ఉన్నాయంటే సాయి మీద విశ్వాసము లేనట్లే అన్నారు మాష్టారు గారు. అది అక్షరాల నిజం.**

ఎంత భాగ్యవంతుడైన తినేది అన్నమే గదా? కడుపు నిండినాక బంగారు పెడతానన్నా తినలేడు. నా బిడ్డలకు అన్న వస్త్రాలకు లోటు చేయను అని హామీ ఇచ్చారు. ఇక తక్కిన వన్ని లేకున్నా ఏమి పరవలేదు!

**బాబాను చింతించే మనస్సు ఉంటే అంతా ఆనందమే.**

ప్రక్క గ్రామంలో ఆరతులప్పుడు గంటలు కొడుతున్నారని, సాయి ఆరతుల్లో వారి మందిరం ముందు డోలు, భాజంత్రీలు ఉన్నాయని వ్రాసారు గదా. డోలు, భాజంత్రీలు ఉంటే అవి లయ బద్దంగా మనం పాడే పాటకు అనుగుణంగా మ్రోగిస్తారు గాని ఇష్ట మొచ్చినట్లు గంటలు కొట్టినట్లు ఉంటాయా! గంటలు కొట్టేవాళ్ళు పాపం ముటగట్టు కుంటారని నేను వ్రాసినట్లు చెప్పు. షిరిడి, శ్రీ వెంకయ్యస్వామి ఇతర మహాత్ములు మందిరాలలో లేనిది ఆ మందిరములోనే చేస్తే గొప్ప అవుతుందని వాళ్ళ భావమయి ఉంటుంది. ఆరతి సమయంలో గంటలు కొట్టవద్దని చెప్పండి. అంటే

ఆరతి జరిగేటప్పుడు ఆరతి ముందు ఐదు దెబ్బలు కొట్టి ఆరతి మొదలు పెట్టబోతున్నట్లు దూరములో ఉన్న వాళ్లకు తెలుపడ మన్నమాట. ఆరతి జరిగినంత సేపు ఎవరో ఒకరు అప్పుడప్పుడూ కొట్టడం తప్పు.

శ్రీ స్వామి మీకు చింతలు లేకుండా చేయాలని ప్రార్థిస్తున్నాను. **ఆలోచన రాకుండా నిరంతరం మనసు మీద ధ్యాసను ఉంచటమే. ఏ ఆలోచన లేకుండా ఉండాలని (శ్రద్ధకు) ఏమరు పాటు లేకుండా ఉండడమే.**

**ఆధ్యాత్మిక బాటలో శక్తినంతా వినియోగించి కృషి చేస్తే గాని ఫలితముండదు. ఎన్ని అపవాదు లొచ్చినా ధైర్యంగా నిలిచినప్పుడే సాయి పై మన విశ్వాసం ధృఢంగా ఉన్నట్లు గుర్తు అది మరువవద్దు.**

మీకు శాంతి ప్రసాదించమని శ్రీ స్వామి వారిని ప్రార్థిస్తూ

మీ పె.సుబ్బరామయ్య.

**1. ఏదో జీవులకు ఉపకారం చేసేది చేస్తూనే ఉన్నాము. ఆ జీవి రూపంలో సాయియే ఉన్నారన్న తీవ్ర ఎరుకతో చేస్తే అనంతమైన పుణ్యం వస్తుంది.** అన్ని జీవులలో వెంకయ్య ఉన్నాడని వ్రాసుకోయ్యా అన్నారు శ్రీ స్వామి వారు. ఏ ప్రాణిని ఆదరించినా నన్నే ఆదరించినట్లు అన్నారు సాయి. **అంతకంటే గూడా త్రికరణ శుద్దిగల నామ జపం గొప్ప పుణ్య కార్యం. మీ కష్టాలను తలచుకొని బాధపడే దాని కంటే వాటినే ఆధారంగా చేసుకొని బాబాను స్మరించి ఈ ఊబిలో నుండి బయట పడే తీవ్ర ప్రయత్నం చేయండి. మీరు మీ బిడ్డలకు చక్కని సంస్కారాలు, అలవాట్లు నేర్పించే ప్రయత్నం చేయండి. ఆస్తి పాస్తులు ఇవ్వలేక పోతున్నామనే చింత పూర్తిగా వదలండి.** ఏ జీవికి ఎప్పుడు ఏమి రావాలో అవి వచ్చి తీరుతాయి. మనం ఇచ్చినవి వారికి సంతృప్తినిస్తాయా? **మానవుడిచ్చింది నిలువదు భగవంతుడు ఇచ్చింది తరగదు అన్న సాయి మాట మరువకండి.**

2. మానవుడు తరించాలంటే, కష్టాలే గొప్ప వరాలంటారు మాష్టారు. **కష్టాలు వచ్చినప్పుడు అందరూ ఏడుస్తూ కూర్చుంటారట. చక్కని గురు భక్తుడు ఆ కష్టాలనే**

**తనకు సద్గురువు అనుగ్రహించిన వరాలని తలచి వాటి వల్ల అనుక్షణం దైవ స్మరణ మరువకుండా సాగించి ముక్తి పొందుతారు అంటారు మాష్టారు**. వారలా చేసారు. మనలను అలాగే చేయమంటారు.

3. శ్రీ స్వామి వారి దగ్గర ఉండాలంటే మీకు ఇబ్బందే లేదు. ఇప్పుడు శ్రీ సాయి మాష్టారు నిలయంలో అలమరాలు తలుపులు పెట్టాము. మీరు రెండు తీసుకొని వాటిలో మీ సామాను భద్ర పరుచుకోవచ్చు.

4. నీ మీద అపవాదులు వేసారన్నారు. అదంతా మీ మంచికే సాయి అలా చేయిస్తున్నారు. **నిరపరాధులను దూషిస్తే దూషించిన వారి పుణ్యం దూషణకు గురైన వారికి వస్తుందట.** దూషణ అనుభవించిన వారి పాపం దూషించిన వారు తీసుకుంటారట. ఇది నూటికి నూరు పాళ్ళు సత్యం. (వార్తాలాపం).

5. మందిరంలో సేవ చేసే ఆమెకు బాబా డబ్బు ఇచ్చేందుకు ఎవరూ ఆక్షేపణ చెప్పకూడదు. బాబా డబ్బు లేకుంటే మనమైనా కాస్త వేసుకొని ఇవ్వాలి. తప్పక ఆమెకు ఇవ్వండి. నా వాటా గా 50 రు || పుస్తకాల డబ్బు లో తీసి ఇవ్వండి.

6. మీరు, త్వమేవ మాతాచ, పితా త్వమేవ అనే శ్లోకం మరచి పోవద్దు. నీవు చుసేదంతా కలసి నేనే అనే బాబా మాట ఆచరణలో పెట్టండి. మీకు కష్టాలు కలిగించే వారి ఎడల ఎలాంటి ద్వేష భావము రాకుండా చూసుకోండి. పైకి కాదు. అంతరాత్మలో మీ మనసు మీకు సాక్షి. బాబా నా ప్రారబ్ధం త్వరగా పూర్తి అయ్యేటట్లు చేయ కూడదా ? నాకు శాంతి, తృప్తి, ఆనందం ఈ జీవితంలో ఎప్పుడు చూపుతారు అని మాత్రమే ప్రార్థించండి.

7. ఇది చేయండి అది చేయండి అని అడగటం దండుగ. నా కేది మంచిదో అది నాకంటే మీకే బాగా తెలుసు. నా మంచిని కోరే ఓ దేవా ! నిన్నే నేను శరణు పొంది నీ ఆజ్ఞలను పాటించేటట్లు చేయండి అని ప్రార్థన చేస్తూ నిత్యం 108 ప్రదక్షిణలైన మందిరంలో కుదరకుంటే ఇంట్లో నైన చేస్తుండండి. కుర్చీలో పటం పెట్టి ఇంట్లో అయితే ఒక అరగంట టైం పెట్టుకోండి.

శ్రీ స్వామి వారి కృప సదా మీ కుండాలని ప్రార్థిస్తూ

మీ. పె. సు.

********* సద్గురు దేవా శరణం శరణం *********

# శరణాగతి

## సార్ సందేశం:

**అసలు బాబాను నీవు పట్టుకున్నావని అనుకుంటున్నావు గాని (అది వట్టిదే !) పట్టుకోవడమంటే హారతులు, సత్సంగాలు మాత్రమేనా? కష్టాలలో మనసు బాధ పడకుండా ఈ కష్టాల ద్వారా మన గత కర్మలు కడిగేస్తునారు అని తలచి నిశ్చింతగా ఉండటమే! సర్వస్య శరణాగతి చేసి మనసులో బాధ లేకుండా ఉండటం నేర్చుకోండి. కష్టాలలోను, సుఖాలలోను సములై సర్వత్రా భగవంతుణ్ణి చూడాలనే భగవద్గీతాది గ్రంధాలన్నీ చెప్పేది.**

*********** సద్గురు దేవా శరణం శరణం *********

### విశ్వాసం- ఆహార నియమం – ఇంద్రియ(అ) చాపల్యాలు – శరణాగతి:

ఓం

గొలగమూడి

24-11-03

Dear Sai,

1. Mental గా enlightenment – శరణాగతి, తర్వాత దిగ జారి ఆసక్తులవటం ఎందుకు జరుగుతుంది ?

   **శరణాగతి అనేది ఒక రోజు చేసి తరువాత free గా ఉండటం కాదు. జీవితాంతం శరణాగతిలోనే ఉండాలి.** ఈ నాటి mental enlightenment అది ఈ జన్మలో

సాధించినది కాదు. అది పూర్వ జన్మ సాధనా ఫలితం. ఈ జన్మలో శరణాగతి పోగొట్టుకుని మానసికమైన చంచలత్వం వస్తుంది. దాంతోసత్, అసత్ గుర్తించే శక్తి పోయి, సద్గురువును వదిలి, (పైగా) తానే సద్గురువును అడ్డం పెట్టుకుని తానే ప్రజల భాధలు తీరుస్తున్నట్లు నటిస్తుంటారు. దాంతో మరల జిడ్డు అంటుకోసాగుతుంది. దిగజారి పోతాడు. తన డౌన్ ఫాల్ తను గుర్తించ లేడు ఎందుకని? తనను ఆశ్రయించిన వారి పొగడ్తలతో కళ్ళు మూసుకుపోతాయి. చివరకు చిప్ప చేతికి వస్తుంది. ఎంత enlightenment వచ్చినా తన గురువును వదలటం లోనే తన డౌన్ ఫాల్ మొదలైందని గుర్తించలేడు.

2. ఇంద్రియ చాపల్యాలకు లొంగక ఆచరించేదేలా? లొంగితేఏమి?

భగవద్గీతలో చెబుతాడు – ఇంద్రియ లోలత్వం ద్వారా మానవుని ప్రజ్ఞ హరించి పోతుంది – గాలి వలన పడవ వేగం నశించినట్లు అంటారు. (ప్రజ్ఞ అంటేమానసిక, శారీరిక సామర్ధ్యాలు అని అర్ధం) అవి పోయాక ఇక మనం ఎందుకు పనికి రాము. మనలో భల్లూకపు పట్టుదల వుండాలి. **ఈ పట్టుదల సడలకుండా వుండాలంటే నిత్యం సద్గురువు మనకు చేసిన సహాయాలు, ఇచ్చిన అనుభవాలు తలచుకుని పులకించి పోవాలి. పూజలో గగుర్పాటు రావాలి. నిత్యం గగుర్పాటు వచ్చే విధంగా మన అనుభవాలు మననం చేస్తుండటమే గొప్ప పూజ. ఆ కాలమే సద్గురువుకు అర్పించిన ఉత్తమోత్తమ పుష్పం. అప్పుడు ఇంద్రియ చాపల్యాలకు ఎందుకు లొంగకూడదో, భల్లూకపు పట్టుదల ఎందుకు అవసరమో తెలిసి వచ్చి ముందుకేవెళతాం కానీ వెనుకంజ ఉండదు.** మనకిచ్చిన ఒక్క అనుభవాన్ని కూడా స్మరించని పూజ పూజే కాదు. అది యాంత్రికము లాంఛన ప్రాయమైనది.

అనుభవాలురాని వాళ్ళ సంగతి అలా ఉంచాలి. వాళ్ళు ఇతరుల కిచ్చిన అనుభవాలు స్మరిస్తారు. స్మరించాలి. లేకుంటే అంతా wasteful thing.

3. మొదట రావలిసిన పరిణితి విశ్వాసమే నా ? దానికి మార్గమేది ?

**మొదట రావలిసిన పరిణితి విశ్వాసమే : దానికి మార్గమేది ? i) పుణ్యం ii) నియమ పాలన. విశ్వాసం కలిగాక అది బాగా పెరిగి మహా వృక్ష మవ్వాలంటే– మనకు సద్గురువు చేసిన మహోపకారాలను లోతుగా మననం చేస్తూ గగుర్పాటు చెందుతుండటమే. అలా చేస్తే మన విశ్వాసం సడలదు. అంతే కాక చక్కగా పెరుగుతుంది.**

4. ఆహార నియమం ఎప్పుడూ అవసరమేనా?

ఆహార నియమం ఎప్పుడూ అవసరమే. కారుకు పెట్రోలు బదులు క్రూడాయిలు కిరోసిన్ పోసి నడిపితే ఏమౌతుంది? కారు నడుస్తుంది. కానీ ఇంజన్ చాలా త్వరగా చెడి పోతుంది. Irreparable అవుతుంది. **దైవం వచ్చి ఆహార నియమం చెప్పనక్కరలేదు. మన శరీరం ఏది తింటే సరిగా పని చేస్తుందో మనమే తెలుసుకోగలం. ఇంద్రియ చాపల్యాలకు లొంగకుండా భల్లూకపు పట్టుదలతో సాగటమే.** బోంబే రైల్వే స్టేషన్ లో కిరోసిన్ స్టవ్ పెట్టి 2 kg బియ్యం అన్నం వండాను. అంతా సద్గురువుచే చేయబడింది.

**మొదట మనలో పట్టుదల ఉండాలి. భల్లూకపు పట్టుదల.**

ఆశీస్సులతో పె. సు.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

18-9-05

పుజ్య గురుబంధువులు అయిన శ్రీమతి లక్ష్మిఅక్కగారికి చిరంజీవికి సాయికి శ్రీ స్వామి వారి ఆశీస్సులు సదా ఉండాలని ప్రార్థిస్తూ వ్రాయడం(p.s.r.). అమ్మా మనకున్నంత మంది అండ, ఆపు, ఆప్తులు, మిత్రులు, బంధువులు మరెవ్వరికి లేరు. ఎందుకిలా చెపుతున్నానంటే ఆ మహనీయుడు మనవాడే అయి ఉండగా అందరు మనవాళ్ళే. మనకెవ్వరూ లేరనే భావం మనకు రాకూడదు. ఇప్పుడు మనకవసరం లేదు గనుకే అందరికీ దూరం పెట్టారు. మన గురుదేవుడు ఏ మారక మన హృదయంలో ఉన్నాడని మనం నిరంతరము ఆయన వైపే చూడాలని వారి ప్రతిరూపాలయిన ఈ ప్రపంచంలోని రూపాలను పట్టించు కోకుండా మెలగాలనేదే వారి సంకల్పం గనుక మనలను అందరి నుండి దూరం చేసాడు. నాకు ఒక్క బంధువు లేడు, స్నేహితుడు లేడు. నాకు మాత్రం ఎవ్వరూ లేరే అనే భావన లేదు. సాయిమాస్టర్ నిలయంలో తాత నేనిక్కడ ఉండలేను. ఎక్కడికి అయినా వెళ్ళిపోతానని ఆరాధనకు ముందు నెల నుండి నోటీసు ఇచ్చాడు. Ok వెళ్ళండి అన్నాను. మా వాళ్ళు ఆయన పోతే ఎట్లా అని గోల పెడుతుంది. నేను అరిగిపోయిన gramphone రికార్డు లాగా ఆయన పోతే మాస్టర్ ఇంకొకర్ని తెచ్చిపెడుతాడు. ఆయన పోతే ఎట్లా అనేది మనకెందుకు. సాయిమాస్టర్ నిర్వాహకులు అయిన గురువుగారిది కదా ఆ డ్యూటీ అని చెప్పేవాడిని. అంటే ఆయన మనవాడై ఉండగా వేరే చింత ఎందుకు. **మీకు నాకెవ్వరూ లేరనే భావం తీసేసుకోండి. తృప్తి, శాంతి, ఆనందం, హృదయం నిండా నింపుకోండి. అప్పుడు గురుదేవులు ఎంతో సంతోషిస్తాడు.**

ఆ మహనీయుడు మనకు ఇన్ని అనుభవాలిచ్చి నేను మీతోనే ఉన్నాను. మీకంటే ముందే మీ గురించి ఆలోచించి ప్లాన్ వేసి ఉంచాను అనడానికి ఎన్ని నిదర్శనాలు ఉన్నాయో. బెంగుళూరులో సాయి ఆసుపత్రికి పోతే డాక్టర్ లేక AC రూమ్ లో ఉంచారు. తిరిగి వచ్చారు. అప్పుడు మీరు Bangalore లో లేకుంటే సాయి ఏమయ్యేవాడో. ఆ తర్వాత దర్గా స్వామికి, మీ వారికి ఫోన్ అందకుండా చేశారు.

మిమ్ములను గొలగమూడి తీసుకువచ్చారు. ఫోనులో అందకుండా చేసింది ఎవరు? అంతా చేసేది ఆ మహనీయుడే. ముందుగానే మిమ్ములను బెంగుళూరులో ఉంచాడు. అదొక్కటి చాలు. ఆయన నిరంతరం మన ప్రక్కన మనకంటే జాగ్రతగా హుషారుగా ఉన్నాడు అనేందుకు నిదర్శన. **ఆ మహనీయుడు ఇంతకు ముందు చేసిన మేలు తలంచుకొని ఎప్పుడూ తృప్తి, శాంతి, ఆనందంగా ఉంటే వారికి ప్రీతి పూర్వకంగా ఆయన కొలువు నర్తకులమైన మనం మన పాత్ర పోషించి వారికి ఆనందం కలిగించిన వారము అవుతాము. ఏది చేసినా, ఏది జరుగుతున్నా అందులో మనం చేయవలసిన కర్తవ్యం క్షుణ్ణంగా చేసి దాని ఫలితం వైపే చూడకుండా ఆనందంగా ఉండమని శ్రీ మాస్టర్ తన ఆచరణ ద్వారా బోధించారు.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

**స్వామి, భగవంతుడు మనకిచ్చిన, ఇస్తున్న అనుభవాలను మననం చేసుకుంటూ వారి చేతులో ఉపకరణలముగా ఎలా ఉండాలో, అలా జీవిస్తే ఎలా ఉంటుందో తెలుపు letter:**

Om

గొలగమూడి

1-8-2005

పూజ్య గురుబంధువులైన శ్రీమతిలక్ష్మక్క గారికి పెసల సుబ్బరామయ్య నమస్కారములు.

అమ్మ మనం ఏదైనా చెయ్యాలన్నా చేయలేము. చేయలేకుండా ఉండాలన్నా ఉండలేము. ఉదాహరణకు నా కొమార్తె అప్పుడు రైల్వేలో షోలాపూర్ ప్రక్కన హుటిగీ అనే స్టేషన్ లో ఫార్మసిస్టుగా పనిచేస్తుంది. అప్పుడే స్టేట్ బ్యాంకులో ఉద్యోగానికి ట్రైనింగ్కు

తిరుపతి రమ్మని ఆర్డరు వచ్చింది. రైల్వే పెద్ద సంస్థ అని, స్టేట్ బ్యాంకు చిన్న సంస్థ అని, స్టేట్ బ్యాంకు లో చేర్చేందుకు నాకిష్టం లేక ఆ ఆర్డరు కాగితం ఆమెకు పంపలేదు. భగవంతుని నిర్ణయం ఆమెను బ్యాంకులో ఉద్యోగం చేయించాలని, గనుక ఆమె పనిచేసే గ్రామంలో ఆ ముందటి రోజు డాక్టరును చంపే ప్రయత్నం చేసారు. ఆ రోజు డాక్టరు లేకుండా ఉంటే మా అమ్మాయికి ఆ మర్యాద జరిగి ఉండేదే. అందుకని తెల్లవారి సామాను సర్దుకుని ఇంటికి రాబోతుంది. అదే సమయంలో నేను షిరిడీ వోవాలనే ప్రేరేపణ పెట్టి బ్యాంక్ ఆర్డరు ఊరక చూపెట్టాలని తీసుకువోయ్యాను. షిరిడీ వొయ్యే మార్గంలో హుటిగీ కనుక అక్కడ దిగి ఆమెను చూచి షిరిడీ వోవాలని దిగాను. ఆమె సామాను సర్దుకుని రెడీగా వచ్చేందుకు సిద్ధంగా ఉంది. విషయం తెలుసుకుని షిరిడీ ప్రయాణం మానుకుని తెల్లవారి 10 గం.లకు తిరుపతి ట్రెనింగ్లో చేర్చాలని, వెంటనే హుటిగీ నుండి తిరుపతి వచ్చి ట్రెనింగ్ లో చేర్చాను. నా షిరిడీ ప్రయాణం వోయింది.

నేననుకొన్న షిరిడీ యాత్ర సాగలేదు. భగవంతుని నిర్ణయానుసారం ఆమె స్టేట్ బ్యాంకులో ఉద్యోగం అయింది. బ్యాంకు ఉద్యోగినే వివాహమాడి నెల్లూరులో కాపురమున్నారు.

**మనం ఒక పని చేసేందుకు, చేయకుండా ఉండేందుకు స్వేచ్ఛ లేనివారము. భగవంతుని చేతిలో ఉపకరణాలము మాత్రమే. ఇది తెలిసి దేనికీ చింత చేయకుండా హాయిగా నీ ఇష్టమొచ్చినట్లు నడుపు తండ్రీ అంటూ సంతోషంగా ఉంటే ఈ నాటకరంగం లో మన పాత్ర బాగా నటించినవారమవుతాము.** అట్లాగాక అంతా నేనే చేస్తున్నాను, పిల్లలను చెడగొడుతున్నాను అనుకోవడం అవివేకం. చెడగొట్టడం, బాగుపరచడం మనచేతిలో ఏమీలేదు. మా అన్నను చదువు కొరకు నెల్లూరులో మా మేనత్తగారింట్లో ఉంచితే బీడీలు త్రాగేది నేర్చుకుని సాయిబులతో కుస్తీలు పట్టేది నేర్చుకొని చెప్పకుండా ఇంటికి వచ్చేసాడు. ఇక నన్ను చదువుకే నెల్లూరు పంపకూడదనుకొన్నారు. కాని రెండురోజులు

పూర్తి నిరాహారదీక్ష చేసి చదువు కొరకు నెల్లూరు వెళ్లి B.Sc., B.Ed అయ్యాను. మనము ఏదీ చేయలేము, చేయకుండా ఉండలేము అంతా దైవమే చేస్తున్నాడు

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో,

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

Dear Sai !

శ్రీస్వామివారు ఎంతటి కరుణామయలో ఈ మాయ గప్పిన మనసు ఊహించలేదు. శ్రీసాయిమాస్టర్ నిలయం ఉండేతావులో ఇల్లుకట్టాలని శంకుస్థాపన గుంట త్రవ్వుతుంటే ఆరు అడుగులు త్రవ్వినా అంతా loose soil లే. నీరు విపరీతంగా ఊరుతుంటే మానేశాను.

అంకణం 500 రూపాయలకు కొని వెయ్యిరూపాయలకైతే ఇస్తానన్న విజయభాస్కర్ అంకణము 500 రూపాయలకు ఇస్తానని లెటర్ వ్రాస్తే అది ఖచ్చితంగా శంకుస్థాపన ముహూర్తం టైములోనే చేరడం శ్రీస్వామివారి దివ్యలీలే. ఆ స్థలంకొని ఇప్పుడు కాపురం ఉంటున్న ఇల్లు ఉండే చోట రెండు అంకణముల రూము వేయించాలని వాస్తు అతనిని పిలిస్తే వచ్చి ఇంటికి మొత్తం ప్లాను ఇస్తాను. నీ శక్తి ఉన్నంత వరకు కట్టుకో అని ప్లాను గీసి ఇచ్చాడు. మా మామ వచ్చి మొత్తం ప్లాను ప్రకారం పునాదులు కట్టు. మిగిలిన రెండు అంకణములరూమే వేసు కోడానికి డబ్బు చాలకుంటే వడ్డీ లేకుండా నేనే ఇస్తానని బలవంతం చేశాడు. సరేనని ప్లాను ప్రకారం సున్నం పోసి పునాది తవ్వాలని ప్రయత్నిస్తే ప్లానంతా ఒకే బండ మూడు అంగుళములు కూడా తెగలేదు. ఆ మార్గాన వెళ్లే బేలుదారు వచ్చి ఈ బండను పగల గొట్ట వద్దు. Plinth beam వేసి ఇల్లు కట్టు నాది జవాబు అని ప్రోత్సహించాడు. మామూలుగా బిల్డింగ్ అంతా ఒక లక్షరూపాయలు అయితే అందులో ఫౌండేషన్ కట్టే ఖర్చు రూ 25,000 ఉంటుంది. ఇప్పుడు నాకు రూ 25,000 మిగిల్చారు.

బేలుదారికి కూలి ఇచ్చే పని లేకుండా పరంధామయ్య చేత చీటీలు పెట్టించి సుబ్బరామయ్యగారికి పనిచేయమని చెప్పారు. అతను కట్టబెట్టి అన్నం తిన్నాడే కానీ ఒక్కపైసా తీసుకో లేదు. కనుక కనీసం ఐదు వేల నుండి 10000 మిగిలాయి. విజయభాస్కర్ ను ప్రేరేపించి లెటర్ వ్రాయడము, మా మామను ఇంటి ప్లానంతా పునాదులు కట్టమని, డబ్బు నేను ఇస్తానని చెప్పించి పునాదులు కట్టాలని ప్రయత్నిస్తే బండ వల్ల పునాదులు కట్టే పనిలేకుండా చేశారు. పరంధామయ్యను బేలుదారుగా తీసుకువచ్చి ఆ ఖర్చు తప్పించాడు. U.T.I లో మెచ్యూర్ అయి డబ్బు రావడంతో బిల్డింగ్ అంతా ప్రహరీలు సహా బావితో సహా తయారు చేయించిన మహనీయుడు. **మనకు ఆయా సమయాలలో మనసు కష్టంగానే ఉంటుంది కానీ అది మన మంచికే.** లక్ష్మక్క కు నమస్కారములు.

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి,

05-06-2005

Dear Sai!

శ్రీ స్వామివారి దయ వలన నీ చదువు బాగా సాగాలని ప్రార్థిస్తున్నాను. మీ ఎరుక లేకుండా మీ రిజల్యూషన్ లేకుండానే మరలా లక్ష రూపాయలు నెలసరి వడ్డీ ఇచ్చేటట్లు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్ట్ పేరుతో వేశాను. ప్రతి నెలా వచ్చే వడ్డీ మదర్ తెరిసా అనాథాశ్రమానికి ఇవ్వాలనుకున్నాను. రేపు మీరు వచ్చినప్పుడు ఫిక్సిడ్ డిపాజిట్ వేసే ఫారాల మీద అమ్మ సంతకాలు పెట్టాలి.

చూచావా సాయి మరో అనాథాశ్రమం కట్టాలంటే అది వీలు కాకుండా మదర్ తెరెసా ఆశ్రమాన్ని అనాథాశ్రమంగా చేశారు. **ప్రతిదీ ఇలాగే ఉంటుంది. మన**

**ఇష్టాఇష్టాలు లేకుండా వారు నడిపించినట్లే నడవగలుగుతాము. అయితే ఆ బాట కష్టంగా ఉంటుంది. ఎందుకని? మనకు ఇష్టాఇష్టాలు పోలేదు కనుక. వాటిని ఆ మహనీయుడు వదల కొట్టినంత వరకు విశ్రాంతి లేకుండా వెంటపడుతూ మనలను నడిపిస్తుంటారు. కనుక ఇష్టాయిష్టాలు వదలి వారు నడిపించినట్లు ఆడుతుంటే వారికీ శ్రమ ఉండదు మనకు కష్టం ఉండదు. అదే అన్నమయ్య పాడిన పాట. ఓ దేవాదిదేవా మా ఆటపాటలతో మిమ్ము మెప్పించవల్లనేగానీ మోక్షమని మిమ్మడగ తగదు. అంటే అర్థం ఇప్పుడు శ్రీ సాయి మాస్టర్ సేవా ట్రస్టు నడిచే తీరు అదే.**

*********** సద్గురు దేవా శరణం శరణం *********

**సార్ చరమ సందేశం:**

OM

గొలగమూడి

29-06-2005

పూజ గురు బంధువులైన లక్ష్మక్క గారికి శ్రీ స్వామివారి ఆశీస్సులు మీకు ఉండాలని ప్రార్థిస్తూ సుబ్బరామయ్య వ్రాయడం.

చంద్రభాగాతరంగాలు బ్రహ్మేంద్ర సరస్వతి స్వామివారని ఒక మహనీయుడు ఉన్నారు. Nuptial day రోజు ఆకలిగా ఉంది అన్నం పెట్టమని అత్తగారిని అడిగితే కొంచెం ఆగు, వంటింట్లోకి రాకు అని అత్తగారు అంటారు. ఆ మాటే వారికి ఉపదేశం. ఇల్లు విడిచి వెళ్ళాడు. వారి జీవిత చరిత్రలో ఒక ముస్లిం వారి చేయి నరుకుతారు. ఎందుకంటే ఆయన దిగంబరంగా ఉన్నాడని అతని కోపము. అది పట్టించుకోకుండా రక్తం కారుతూ వేలాడుతున్న చేతి సంగతి తెలియని వారు వెళుతుంటే ముస్లిం కుర్రాడు నన్ను క్షమించండి, మార్గము చూపండి అని వేడుకుంటూ కాళ్ళ మీదపడతాడు. అప్పుడు స్వామి వారు చెబుతారు- భయము లేదు, భయమే లేదు. **ఇంద్రియములను జయించిన వానికి, మనసును ఆధీనములో ఉంచుకున్న వానికి, సద్గురు**

**సమాశ్రయముకోరి వారి కృప పొందిన వారికి, ఆశ తెంచుకున్న వారికి భయమే లేదు అంటారు. ఇక్కడ వీరు ఇంద్రియములు జయించడం, మనసును అధీనంలో ఉంచుకొనటం, ఆశను వదలడం అనేది సాధించిన వారికే సద్గురు సమాశ్రయం లభిస్తుందని చెపుతున్నారు.** సమాశ్రయం లభించడమంటే నాలాగా సమాధి అభిషేకం చేయు భాగ్యమని అందరూ తలచినట్లు కాదు. ఆ పని ఏ కూలి వానికైనా 50 పైసలు ఇస్తే చేస్తారు. **ఇంద్రియములు జయించుట, మనోనిగ్రహము, ఆశ వదులుట అనేది మన మీదనే వదిలారు. ఇదంతా మనకు ఉండే తుప్పు. దానిని వారి సన్నిధి, సేవల ద్వారా వారి కృపతో మనం పోగొట్టుకోగలుగుతాము. మన ఋణానుబంధాలు, వాగ్దానాలు తీరిపోవాలి కదా. అవి తీరేందుకు వారు ఆదేశించినట్లు మనం కష్టమైన సంతోషంగా ఆచరించాలి.** మిలరేపా లాగా వీపంతా పుండైనా, గుంట కలగరాకు తిని ఎముకుల గూడు ఐనా సరే **గురువాజ్ఞను పాటించాలి. సర్వస్య శరణాగతి చేయాలి. చివరి వరకు భయము, సంకోచము, దుఃఖము లేకుండా స్వామిని అంటి పెట్టుకోనుండాలి. సర్వము సమకూర్చే మహనీయుడు మనకు మన అదృష్టం కొద్దీ చిక్కాడు.అదే మనభాగ్యము.**

శ్రీ స్వామి వారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి,

22-7-2005

Dear Sai!

నిన్నటి లెటర్లో శ్రీ స్వామివారు నా ఇల్లు కట్టించిన విషయం వ్రాశాను. **అప్పుడు నేను యమతిండి తింటూ ఇద్దరు మనుషుల పని చేస్తున్నాను. కామాంధుడినై కన్ను కానని రోజులవి. ఒక్క సారైనా నా ఇల్లు కట్టే పనిలో సహాయము చేయమని నేను స్వామిని ప్రార్థించి ఎరగను. అంతా చేయ వలసింది**

**మనమే గదా! వారేమి చేస్తారనే అహంకారము తలకెక్కిన రోజులు అవి. ఎసరు పెట్టి మనం మంట చేస్తే వంట అవుతుందనే పెధవ వేదాంతం.** బియ్యపుగింజ తయారుచేయటం మనకు చేత కాదనే విషయమే స్ఫురించని కామాందపు రోజులవి. శ్రీ సాయిమాస్టర్ నిలయం ఉండేచోట శంకుస్థాపన గుంట కొంత త్రవ్వి పూడిపించారు. నా ప్రార్థన లేకనే వాస్తు ప్లాన్ గీసి ఇచ్చారు. నా ప్రార్థన లేకనే మా మామ పునాదులకు డబ్బు ఇస్తాను అని బలవంతం చేసాడు. నా ప్రార్థన లేకనే పరంధామయ్య బేలుదారిగా వచ్చాడు. నా ప్రార్థన లేకనే బిల్డింగ్ అంతా ఒకే ఒక బండ పడి పునాదులు కట్టే పని ఖర్చు లేకుండా పోయింది. **మన ప్రార్థన లేకుండానే సర్వం జరిగిపోతుంది.అది ఆ సద్గురుమూర్తి కృప. ఇంత జరిగినా ఇలాంటివి ఒకటి రెండు కాదు వందల అనుభవాలు జరిగినా ఈ మలిన మనసు నేటికైనా కుదురుగా ఉండమన్న చోట ఉంటుందా. అటు భవిష్యత్తునో లేక గతాన్నో యోచిస్తోంది. ఏమో దీన్ని ఆ సద్గురుమూర్తి ఎప్పుడు హతమార్చి కూర్చోబెడతాడో తెలియదు. తప్పక కూర్చో పెడతాడు. ఈలోగా ఇంద్రియలోలత్వం, ఆశ, సోమరితనం, జిహ్వా చాపల్యం, పరదూషణ, స్త్రీలోలత్వం అను నాలోని దొంగలను కనిపెట్టి తరిమే ప్రయత్నం చేయాలి. సిన్సియర్ ప్రయత్నం చేయాలి. శ్రద్ధ కాదు కేవలశ్రద్ధ అవసరమంటారు శ్రీ మాస్టారు గారు. శక్తినంతా వినియోగించి కృషి చేయమంటారు సాయి.లేకుంటే మానవ జన్మ పిడకలు ఏరుకునేందుకేనంటారు. అలాంటి దౌర్భాగ్యస్థితి కాకుండా వారిచ్చిన పని చేసే ప్రయత్నం సిన్సియర్గా చేసి తరిద్దాం.** అక్క గారికి నమస్కారములు.

శ్రీ స్వామివారి కృపా సదా మీకు ఉండాలని ప్రార్థన.

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

గొలగమూడి

15-07-2005

పూజ్య గురువుల లక్ష్మక్క గారికి సుబ్బరామయ్య శ్రీ స్వామివారి ఆశీస్సులు తెలుపుతూ వ్రాయడం. మీ లెటర్ చేరింది. **ఆ మహనీయుని ఆశ్రయించడంలో మన పుణ్యం ఇమిడి ఉంది. మనం క్రింద పడుతున్నా వారు మనలను పడనివ్వరు.** రోశి రెడ్డి కుమారుని బండి ఎద్దులు, మనిషిని ఎలా రక్షించారు. **మనకు కష్టాలు కలగడం మన మంచి కొరకే అని భావిస్తూ వారి వైపు చూస్తుంటే చాలు.మనం చలనం లేని విశ్వాసముతో వారినంటి పెట్టుకోవడమే మన ప్రయత్నమంతా.** పోయే వాళ్లను పోనిచ్చేదే గదయ్యా అనే మాట మనకు వర్తించదు. వారు చీటీల ద్వారా చెప్పిన మాటకి మనం అంటిపెట్టుకుని నడుచుకుంటున్నాము. పోయే వాళ్లను ఫోనిచ్చేదే గదయ్యా అన్న వాళ్ళ సంగతంతా చాలా ఘోరం. శ్రీ స్వామి వారు ప్రత్యక్షంగా శరీరముతో ఉండగా చెప్పిన మాటను వాళ్ళు ఖాతరు చేయలేదు. కత్తితో పొడుస్తా అని చెప్పినా వారు తమ చెడ్డ నడవడి మార్చుకోలేదు. అలాంటి వారితో మనం పోల్చుకుని అలా మనమూ అవుతామని భయపడవద్దు. సర్వ హృదయాంతర్వర్తియైన ఆ మహనీయుడు మనలను తప్పక నడిపించి గట్టెక్కిస్తాడు.

**భయము, ఆందోళన, దుఃఖము కాస్త కూడా దరిచేరకుండా చూసుకోవాలి. భయము, ఆందోళన ఎంత ఎక్కువగా ఉంటే అంత ఎక్కువగా వారి సర్వ సత్యము మర్చిపోయామని అర్థం.**

బస్సులో రిజర్వ్ చేసిన టికెట్లు క్యాన్సిల్ చేయించింది వారే. హైదరాబాద్ డాక్టర్ మిమ్మలను వెంటనే రమ్మనకుండా కాగితం మీద వ్రాసిస్తాను అని అనిపించింది ఆయనే. మద్రాసు డాక్టరు 15 రోజులకు మందులు వ్రాసేనట్లు చేసింది వారే. 15 ఆగస్టు వస్తుంది. ఆగస్టులో పరీక్ష రాశాకనే హైదరాబాద్ ప్రయాణం. అప్పుడు కూడా డాక్టర్ గారు రమ్మంటే వెళ్ళుతాము. ఇక్కడ ఒక వ్యక్తి 40 రోజులు ఉండాలన్నారు. సరేనన్నాను. వారు వచ్చిన పని స్వామి కంటే ముఖ్యం, ప్రేమికుల సంభాషణలని నాకు ఎలా తెలుస్తుంది. ఒక వ్యక్తి రాత్రి 12 గంటలప్పుడు మాట్లాడుకుంటుంటే చూసి చెప్పాడు. నేను

పట్టించుకోలేదు. ఆమెకు వార్నింగ్ ఇచ్చాను. అప్పుడు ఆమె ఆ వ్యక్తి మా ఎదురింటి వాడని నాకు చెప్పాలా. స్వామిని గురించి అడిగితే చెప్పాను అంతే అన్నది. తెల్లవారి మరికొన్ని వివరాలు తెలిసాయి. మొదట ఆమె చెప్పిన మాటలకు రెండవసారి పిలిచి అడిగినప్పుడు చెప్పిన మాటలకు పోలిక లేక కఠినంగా మాట్లాడి తరిమేశాను. ఆ తర్వాత మరికొన్ని వివరాలు చెప్పారు. వారి ప్రేమ విఫలమై టీ త్రాగి చనిపోవాలని మందు సీసాలు ఉంటే చూశామని చెప్పారు వారు త్రాగి ఉంటే ముందు నన్ను పోలీసులు తీసుకుపోతారు.అందరి ద్వారా చేసేది ఆ మహనీయుడే నిండు హృదయంతో వారిని ఆశ్రయించడమే మన కర్తవ్యము.

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

**మనకు స్వామి ఇచ్చిన అనుభవాలను స్మరిస్తూ కష్టాలను లెక్క చేయక సంతోషంగా స్వామి సేవ చేస్తే స్వామికి ఎంత సంతృప్తిగా ఉంటుంది? సార్ మాటల్లో, ఆచరణలో:**

గొలగమూడి

19-11-2005

డియర్సాయి! పూజ్యలక్ష్మక్కగారు!

మీలెటర్చేరింది. అమ్మా ఆ మహనీయుని మాట జవదాటకుండా ఆచరించే ప్రయత్నం చేశాక ఇక భయానికి తావులేదు. ఆయన మనతో ఉన్నాడు. గొలగమూడిలో మాత్రమే కాదు అనేది గట్టిగా నమ్మండి. **ఏది నిజం** మరలా మరలా చదవండి. ఢిల్లీ, అమెరికా, కాశి దగ్గర రైల్లో చేసిన ప్రార్థనలు మన్నిస్తూ ఉన్నాడంటే వారి అక్కడున్నట్లు. అరవింద్ అమ్మగారిని రైలు ప్రమాదం నుండి తప్పించాలంటే ఆ ఒక్క అనుభవంచాలు మనల్ని ఉద్ధరించేందుకు. సాయి ఒక పరీక్ష తప్పిన ఆ ప్రొఫెసర్ వచ్చి Admit him అన్నారంటే ఆయన కృప తెలుస్తుంది. మనం ఇంకా భయపడడం అర్ధరహితము.

**నిర్మలంగా పారాయణ, నామస్మరణతో ధాన్యం ఏరి అగ్నిగుండానికి సమర్పించడం, ఎంతో సంతోషంగా చేస్తుంటే ఆ మహనీయుడు మన ప్రవర్తనకు ఎంతో సంతోషిస్తాడు కదా.** ఆయనకు నేనేమీ చేయను. అందరికీ లెటర్లో వ్రాయడం, పుస్తకాలు పంపడం, కొత్త పుస్తకాలు తయారుచేయడం. నాకు ఇబ్బందులు రావాలని ఉంటేళవస్తుంటాయి. వాటిని లెక్కచేయను. **సర్వసమర్థుడయిన ఆయన ఉండగా ఇంక భయమెందుకు. చక్కగా తినడం బలం తెచ్చుకుని ఆయన సేవ చేయడం.** తినకుంటే ఆయన సేవ చేయలేము.

శ్రీస్వామివారి ఆశీస్సులతో

పెసల సుబ్బరామయ్య

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

Golagamudi

25-10-2005

Dear Sai!

నీవు జాబు వ్రాయలేదని అనుకుంటావని వ్రాస్తున్నాను. బొత్తిగా టైం లేదు. ఈ వర్షాలు వద్దంటే కురుస్తున్నాయి. ముళ్ళు గుచ్చుకొని కాళ్లకు కట్టు. సాయిమస్టార్నిలయములో డ్యూటీ. What do you mean by negligency of duty? అన్న శ్రీస్వామి వారి ఆజ్ఞ మనకు కూడా వర్తిస్తుంది. **వారి ఆదేశించిన దివ్యమార్గాన్ని ఆచరించి వారికి ఆనందం కలిగిస్తే సృష్టికర్త ఆనందం కలిగించిన వారమవుతామని నేను నమ్ముతున్నాను.** కనుక మందిరంలో పూజ  పోతే ఏ బాధా లేదు సంతోషంగా ఉండడమే మన ప్రయత్నం. **సర్వం వారే సమకూరుస్తారు.**

నీవు కూడా అలానే టెన్షన్లేకుండా వారు నడిపినట్లు పోతుండు. నాలుక మీద కన్నేసి ఉండు. **ఇంద్రియ నిగ్రహం లేనిదే స్వామికృప పొందలేము.**

శ్రీస్వామివారి ఆశీస్సులతో

పెసలసుబ్బరామయ్య

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

**ఓం**

**రమణస్థాన్ పత్రిక నుండి:**

**శ్రీ రమణ చరమోపదేశం శ్రీదేవ రాజ మొదలియార్**

"నా శయ్యరేన్, ఇల్లే,

నీ"సరెండర్"

పణ్ణివట్టు సుమ్మా ఇరుక్క

వేండియదు దానే"

**తాత్పర్యము: నేను చేస్తాను, చెయ్యను. ఇది నీకు సంబంధించినది కాదు. నీవు చేయవలసినదల్లా "శరణాగతి" – ఇది అని అది అని తలచకుండా మౌనంగా ఉండటమే".**

భగవాన్ దేహారోగ్యం బాగుండలేదని విని 1947 ఏప్రియల్ లో ఆశ్రమానికి వచ్చాను అప్పుడు నాకు భగవాన్ పరిపూర్ణ శరణాగతి మార్గాన్ని ఉపదేశించారు. అదే భగవాన్ నుండి అందిన చరమోపదేశం! అందుచేత అది నాకు అత్యంత విలువైనది. నాకే కాదు, భక్తులందరూ హృదయంలో భద్రపరచుకోవలసిన దివ్యోపదేశమది!

అప్పుడు నేను మానసికంగా బాగా కృంగిపోయాను. ఇక భగవాన్ దేహం ఎట్లాగూ ఎక్కువ కాలం నిలువదు. భగవాన్నాకు చేయవలసిన సహాయాన్ని చేయటం లేదు . నా పాటుకు నన్ను వదిలివేసారు.

"వీడెన్నటికీ బాగుపడే రకం కాదు" అని తలచి విసుగు చెంది వుంటారు. భగవానే నన్ను వదిలేస్తే ఇక నాకు ఎవరు దిక్కు ? ఎవరు రక్షకుడు ? ఈ మానసిక స్థితిలో మే 17 న సాయంత్రం 3 గంటలకు నేను భగవాన్ ని సమీపించి "భగవాన్, నా మనోస్థితి అంతా మీ పాదాలముందు వెళ్ళబోసుకోవాలని ఉంది. అది నా మాటల్లో వెల్లడించలేను. అందుచేత శివ ప్రకాశం పిళ్ళైతమపై మూడు పాటలు పాడతాను, అవి నా మనోస్థితి ని చక్కగా వెల్లడిస్తాయి కనుక భగవాన్దయతో శ్రద్ధ గా వినాలని ప్రార్థిస్తున్నాను" అని అన్నాను.

ఆ మూడు పాటలు పాడాను. ఆ పాటల సారాంశం ఇది.

**"భగవాన్ మీరిట్లా బోధించారు –**

"మనుష్యులు శతకోటి ప్లానులు వేస్తూ వుంటారు అవి స్వయంగా ఫలించవు. దేవుని అనుగ్రహం చేతనే ఫలిస్తాయి. కనుక ఉత్తమ భక్తుడు అసలు ప్లానులు వేయడు" అని

ఈ మహార్థం నా హృదయగతం కాలేదు. తిరుగుబోతైన నా మనస్సును అదుపు చేయలేకపోతున్నాను. "ఓ భగవాన్! అసాధారణమైన ఓ మహా గురూ, నీవు బోధించిన మహోన్నతమైన మార్గాన్ని అనుసరించలేక పోతున్నాను. ఈ ప్రపంచ సంబంధమైన పాశాలను కోసి వేయలేకపోతున్నాను. ఈలాలసత నుండి నేను విడివడలేక పోతున్నాను. నశించే ఈ దేహం నేను కాదని మానసికంగా నేను గుర్తించేట్టు చేయగలిగారు మీరు. కాని ఈ సత్యం దర్శనం అయ్యేట్టు అనుగ్రహించలేదు! మీరు.

"కరుణాపూర్ణుడైన గురువు దాసుని దోషాలను చపల చిత్తాన్ని తుడిచివేసి అతన్ని సత్యంలో స్థిరపరుస్తాడు. ఇంతేగాని చక్కదిద్దడానికి వీల్లేని మూర్ఖుడని తలచి అతని పాటుకు అతణ్ణి వదిలి వేయడు".

"భగవాన్! గురుదేవుడా! నీవు ఇట్లాగ ఉపేక్ష చేస్తుంటే , ఈ దీనుడు చిత్తం వచ్చిన రీతిలో పరుగెత్తుతాడు. ఇది న్యాయమా? నేను ఎట్లా రక్షించబడతాను? ఇక రక్షకుడెవరు? నేను దుర్బలుణ్ణి. అందుచేత నన్ను నేను నిగ్రహించుకోలేక పోతున్నాను.

ఓ ప్రభూ, గురుదేవుడా! నన్ను ఉద్ధరించవా ? ఈ జన్మలోకాని , వచ్చే జన్మలో కాని నీవు తప్ప నాకు గతెవ్వరు? సహాయకులెవ్వరు? నన్ను ఏమి చేయదలచుకొన్నావు? నీ నిజమైన వినోదం ఏమిటి ? ఇట్లా హింస పడుతుంటే చూడటమా ? లేక నన్ను రక్షించటమా? ఇది నాకు చాలా క్రూరమైన క్రీడగా కనపడుతోంది . ఓ నా గురుమూర్తీ ఇది నీకు న్యాయం కాదు"

ఇట్లా నా ఆవేదనాగ్ని తో నిండిన నా ప్రార్ధన ముగిసింది. భగవాన్ గంభీరులై రెండు మూడు నిముషాలు ఉండి , అవధి లేని అనుగ్రహంతో ఇట్లా అనుగ్రహించారు.

**"నాన్నయ్యరేస్, ఇల్లే నీ "సరెండర్"**

**పణ్ణిపట్టు సుమ్మా**

**ఇరుక్కవేండియమ నానే"**

**దీనికి తెలుగు తాత్పర్యము :**

**నేను చేస్తాను,చెయ్యను. ఇది నీకు సంబంధించినది కాదు. నీవు చేయవలసినదల్లా, శరణాగతి. ఇది, అది అని తలచకుండా మౌనంగా ఉండటమే!**

భగవాన్ తమిళం లో చెప్పినప్పుడు "సరెండర్" అనే ఆంగ్లపదం ఉద్గతమైంది . ఇది ఒక విశేషం ! ఇంతే కాకుండా మరో ముఖ్యవిషయమేమంటే భగవాన్ తమను "నేను" అంటూ ఉత్తమ పురుషలో పేర్కొని కర్తవ్యాన్ని తమపై నిలుపు కోవటం. ఇంతకంటే అభయం ఏమి కావాలి ? ఇంతకంటే మరే విధంగా అభయం తెలియజేయగలరు? ఇట్లా భగవాన్ ఉన్నతోన్నతమైన శరణాగత మార్గాన్ని ప్రభోదించి భక్తులకు అభయం ఇచ్చారు .

నేను ఎప్పుడూ సహజంగా శరణాగతి మార్గాన్ని అనుసరించే వాన్ని. నా బాధ్యతలను భారాలను భగవాన్ పై వుంచి సర్వమూ ఆయనకే వదలి నా శక్తి అనుమతించినంత వరకు శరణాగతి చెందటమే చేతనౌను. ఇప్పుడు భగవాన్ తమ మహా సమాధి ముందుగూడా ఈ మార్గాన్నే నాకు అనుగ్రహించారు. శరణాగతి ని ఇట్లు చెప్పుకోవచ్చు.

**"నీవు చేయవలసినదల్లా శరణాగతి చెందటమే! సకలమూ నాకు వదులు. నిజంగా పరిపూర్ణ శరణాగతి చెందినవానికి గురువు – "ఇది చేయలేదు , అది చేయలేదని ఫిర్యాదు చేయటానికి అవకాశం లేదు".**

నిజానికి శరణాగతి అనేది సరికొత్త మార్గం కాదు . అనుశ్రుతం వస్తున్నదే. కాని ఇప్పుడు ప్రత్యేక పరిస్థితుల్లో భగవాన్ నాకు భోదించడం మహాభాగ్యమని భావిస్తున్నాను .

భగవాన్ ఇట్లా కావాలనే అనుగ్రహించారు. ఇది యాదృచ్ఛికం కాదని గాఢంగా నమ్ముతున్నాను. ఈ భోధామృతం నాకు గొప్ప శాంతిని, స్థిమితాన్ని ఇచ్చింది. ఏది ఎట్లా జరుగుతున్నా, భగవాన్ నావంకే చూస్తున్నారు. సందేహంలేదు. భగవాన్ వంక చూడటం లేదని నా కొరకు –"ఇది చేయలేదు, అది చేయటంలేదు" అని తలచటం వెర్రితనం.

జగద్రక్షకుడైన భగవాన్ సర్వదా కాపాడుతూనే వున్నా, ఈ అభయాన్ని అనేకసార్లు భగవాన్ చూపునుండి, మాటలనుండి అంతేకాక నిజజీవితంలో అనుభవపూర్వకంగా కూడా గ్రహించాను. జగదీశ్వరుడైన శ్రీ రమణదేవునకు శరణాగతి చెందుదము గాక!

**అమ్మా! మనం ఏమీ చేయలేము – చేయకుండా ఉండలేము. ఆ మహనీయుడు ఎలా ఆడిస్తే అలా ఆడవలసిందే. సర్వస్య శరణాగతి చేసి కుర్చోవలసిందే. వారెలా అడమంటే అలా ఆడవాలసిందే. మనం తప్పులు చేసి బాధలు తెచ్చుకుంటూ ఉంటే ఆ మహనీయుడు చూస్తూ**

**ఊరుకుంటాడా?** అందరి విషయం వేరు, మన విషయం వేరు. నిశ్చింతగా ఉండడమొక్కటే మనం చేయవలసింది . అంతామంచిగా ఉండాలని ఆశించు చున్నా.

**<u>ఉదాసీనో గతవ్యధః సర్వారంభ పరిత్యాగీ మయోద్భక్త స్సమే ప్రియః</u>**

గతాన్ని గూర్చి చింతించక, భవిష్యత్తుని గూర్చి ప్లాన్లు వేయక, live in the present లో ఉన్నవాళ్ళే నాకు మంచి భక్తులు. ఇది గీతా వాక్యము . శ్రీ మాస్టారి మాట. నిశ్చింతగా ఉండండి.

శ్రీ స్వామి వారు ఆశీస్సులు సదా మిమ్ము రక్షించాలని ప్రార్థిస్తూ

మీ పె.సుబ్బరామయ్య

1-8-05

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

## అడగకనే వచ్చే భగవత్సందేశం – సహాయం(తోడు) – దానికిమార్గము:

గొలగమూడి

2-8-05

Dear Sai,

నిన్న శరణాగతిని గూర్చి శ్రీరమణమహర్షిగారి వాక్యం వ్రాసాను. ఇందులో శ్రీమాధవదాసుగారి ఆచరణ ఎంతగొప్పగా ఉందో గమనించాలి. శ్రీమాధవదాసు గారు మరియు వారి గురువుగారు యమునానదీ తీరాన ఘోరారణ్యములో పోతున్నారు. గురువుగారు నడవలేనప్పుడు శ్రీమాధవదాసుగారు వారిని తన భుజాన ఎత్తుకుని నడిచిపోతున్నాడు. ఒక చోట గురువుగారు తనకు దాహం అధికంగా ఉన్నదనియు తనను ఒక చెట్టు నీడన దించి తాగేందుకు నీరు తెమ్మని మాధవదాసును అడుగుతాడు. అప్పుడు మాధవదాసుగారి స్థానంలో నేను ఉంటే - ఓ గురువుగారు ఈ ఘోరారణ్యములో నీరు ఎక్కడుందో తెలియదు. నా కాళ్లకు చెప్పులు లేవు. కనుక

దయచేసి కొంతసేపు ఓపిక పట్టండి. ప్రక్క గ్రామానికి చేరి తాగుదాము. నా పైన ఎక్కండి మోసుకుపోతాను ,అని సలహా ఇచ్చే వాడిని. కానీ మాధవదాసు గురువుగారి మాటకు ఎదురుచెప్పని ఉత్తమ శిష్యుడు. వెంటనే చెంబు తీసుకుని నీటికొరకు ఆ ఘోరారణ్యములో వెతుకుతూ వెళుతాడు. నీటి కొరకు వెతికి వెతికి వేసారి దారి తప్పి చాలా తీవ్రంగా బాధపడుతున్నాడు. అలాంటప్పుడు తన గురువు గారు హంసరూపములో ఆకాశమున వచ్చి మాదవదాసుకు ఎండ తగలకుండా గొడుగువలె ఆ హంసలు నీడనిచ్చి నీరు చూపుతాయి. హంసలు మనుష్యభాషను అర్థం చేసుకుని మనుష్యభాషలో మాట్లాడుతాయి. **ఇదంతా మాధవదాసు గురువు మాటకు ఎదురు చెప్పకుండా నీటికొరకు ప్రయత్నము కాదు తీవ్రాతితీవ్ర ప్రయత్నం చేసినందున జరిగింది. అలాంటి ప్రయత్నమే చేయకుంటే కథ అడ్డం తిరిగి ఉండేదే.** ఈ కథను చదివి వినిపించు కోవడం ద్వారా శ్రీవెంకయ్యస్వామి వారు మనకు శిష్యుడంటే ఎలా ప్రవర్తించాలా అనేదాన్ని బోధిస్తున్నారు. ఈ బోధను జన్మ సంస్కారముగల రోశిరెడ్డి ఆచరించి చూపారు. తనకు కళ్ళు కనపడని చివరి దశలోకూడా ఆహారం తీసుకోనందున బలహీనంగా చాలా బలహీనంగా ఉండే దశలో కూడా శ్రీస్వామివారి ఆజ్ఞమేరకు నిత్యం బిక్ష చేయడమే కార్యం నెరవేర్చాలని తీవ్ర ప్రయత్నం చేశాడు. గనుకనే భిక్షాటయానికి స్వల్పంగా చూపువచ్చి కొండంత బలంవచ్చేది. దీక్షనుంచి ఆశ్రమం చేరగానే చూపుపోయి బలంపోయి పడుకునేవాడు. అదేగురుమహిమ. **కనుక గురువుగారి ఆజ్ఞను పాటించి తీవ్రాతితీవ్ర ప్రయత్నం చేయడమే మన కర్తవ్యం. మిగిలినదంతా వారి దయ.** శ్రీస్వామివారి కృప సదా మీకు ఉండాలని ప్రార్థిస్తూ,

మీ

పె. సుబ్బరామయ్య.

********* **సద్గురు దేవా శరణం శరణం** *********

**భగవంతునిపై ఆధారపడే మార్గం – శరణాగతి – సర్వప్రేరణాధికారి – అన్నఎరుక**

గొలగమూడి

27-7-05

Dear Sai,

Total Surrendar,

**సంపూర్ణ శరణాగతి అంటే ఎలా ఉండాలా అనేది శ్రీమాస్టారి ఆచరణ మనం బాగా యోచించి తెలుసుకోవాలి**. విద్యానగర్ గలాటాల కారణంగా వారు అక్కడ ఉంటే మాస్టర్గారిని కొట్టాలని ధనుంజయ బంధువర్గము, ఆయన మీద ఈగవాలితే కొన్ని తలలు ఎగిరిపోతాయి అని కాలేజీ స్టూడెంట్సూ. మాస్టర్ ఇంటి సమీపాన చుట్టూ ఇండ్లలో పదింటికి 4 or 5 students బిచ్చువ కత్తులు, కర్రలు మారణాయుధాలతో రెడీగా ఉన్నారు. అట్టి సమయములో శరత్బాబు శ్రీమాస్టార్ని పర్మినెంట్గా ఒంగోలులో ఉంచుకోవాలని ఉద్దేశంతో కారు తెచ్చి మాస్టారు ఇంటి ముందుపెట్టి రెండురోజులు మీరు విద్యానగర్వదిలి వెళ్ళిపోతే తగ్గిపోతుంది. వేడి తగ్గినాక తిరిగిరావొచ్చు. కారు ఎక్కండి అని ఒకపార్టీ, ధర్మం మనప్రక్క ఉంది. సాయి మన ప్రక్క ఉన్నాడు. వాళ్లకు భయపడి పారిపోబళ్ళేదు. రమ్మను ఎవడినో చూస్తావాళ్లంతు అని మరొకపార్టీ - ఈ ఇరువురు పార్టీల మధ్య ఊగిసలాడే మధ్యవర్తులు అటు ఇటు చెప్పలేనివారు మరొకపార్టీ తయారయ్యారు. అట్టి విపత్కర భయానిక పరిస్థితిలో సంపూర్ణ శరణాగతి చెందిన మహనీయమూర్తి అయినా శ్రీమాస్టారు చెప్పారు. మీరంతా ఒక అరగంట ఇక్కడి నుండి వెళ్ళిపోయి తిరిగిరండి. నేను సాయిని అడిగి చెప్తాను అని వారిని రూమ్నుండి పంపేసి ఒక అగరువత్తి వెలిగించి సాయికి సమర్పించి మామూలు గళ్ళలుంగీ బన్నీనుతో కూర్చొని (సత్సంగరూములో) బాబా నాకు పోవాలని లేదు. ఉండాలని లేదు. మీరు ఉండమంటే ఇక్కడే ఉంటా పొమ్మంటే ఇక్కడనుండి వెళ్లిపోతా. అరగంటలోగా ఈ రూములోకి మొదట ఎవరు ప్రవేశించి ఏ సలహా ఇస్తారు దానిని ఆచరిస్తాను. ఎవరి ద్వారా పలుకుతారు మీ అభిప్రాయం తెలపండి అని కూర్చున్నారు. వారి ఆంతర్యంలో

విద్యానగర్వాళ్లే ఏదో ఒకపార్టీవారు వచ్చి ఏదో సలహా ఇస్తారు అని అనుకున్నారట. కానీ ఊరికి కొత్త ఆయన అనంతపురం రావడం వస్తూనే వాకిట్లో నుండి "సార్ ఎక్కడికో వెళ్లేట్లున్నారు ఈ పూలు పండ్లు తీసుకొనిపోండి" అని అన్నారు. ఆ తర్వాత మాస్టార్ అన్న మాటలు నీకు తెలుసు కదా బస్సులో ఎవరితో మాట్లాడావు, బస్టాండ్లో ఎవరితో మాట్లాడారు, నేను ఎవరితో మాట్లాడలేదు సార్. అయితే కొత్తవాడివి కదా ఈ గ్రామానికి ఎవరితో మాట్లాడకుంటే నా ఇల్లు నీకు ఎలా తెలిసింది? లేదు సార్. బస్టాండ్లో ఫలానా ఇంగ్లీషులెక్చరర్భరద్వాజ గారి ఇల్లు ఎక్కడ అని మాత్రం అడిగాను. వాళ్లు ఈ రోడ్డుని పో కుడివైపు చివరి ఇల్లు. ఇంటి ముందు బావి ఉంది. ఆ ఇంటి అవతల ఇండ్లులేవు అని చెప్పారు. ఇక్కడకు వస్తే ఎదురుగా మీరున్నారు అన్నాడు. అయితే వాకిట్లోకి వస్తూనే మీరెక్కడకో పోయేటట్లు ఉన్నారు ఇది తీసుకుని వెళ్ళండి అని పండ్లు పూలు చూపారే నేను ఎక్కడికైనా పోయేటట్లు ఉన్నానని మీకు ఎలా తెలిసింది? అని అడిగారు. Very Sorry sir (వెరీ సారీ సార్) నాకు ఊరకలా అనిపించి అలా అనేశాను అంతేగాని మీరు పోతున్నారని నాకు ఎవరూ చెప్పలేదు అన్నాడు. సరే ఇదే బాబా సంకేతమని కారు వస్తే దానిలో చొక్కా వేసుకుని వెళ్లిపోయారు.

**ఇక్కడ సంపూర్ణ శరణాగతి ఎలా ఉందో నీవు యోచించు. వారు వెళ్లేందుకు సిద్ధమే కానీ బాబా ఆదేశానికి ఎదురు చూశారు.** వారు ఆజ్ఞాపించినట్లు కారు ఎక్కుతున్నారు. వెంకటగిరి వెళ్లి సత్సంగాలు చేస్తూ ఒంగోలు పోతున్నాడు **కాని ఓ బాబా, నీవేనన్ను ఎక్కడికైనా నీ యోగశక్తితో తీసుకుపో లేకుంటే నీ యోగశక్తితో ఈ గలాటాలు లేకుండా చేయమని అడగలేదు.** నీవు ఆదేశిస్తే నేను కదిలిపోతాను అందుకు రెడీ. కదిలిపోయేందుకు రెడీ. (ఇక్కడ) అక్కడి నుండి నేను కదలను నీయోగశక్తితో నన్ను తీసుకుపో అనలేదు. నీవేమి చేస్తున్నావు. నేను టెన్షన్మానను, చదవలేను, నీ యోగశక్తితో నన్ను నడుపు అంటున్నావు. అది పద్ధతి కాదు **ప్రయత్నం మనంచేయాలి. శక్తినంతా వినియోగించి కృషి చేయాలి. ఒక్క అడుగు మనలను వేయమంటారు బాబా.**

**అప్పుడు తాను పది అడుగులు మన వైపు వేస్తారట. మనం ఒక్క అడుగైనా వేయిలేకుంటే, ఒక్క అడుగువేసే తీవ్రప్రయత్నమైనా చేయాలట. హృదయపూర్వక ప్రయత్నించేయి అంటారు. అప్పుడు నేను నా హస్తం అంటే అదృశ్యహస్తం ఇచ్చి నిన్ను రక్షిస్తాను, నడిపిస్తాను అంటారు**. కనుక మనవైపు నుండి తీవ్రాతితీవ్రమైన చదివే ప్రయత్నం ఉండాలంటారు. అంతా నీవు నడుపు అని పుస్తకాలు ముందేసి కూర్చోవడం తప్పు. **నీ డ్యూటీ నీవు సంపూర్ణంగా చెయ్యి శక్తినంతా వినియోగించి చెయ్యి. నా సహాయం వస్తుంది. దైవసహాయం ఎవరికి వస్తుంది? కష్టపడేవానికి వస్తుంది**. చెట్టు నీడ నుండి దైవమా నా బండి బురదలో ఇరుక్కుంది సహాయం చేయమంటే చెయ్యనే చేయడు సహాయం. సంపూర్ణ హృదయపూర్వక ప్రయత్నం చెయ్యాలి. భావాలు మట్టిగడ్డలు మానేయ్.

మీ

పె. సుబ్బరామయ్య.

*********** సద్గురు దేవా శరణం శరణం ***********

గొలగమూడి

16-03-1999

Dear Raja, Blessings !

నీవు ఎన్నో పారాయణలు చేస్తావు. అక్క గారి దగ్గర ఎంతో విన్నావు. కానీ ఇంకా చిన్న పిల్లల మనస్తత్వం పోలేదు!

**సద్గురుకు పగ్గాలు అప్పచెప్పడం అంటే ఏమిటి?**

**భగవంతుడు ఎంతో సన్నిహితంగా నిరంతరం మన వైపు చూస్తూ, మన మంచిచెడ్డలు చూస్తూ మనకు మంచినే చేస్తారనే నమ్మకం ఉంచుకోవాలి. ఆయన మన పిలుపుకు పలుకుతారా? అనే సంశయం ఉన్నప్పుడు కోరికలు కోరవచ్చు.**

**ఒక స్థితికి పోయాక అందరిలాగా కోరికలు కోరడం ఆయనకు సంతోషం కలిగించదు. ఇలాంటి జన్మలుఎన్ని రావాలో? వాటన్నింటిలో ఆయన అండ దండలు మనకు ఉండాలి కదా! అలాంటప్పుడు ఆయనకు బాధ కలిగించి మనం ఆయనకు దూరం కాకూడదు. నాకేమీ తెలియదు. నీ ఇష్టం వచ్చినట్టు చెయ్యి. నేను నీ అండన ఉండేటట్లు చేయి ప్రభు. ఏ ఋణానుభంధాలు ఎలా తీరుస్తావొ అంతా నీ దయ. నేను నిశ్చలంగా నా సర్వకర్మలు నీ సేవగా భావించి చేసే బుద్ధికుశలత ప్రసాదించు. కర్మసుకౌశలం అంటే ఏమిటో ఎలా ఆచరించాలో నాచేత చేయించు. నన్ను నీ వాడిగా చేసుకొని నిరంతరం నన్ను నీ ప్రక్కన ఉంచుకో. నీవు నా వాడివైతే నాకేమి కావాలి. నాకేమీ అక్కరలేదని హృదయపూర్వకంగా నిరంతరం ప్రార్థించు. కోరికలే మనల్ని ఆయనకు దూరం చేస్తాయి. నిరంతరం గుర్తుంచుకొని జీవిత యాత్ర సాగించు. నీవు నాతో ఏమి చేసుకుంటావో చేసుకో. నేను నీకు ఇంద్రియ లోలుడను అని మీకు తెలుసు. ఇలాంటి నన్ను నీ పరికరం గా మార్చుకో. కష్టాలే ముందు రావాలో సుఖాలే అనుభవించాలో ఎప్పుడు ఏది ఎలా జరగాలో నా కేమి తెలుసు. ఓ సర్వజ్ఞ మూర్తి నిరంతరం ఈ లౌకిక చింతల నుండి నన్ను దూరం చేసి పగ్గాలు హృదయ పూర్వకంగా నీ కప్పగించి, నిశ్చింతగా ఏ కోరికలు కోరకుండా జరిగేదంతా చూస్తూ ఉండగలిగే బుద్ధికుశలత ప్రసాదించు ప్రభు. అని మరల మరల ప్రార్థించు. అంతే తప్ప నాకు ఇది కావాలి అన్నా మంటే మనం ఆయనకు దూరం అవుతున్నానని గుర్తుంచుకో.**

నేనెప్పుడూ మాస్టర్ తో ఫోటో తీసుకోలేదు. ఒకసారి మాస్టారు ఫోటో తీయించుకుంటావా? అని అడిగారు. అందరు వెళ్ళమన్నారు. నేనేమో పలకలేదు. కావాలంటే వచ్చి తీయించుకో! అన్నారు. అందరు నన్ను వారి

దగ్గరకు నెట్టి ఫోటో తీశారు. అది రాలేదు. తీయించుకుంటావా అని మాస్టారు అడుగుతున్నారు. తీయించు కొందువురా అని అనలేదు కదా! నేను ఎందుకు వెళ్ళాలి. నేను పోలేదు. అందరూ తోసారు. అది రాలేదు. వారికి ఇష్టం ఉంటే పిలుస్తారు కదా! మనకి ఇష్టాయిష్టాలు లేకుండా ఉండగలగటమే సాధన. ఆశ పోతే అంతా పోతుండ్లయ్యా అన్నారు శ్రీ స్వామి. ఆశ అంటే ఇష్టమే. ఇష్టాయిష్టాల నుండి బయటపడడమే సాధన. **సాధన అంటే నైవేద్యాలు, కర్పూర హారతులు, పూలమాలలు కాదు. నిజమైన సాధకుడుగా నిలవాలని శ్రీస్వామి వారి కోరిక అంతేకాని కష్ట సుఖాలకు బెంబేలెత్తే బేలవు కాకూడదు. పదిమందికి నీడనిచ్చే వృక్షంగా మనం రూపుదాల్చాలి, అంతే కానీ పది మందిని ఆశించేవారము కాకూడదు. మరలా మరలా శ్రీ మాస్టారు రచనలు చదువు పారాయణలు అని తొందరపడవద్దు . సత్యం హృదయగతం చేయమని శ్రీ మాస్టార్ని ప్రార్థించు. ఆయన నిత్య సత్యుడై నిరంతరం మనను కనిపెట్టి నడుపుతూ సరైన సమాధానమిచ్చేందుకు రెడీగా ఉన్నారు. ఆ అసమాన సద్గురు మూర్తి ఆదేశాలను స్వీకరించి నడచుకునేటట్లు మన బుద్ధిని మలచమని ప్రార్థించు.**

ఆశీసులతో

పె. సుబ్బరామయ్య

## ********* సద్గురు దేవా శరణం శరణం *********

ఈ అమృత లేఖావళి లోని ప్రతీ భావం హృదయగతం చేయమని, మన ఆచరణలో ఆ ఎరుకను నిలిపి నడిపించమని శ్రీ సార్ ను ప్రార్థిస్తూ – SMST